అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 31-10-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 252 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల: 6.50



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు

దీపావళి శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా గురువారం పత్రికకు సెలవు.

శుక్రవారం సంచిక వెలువడదు.

పునఃదర్శనం శనివారం

- చీఫ్ జనరల్ మేనేజర్

పట్టణీకరణ పేరుతో
పల్లెలు మాయం!

జిల్లాల్లోని మున్సిపాలిటీలు, గ్రామాలను కలుపుతూ ప్రభుత్వ నిర్ణయం

రాష్ట్రంలో కొత్తగా 13 పట్టణాభివృద్ధి సంస్థలు | ఆరు అథారిటీల పరిధి విస్తరణ

80 శాతం గ్రామాలు పట్టణ పరిధిలోకి..

అభివృద్ధి కోసమేనంటున్న అధికారులు

ప్రజలపై పన్నుల భారం

ప్రజాభిప్రాయాలకు భిన్నంగా నిర్ణయాలపై అనుమానాలు

నగరీకరణ పేర పల్లెటూర్ల ఉనికే లేకుండా పోయే ప్రమాదం భవిష్యత్తులో రానుందా? అంటే అవుననే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. రాష్ట్రంలో కొత్తగా 13 పట్టణా భివృద్ధి సంస్థలను (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి జీవోలు కూడా విడుదలైనాయి. వాటితో పాటు గతంలో ఉన్న ఆరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిని విస్తరిస్తూ ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. ఇందులో కొత్తగూడెం, కామారెడ్డి, మంచిర్యాల, కాగజ్ నగర్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట, వనపర్తి ఉన్నాయి. వాటితో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్ (శాతవాహన), సిద్దిపేట, వేములవాడ, ఖమ్మం(స్తంభాద్రి) పరిధి విస్తరణ పెంచింది. ఆయా జిల్లాల్లో మున్సిపాలిటీలతో పాటు మెజార్టీ గ్రామాలను ఆయా పట్టణాభివృద్ధి సంస్థలలోకి కలుపుతూ ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి/విలేకరులు

రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 11,492 పంచాయతీలను ప్రభుత్వం యూడీఏల పరిధిలో చేర్చింది. దీంతో 80 శాతం పైగా భూభాగం రాష్ట్రంలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోకి వచ్చినట్టయిందని పురపాలక శాఖ అధికారులు చెబుతున్నారు. ఏపీలో 93శాతం యూడీఏల పరిధిలోకి చేర్చారు... రాష్ట్రంలో ములుగు, ఆసిఫాబాద్, ఖమ్మం, భద్రాది కొత్త గూడెం వంటి ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలు తప్ప మిగిలిన ప్రాంతాన్ని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోకి తీసుకొచ్చామని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఒక్క వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ పరిధిలోనే కొడంగల్, వికారాబాద్, తాండూర్, పరిగి నాలుగు మునిసిపాలిటీలు, 493 గ్రామాలను చేర్చారు. దీంతో ఆ జిల్లాలో 90 శాతంపైగా యూడీఏ పరిధిలోకి వచ్చినట్టయింది. మిగతా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. గతంలో కార్పొరేషన్ పరిధి వరకే అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ఉండేది. ఆ మేరకు కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన అమృత్ పథకం కింద రాష్ట్రానికి నిధులు వచ్చేవి. ప్రభుత్వం వాటి పరిధిని విస్తరించడంతో పాటు మరికొన్ని పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేస్తుండడంతో కేంద్రం ... 11లో

భయాందోళనలు...

కొత్త శోభ పేరిట పల్లె జనాలపై కార్పొరేషన్ పన్ను పోటు వేసేందుకు, పేదలకందే ఉపాధి పనుల్ని లేకుండా చేసేందుకు కుట్ర సాగుతోందనే అనుమానాలు ఉన్నాయి. ఇప్పటికే హైదరాబాద్ శివారుల్లోని పలు మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల్లో అంతకుముందు జరిగిన ఉపాధి హామీ చట్టం పనులకు నిధులు విడుదల అయినా.. ఇప్పటివరకు అందలేదు. విలీనం గాకముందు పనులు జరిగాయి. విలీనం ... 11లో

కార్పొరేషన్ పన్నుపోటు..

సంగారెడ్డి పట్టణాభివృద్ధి సంస్థలో ఐదు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్‌లో విలీనం చేసే 50 గ్రామాల్లో వివిధ రూపాల్లో కార్పొరేషన్ పన్నుల భారం పడనుంది. గ్రామ పంచాయతీ స్థాయిలో వివిధ భవ నాల నిర్మాణాలకు అనుమతులు, ఆస్తి పన్ను, నీటి పన్ను, లైసెన్స్ పన్ను, లేఅవుట్లకు అనుమతుల విషయంలో సాధా రణమైన పన్నులు మాత్రమే ఉన్నాయి. ఇకపై మున్సిపాలిటీలుగా మారే 40 గ్రామాల్లో సంగారెడ్డి కార్పొరేషన్‌లో విలీనమయ్యే పది గ్రామాల్లో కార్పొరేషన్ స్థాయి పన్నుల భారాలు పడతాయని ప్రజలు ఆందోళన చెందు తున్నారు. పైగా ఏడేనిమిది కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు రోడ్లే సరిగాలేవు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, పార్కుల వంటి మౌలిక సదుపాయాలూ లేవు. అయినా పన్నుల వసూల్లు మాత్రం జరుగుతు న్నాయి. ఇప్పటికే తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీల్లో కలిపిన గ్రామాల్లో ఇదే జరుగుతోంది.నాగర్ కర్నూల్‌లో నాలుగు మున్సిపాలిటీలు 315 గ్రామపంచాయతీలతో అర్బన్ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. వనపర్తి లో ఐదు మున్సిపాలిటీలు 210 గ్రామపంచాయతీలతో అర్బన్ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. మహబూబ్ నగర్‌లో గతంలో 26 గ్రామపంచాయతీలు మూడు మున్సిపాలిటీలతో ఏర్పాటు కాగా ఇప్పుడు 153 గ్రామపంచాయతీలతో ఏర్పాటు చేశారు. రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పెద్దపల్లి జిల్లాలోని ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు, 180 గ్రామాలు కలవనున్నాయి. సూర్యాపేటలో కోదాడ, హుజురాబాద్, తిరుమలగిరి, నేరుడుచర్ల, నాగోల్ మున్సిపాలిటీలతో పాటు సూర్యాపేట జిల్లాలోని 21 మండలాల్లోని 264 గ్రామాలు కలుస్తాయి.



కులగణన తర్వాతే కేంద్రంపై యుద్ధం

తెలంగాణ నుంచే మొదలు

- నవంబర్ 30లోపు పూర్తి
- ఎక్స్‌రే మాత్రమే కాదు... మెగాహెల్త్ చెకప్
- గాంధీ కుటుంబం మాట అంటే మాటే
- ఇది నాకు పార్టీ ఇచ్చిన గుర్తింపే...
- పార్టీకి నష్టం చేకూరేలా మాట్లాడితే సహించం
- ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి : కులగణన అవగాహన సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆర్థిక అసమానతలు, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. నవంబర్ 30లోగా కులగణన పూర్తి చేసి ప్రధాని నరేంద్రమోడీపై భవిష్యత్ యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అది తెలంగాణ రాష్ట్రం నుంచి మొదలు అవుతుందన్నారు. కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదు.. ఇది మెగా హెల్త్ చెకప్ లాంటిదని అభిప్రాయ పడ్డారు. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. గాంధీ కుటుంబం మాట ఇచ్చిందంటే అది శిలాశాసనమని చెప్పారు. మాట అంటే మాటే అన్నారు. ఆ కుటుంబం ఇచ్చిన మాట ప్రకారం కుల గణనను చేపడుతున్నట్టు తెలిపారు. ఆ చర్చకు తావు ఇచ్చారంటే పార్టీ ... 2లో

ప్రభుత్వ ఉద్యోగులకు
తీపి కబురు

- దీపావళి సందర్భంగా డీఏ ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. 3.64 శాతం కరువు భత్యం (డీఏ) పెంచుతూ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ ... 11లో



సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు
దీపావళి కానుక

డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన ప్రభుత్వం


- దస్త్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకం-
- 7.65 లక్షల మందికి ప్రయోజనం

వివరాలు 11లో

సచివాలయంలో భారీగా ఉద్యోగుల బదిలీ

నవతెలంగాణ బ్యూరో హైదరాబాద్

తెలంగాణ సచివాలయంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న 26 మంది ఉద్యోగులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఏడుగురు అదనపు కార్యదర్శులు, ఏడుగురు సంయుక్త కార్యదర్శులు, 12 మంది డిప్యూటీ కార్యదర్శులను, వారు పని చేస్తున్న శాఖల నుంచి ఇతర శాఖలకు బదిలీ చేసింది. బదిలీ అయిన అధికారులను వెంటనే రిలీవ్ చేసి కొత్త వారిని ఆయా శాఖలు విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.



టీటీడీ చైర్మెన్‌గా బీఆర్ నాయుడు

- తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు

వివరాలు 11లో



ఈఆర్సీ నూతన చైర్మెన్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) నూతన చైర్మెన్‌గా నియమితులైన జస్టిస్ దేవరాజు నాగార్జున్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వెంగళరావునగర్‌లోని విద్యుత్ నియంత్రణ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. తెలంగాణ రాష్ట్ర ఉత్తర, దక్షిణ ... 2లో

దిగిరానంటున్న ధరలు

అత్యవసర ఔషధ ధరలకూ రెక్కలు - పెట్రోలియం ఉత్పత్తులపై మితిమీరిన వడ్డనలు

- సామాన్యుడి జేబుకు చిల్లులు
- నిద్రావస్థలో ప్రభుత్వం



న్యూఢిల్లీ : దేశంలో నిత్యావసరాల ధరలు ఆకాశం వైపు చూస్తున్నాయి. పండుగ రోజులలో పేదలు పస్తులతో కాలక్షేపం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వమేమో నిద్ర పోతోంది. ధరల సగటు పెరుగుదల తొమ్మిది నెలల గరిష్ట స్థాయి 5.5 శాతాన్ని చేరుకుంది. మరింత ఆందోళన కలిగించే విషయమేమంటే ఆహార పదార్థాల ధరలు 9.2 శాతాన్ని దాటేశాయి. వీటిలో కూరగాయల ధరలైతే సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. వీటి ధరలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి తప్పించి దిగింది లేదు. టమాటా ధరలు 42.4 శాతం, ఉల్లిగడ్డల ధరలు 66.2 శాతం, బంగాళదుంపల ధరలు 65.3 శాతం పెరిగి పేదలు, మధ్యతరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. దేశంలో ఈ మూడు కూరగాయలే ఎక్కువగా వినియోగమవుతాయి.

అదుపు తప్పుతున్న కుటుంబ బడ్జెట్

ప్రభుత్వం, దానికి వంత పాడే ఆర్థికవేత్తలు మాత్రం ధరల పెరుగుదలకు వాతావరణ పరిస్థితులే కారణమని బుకాయిస్తున్నారు. కానీ వాస్తవమేమంటే కొన్ని కూరగాయల ధరలు వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నాయి. ధరల పెరుగుదలతో ఇప్పటికే కుటుంబ బడ్జెట్ అదుపు తప్పుతోంది. కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతుండడంతో కోట్లాది రూపాయల ప్రజల సొమ్ము బడా, హోల్‌సేల్ వ్యాపారుల జేబుల్లో చేరుతోంది. ప్రజలు నిత్యం వినియోగించే అనేక ఇతర వస్తువుల ... 10లో

ఫలితమివ్వని చర్యలు

ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు రిజర్వ్‌బ్యాంక్ చర్యలు తీసుకుంటున్నప్పటికీ అవి ఫలితాన్ని ఇవ్వడం లేదు. 2016 మే నుండి వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆర్‌బీఐ విధించిన ద్రవ్యోల్బణ లక్ష్యాన్ని (4 శాతం) పలు సందర్భాలలో దాటేసింది. ఆర్‌బీఐ విధించిన 6 శాతం గరిష్ట లక్ష్యాన్ని కూడా అది అధిగమించింది. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే విషయంలో ఆర్‌బీఐ తీసుకుంటున్న చర్యలు ప్రజా ప్రయోజనాలకు కాకుండా కార్పొరేట్ బాగోగులకే ఉపకరిస్తున్నాయి. ఎందుకంటే అవి బ్యాంక్ రుణ రేట్లు, ఇతర ద్రవ్య విధానాలతోనే ముడిపడి ఉంటాయి. ధరలను అదుపు చేస్తామని ప్రభుత్వం పదేపదే హామీలు గుప్పిస్తున్నప్పటికీ దాని విధానాలు మాత్రం అస్తవ్యస్తంగా ఉంటున్నాయి. నిర్దిష్టమైన చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తి ఉదాశీనత ప్రదర్శిస్తోంది.

మయోనైజ్‌పై నిషేధం

ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌కు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశం



- అధికారులతో రివ్యూ
- కొత్తగా 3 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్, 5 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్
- ఫిర్యాదుల స్వీకరణ కోసం జిల్లాకో గ్రీవెన్స్ సెల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న మయోనైజ్‌ను నిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో ఫుడ్ సేఫ్టీపై మంత్రి సమీక్షించారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లతో నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. 235 హోటళ్లు, హాస్టళ్లు, స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్, గోడౌన్స్‌లో తనిఖీలు చేశామనీ, 170 సంస్థలకు నోటీసులు ఇచ్చామని జీహెచ్ఎంసీ టాస్క్‌ఫోర్స్ అధికారులు మంత్రికి వివరించారు. జిల్లాల్లోనూ విరివిగా తనిఖీలు చేయాలని మంత్రి సూచించారు. ఇందుకోసం రెండు టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించాలని సూచించారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మోమోస్ తిని పలువురు అస్వస్థతకు ... 11లో

మోకిల పీఎస్‌లో కేటీఆర్ బావమరిది

- విచారణకు రాజ్ పాకాల హాజరు

వివరాలు 11లో..

అదో సాలెగూడు

ఇన్‌స్టెంట్ లోన్ యాప్స్ మాయాజాలం

- అప్పు స్వల్పం...వడ్డీ అధికం
- నిమిషాల వ్యవధిలోనే రుణం
- వలలో చిక్కితే అంతే సంగతులు

అవసరాల కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడం సర్వసాధారణంగా జరిగే పనే. అయితే ఇందుకు కొన్ని లాంఛనాలను పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ ఇన్‌స్టంట్ లోన్ యాప్స్‌లో ఆ పేచీ ఉండదు. అధిక వడ్డీ చెల్లించగలిగితే చాలు.. నిమిషాల్లో అప్పు పుడుతుంది. 'ఐదు లక్షల రూపాయల తక్షణ రుణం పొందండి. నెలసరి వడ్డీ 1.58 శాతంతో ప్రారంభమవుతుంది. వార్షిక వడ్డీ 19 శాతం' అంటూ ఈ యాప్స్ ఊరిస్తుంటాయి. కొన్ని యాప్స్ అయితే 22 శాతం వరకూ వడ్డీ వసూలు చేస్తున్నాయి. బ్యాంకింగ్ యేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) విధించే వడ్డీ రేటు అధికంగానే ఉన్నప్పటికీ ప్రజలు దానిని పెద్దగా పట్టించుకోరు. ఎందుకంటే రుణం చాలా సులభంగా అందుతుంది. కానీ, ఒక్కసారి ఈ డిజిటల్ లోన్ యాప్స్ వలలో పడితే అంతే సంగతులు... సాలెగూడులో చిక్కుకున్న కీటకం మాదిరిగా విలవిలలాడాల్సిందే.

విలాసాల కోసం ఊబిలో కూరుకుపోతున్న ప్రజానీకం

జీవితమంతా చెల్లింపులకే

న్యూఢిల్లీ : రుణ యాప్‌లు కేవలం పది నిమిషాల వ్యవధిలోనే పది వేల రూపాయల నుంచి ఐదు లక్షల రూపాయల వరకూ అప్పు ఇస్తాయి. క్రెడిట్‌బీ అనే యాప్‌ను దేశంలో 14 కోట్ల మంది విశ్వసిస్తున్నారంటే వాటి ప్రభావం ఎంత ఉన్నదో అర్థమ వుతుంది. విలాసవంతమైన వస్తువుల కొనుగోలు కోసం ఈ యాప్ సంస్థల నుంచి పెద్దమొత్తంలో రుణాలు తీసుకుం టున్న వారి సంఖ్య ఇటీవలి కాలంలో బాగా పెరుగు తోంది. పెరుగు తున్న కుటుంబ ఖర్చులు, ఆర్థిక అస్థిరత, వ్యక్తిగత అవసరాలు, ఆడంబ రాల కోసం అధిక వడ్డీతో రుణాలు తీసుకుంటున్నారు. చివరికి జరిగేదేమిటి? వచ్చిన జీతమంతా చెల్లింపులకే సరి పోతోంది.



క్రెడిట్‌బీ, పూనావాలా ఫిన్‌కార్ప్, చిన్మే ఫిన్‌లీజ్, ట్రూ బ్యాలెన్స్ వంటి యాప్స్ రుణ గ్రహీతలకు నరకం చూపిస్తుంటాయి. రుణం స్వల్పమే అయినా వడ్డీ అధికం ఏ మాత్రం భద్రత లేకుండా బ్యాం కులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఇస్తున్న రుణాలు ఆర్‌బీఐని కలవరపరుస్తున్నాయి. దీనిపై గత నవంబరులో కేంద్ర బ్యాంక్ కొన్ని చర్యలు తీసుకుంది. అవి కొంతమేర సత్ఫలితాన్ని ఇచ్చాయి. కానీ యాప్స్ ద్వారా రుణాలు తీసుకుంటున్న వారిని నిరుత్సాహ పరచలేకపోయాయి. ప్రజల నుంచి అధిక వడ్డీ గుంజుతున్న రెండు మైక్రో ఫైనాన్స్ సంస్థలు సహా నాలుగు ఎన్‌బీఎఫ్‌సీలపై రిజర్వ్‌బ్యాంక్ కొద్ది వారాల క్రితం నిషేధం విధించింది. అధిక వడ్డీలు, ప్రాసెసింగ్ ఫీజులు, జరిమానాలు విధిస్తున్న ఎన్‌బీఎఫ్‌సీలను ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఇటీవలే హెచ్చరించారు. తమ ... 2లో

కులగణనపై సలహాలు, సూచనలకు ఆహ్వానం

● టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణనపై రాష్ట్రంలోని ప్రముఖులు, మేధావుల సలహాలు, సూచనలు తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. నవంబర్ 2న అన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాసంఘాల నాయకులతో సమావేశమై సలహాలు తీసుకుంటామని చెప్పారు. వచ్చే నెల 5న లేదా 6న మేధావులతో కులగణనపై సమాలోచన చేస్తామన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మాజీ ఎంపీలు వి. హనుమంతరావు, మధుయాష్కీగౌడ్, సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, విప్ అది శ్రీనివాస్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. జనాభాలో ఆయా కులాలు ఎంత శాతం ఉంటే అంత వాటా రావాలంటూ చెప్పిన బలంగా చెప్పిన మొనగాడు రాహుల్‌గాంధీ అని కొనియాడారు. కులగణన సమగ్రంగా నిష్పక్షపాతంగా జరగాలని కోరారు. ఓబీసీ కులగణన తీర్మానాన్ని కేంద్రానికి పంపిస్తామని చెప్పారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న అపోహలను ప్రజలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. సమగ్ర కుటుంబ సర్వేను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం టేబుల్ చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వ అరాచకాలపై ఈ ప్రభుత్వం ఎప్పుడు చర్యలు తీసుకుంటుందా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారని గుర్తు చేశారు.

నందనవనం ఆక్రమణదారుల తొలగింపు

● రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని నందనవనం కాలనీలో ప్రభుత్వం నిర్మించిన గృహాలను ఆక్రమించిన వారిని తక్షణం ఖాళీ చేయించి అర్హులైన వారికి అందించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఇదే అంశంపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఇండ్లను ఆక్రమించుకున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. నందనవనంలో 2019 జెఎన్‌యూఆర్‌ఎం పథకం లబ్దిదారుల ఇండ్లను కొంతమంది ఆక్రమించుకున్నారని ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించగా, తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అలాగే మంకాల్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపులో ఉన్న న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, ప్రజావాణి నోడల్ అధికారి డి.దివ్య, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈఆర్సీ నూతన చైర్మెన్ బాధ్యతల స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థల సీఎమ్‌డీలు వరుణ్‌రెడ్డి, ముషారఫ్ ఫారూఖీ, ట్రాన్స్‌కో జేఎమ్‌డీ శ్రీనివాసరావు, జెన్‌కో డైరెక్టర్లు, పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన్ని అభినందించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన జస్టిస్ దేవరాజు నాగార్జున్ మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి, అక్కడే రిటైర్డ్ అయ్యారు. అంతకుముందు ఆయన గుల్బర్గాలోని ఎస్ఎస్ఎల్ కళాశాలలో న్యాయశాస్త్ర విద్యను అభ్యసించారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం చేశారు. 1986లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. 1991 మే 1వ తేదీ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2022 అక్టోబర్ 18న హైకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. అనంతరం 2023 ఏప్రిల్ 6 మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయ్యి, అక్కడే పదవీ విరమణ చేశారు.

నేడు మహామనిషి డాక్టర్ ఏ.యస్.రావు చిత్ర ప్రసారం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

పద్మభూషణ్, డాక్టర్ ఏ.యస్.రావు వర్ధంతి సందర్భంగా ,హైదరాబాద్ దూరదర్శన్ యాదగిరి చానెల్‌లో అక్టోబర్ 31న (గురువారం) ఉదయం 10 గంటలకు "మహామనిషి డా.ఏ.యస్.రావు" చిత్రం ప్రసారం కానున్నది. తెలుగు జాతి ఆణిముత్యం ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్ పద్మభూషణ్, డా.ఏ.యస్.రావు జీవిత సంగ్రహాన్ని తెలిపే చిత్రమిది. ఈ చిత్రాన్ని దాశరథి ఫిలిం సొసైటీ సమర్పణలో డా.ఎ.యస్.రావు విజ్ఞాన వేదిక నిర్మించింది.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం తెలంగాణ కాన్సిట్యూషన్ క్లబ్

● సర్కారు నిర్ణయం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, మాజీ సభ్యుల సౌకర్యార్థం హైదరాబాద్‌లోని ఆదర్శ్‌నగర్‌లో కొత్త ఎమ్మెల్యేల క్వార్టర్లల్లో తెలంగాణ నూతన కాన్సిట్యూషన్ క్లబ్‌ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బుధవారం శాసనసభలోని సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కౌన్సిల్ డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్ ముదిరాజ్ , లెజిస్లేచర్ కార్యదర్శి డా. వి నరసింహాచార్యులు, పర్యాటక శాఖ యండి ప్రకాష్‌రెడ్డి, రోడ్లు , భవనాల శాఖ సీఈ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆదర్శ్‌నగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ స్థలం కాన్సిట్యూషన్ క్లబ్ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని సమావేశంలో పల్గొన్న మంత్రులు, ఇతరులు అభిప్రాయపడ్డారు. త్వరితగతిన డిజైన్లు రూపొందించాలని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను స్పీకర్ ప్రసాద్‌కుమార్, చైర్మెన్ సుఖేందర్‌రెడ్డి ఆదేశించారు. రాజస్థాన్, ఢిల్లీ లోని కాన్సిట్యూషన్ క్లబ్‌ల పనితీరును పరిశీలించి రిపోర్టు తయారు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు లేజిస్లేచర్ కార్యదర్శికి సూచించారు. కాన్సిట్యూషన్ క్లబ్‌ను సొసైటీగా రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పారు. సభ్యులకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తూ తెలంగాణ కాన్సిట్యూషన్ క్లబ్ దేశంలో ఒక మోడల్ గా ఉండేలా ఆర్కిటెక్చర్ సంస్థల ద్వారా డిజైన్లు రూపొందించాలని ఆర్‌అండ్ బీ అధికారులకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించారు.

కులగణన తర్వాతే కేంద్రంపై యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)



ద్రోహులేనన్నారు. వ్యక్తిగతంగా తనకు గుర్తింపులేదనీ, కాంగ్రెస్ పార్టీ ద్వారా తనకు ఈ గుర్తింపు వచ్చిందని స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాలు, అమలు విషయంలో చర్చకు తావులేకుండా చూడాలని చెప్పారు. పార్టీకి నష్టం చేకూరేలా మాట్లాడితే సహించబోమని చెప్పారు. అదే సమయంలో ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన కులగణనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో తెలంగాణ మోడల్‌ను పరిగణనలోకి తీసుకునేలా మోడల్ డాక్యుమెంట్‌ను కేంద్రానికి పంపుతామన్నారు.

పార్టీతోనే తనకు గుర్తింపు

కాంగ్రెస్ పార్టీనే తనకు గుర్తింపు ఇచ్చిందనీ, మీరంతా కష్టపడితేనే ఈ బాధ్యత వచ్చిందని రేవంత్ చెప్పారు. పార్టీ ఎజెండాతోనే ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. పార్టీ విధానాన్ని అమలు చేయడమే మన ప్రభుత్వ విధానమన్నారు. రేవంత్‌రెడ్డి చట్టాన్ని అమలు చేస్తాడు తప్ప... వ్యక్తిగత ఎజెండాతో పని చేయడని స్పష్టం చేశారు. తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడుతుందనీ, సామాజిక, ఆర్థిక రాజకీయ కులగణన చేస్తామని సెప్టెంబర్ 17న తుక్కుగూడ సభలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ మాట ఇచ్చారని గుర్తు చేశారు. రాజకీయాల్లో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చడంలో సోనియమ్మ సఫలీకృతమయ్యారని తెలిపారు. రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి ఇచ్చిన మాట నెరవేర్చారని గుర్తు చేశారు. గాంధీ కుటుంబం ఒక మాట ఇస్తే హరిహరాదులు అడ్డొచ్చినా అది నెరవేర్చి తీరుతుందన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట నిలబెట్టడం ఇక్కడున్న ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. రేవంత్‌రెడ్డినా, మహేష్‌కుమార్ గౌడా అనేది ముఖ్యం కాదనీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టే వారసులమని స్పష్టం చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీ ఐడియాలజీతో సంబంధం ఉన్న నిరంజన్‌ను బీసీ కమిషన్ చైర్మెన్‌గా నియమించుకున్నామని తెలిపారు. పని చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా... ప్రతీ క్షణం సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని దిశానిర్దేశం చేశారు. కుల గణనపై సమన్వయం చేసుకునేందుకు 33 జిల్లాలకు 33 మంది పర్యవేక్షకులను నియమించాలని పార్టీకి సూచించారు.

బాధ్యతగా పని చేయండి

'బాధ్యతగా పని చేయండి. మీ కష్టానికి ఫలితం తప్పకుండా ఉంటుంది' రేవంత్ అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా వారిని పార్టీ క్షమించబోదని హెచ్చరించారు. దేశానికి తెలంగాణ ఒక మోడల్‌గా మారాలనీ, ఆ దిశగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. తెలంగాణ మోడల్ దేశంలో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేలా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాలను ఎన్ని అడ్డంకులు సృష్టించినా డీఎస్సీ పూర్తి చేసి ఉద్యోగ నియామక పత్రాలు అందించాయని తెలపారు. రాజకీయ మనుగడ కోసం అడ్డంకులు సృష్టించినా పదినెలల్లో 50వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు.

గ్రూప్ 1పై ప్రతిపక్షాలు అపోహలు సృష్టించాయి

గ్రూప్ 1 విషయంలోనూ ప్రతిపక్షాలు రకరకాల అపోహలు సృష్టించి అడ్డుకోవాలని ప్రయత్నించారని రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జీవో ఇచ్చినపుడు, నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు, ప్రిలిమ్స్ ఫలితాలు ఇచ్చినపుడు కోర్టుకు పోలేదన్నారు.

కానీ మెయిన్స్ నిర్వహించే సందర్భంలో జీవో 29పై కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారని తెలిపారు. సుప్రీంకోర్టు కూడా వారి పిటిషన్‌ను కొట్టేసిందన్నారు. కొంతమంది అగ్రవర్ణాల కోసమే గ్రూప్ 1 నిర్వహిస్తున్నారనీ, బలహీన వర్గాలకు అన్యాయం చేస్తున్నారని ఒక వాదన తీసుకొచ్చారని తెలిపారు. సెలక్ట్ అయిన 31,383 మందిలో 10శాతం లోపు మాత్రమే అగ్రవర్ణాలు ఉన్నారనీ, 57.11 శాతం బీసీలు,15.38 శాతం ఎస్సీలు, 8.87 శాతం ఎస్టీలు, 8.84 ఈడబ్ల్యూఎస్ కోటాలో సెలక్ట్ అయ్యారని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో 20 మంది సెలక్ట్ అయ్యారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

సోషల్ ఎకనామిక్ సర్వే పేదలకు 'చేయూత' : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

సోషల్ ఎకనామిక్ సర్వే ద్వారా ఆర్థికంగా వెనకబడిన పేదలకు 'చేయూత' అందిస్తున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని చెప్పారు. కులగణనతో ఇంకా వెనకబడిన వర్గాలకు ఏం చేయొచ్చని అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. అన్ని జిల్లాల్ల డీసీసీ అధ్యక్షులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో పార్టీలకు అతీతంగా ఒక మీటింగ్ ఏర్పాటు చేస్తామనీ, వచ్చే నెల 5న రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉందన్నారు. దేశం మొత్తానికి తెలంగాణ కులగణన ఎక్స్ రేలా పని చేస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కులగణన పై చర్చ జరగకుండా ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపలి కృష్ణారావు, సీనియర్ నేతలు కే కేశవరావు, వి.హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు, నాయకులు పాల్గొన్నారు.

గొబెల్స్ సిగ్గుపడేలా రేవంత్ రెడ్డి అబద్ధాలు

మాజీ మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ప్రపంచంలోనే అబద్ధ ప్రచారానికి మారుపేరుగా ఉన్న గొబెల్స్ కూడా సిగ్గుపడేలా సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. హైదరాబాద్‌కు మూడు దిక్కులా సముద్రం ఉందనీ, దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు అమ్ముతారన్న సీఎం మాటలకు సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయని ఎద్దేవా చేశారు. మల్లన్నసాగర్‌లో సేకరించిన భూమి మొత్తం 14,591 ఎకరాలైతే సీఎం రేవంత్ రెడ్డి 50 వేల ఎకరాలు ముంపునకు గురయిందని అబద్ధ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అక్కడి నిర్వాసితులకు 2013 చట్టం కంటే మెరుగైన ప్యాకేజీ ఇచ్చినట్టు చెప్పారు. పాక్షిక రుణమాఫీ చేసి 31 రకాల సాకులతో పూర్తి రుణమాఫీ ఎగ్గొట్టారని చెప్పారు. ఏడాది గడిచినా పూర్తి క్యాబినెట్ వేయలేకపోయారని చెప్పారు. ప్రస్తుతం ఎన్నికలు పెడితే బీఆర్‌ఎస్‌కు 100 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

ఎప్పుడు ఎవరు తన కుర్చీ లాక్కుంటారోనని రేవంత్ రెడ్డి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో కాంగ్రెస్ మూడు సార్లు వరసగా ఓడిపోయిందనీ, ఆ పార్టీ ఖతమైనట్టేనా? అని ప్రశ్నించారు. ఆరు మంత్రి పదవులను నింపడానికే రేవంత్‌కు హైకమాండ్ అనుమతి ఇవ్వట్లేదన్నారు. డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులను కూడా నింపలేదని గుర్తుచేశారు. మూసీ నిర్వాసితులకు మల్లన్నసాగర్ నిర్వాసితులకన్నా మెరుగైన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.7000 కోట్లకు పెంచింది కేవలం కమిషన్ల కోసమేననీ, కొండపోచమ్మ నుంచి మూసీకి నీళ్లు తెచ్చేందుకు కేసీఆర్ హయాంలో రూపొందించిన డీపీఆర్‌ను కాదని మల్లన్నసాగర్‌కు మార్చారని ఆరోపించారు. గచ్చిబౌలిలో ప్రభుత్వం 500 ఎకరాలు కోర్టు కేసులో గెలిచిందనీ, ఆ భూమిని మూసీ బాధితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏక్ పోలీస్ అమలు చేయమంటే సస్పెండ్ చేయటం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపూఘాట్‌లో భారీ గాంధీ విగ్రహం పెడితే స్వాగతిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా... గోల్ కొట్టేది మేమే..వికెట్ తీసేది మేమే..అని ధీమా వ్యక్తం చేశారు. ఈ లోపు హిట్ వికెట్ కాకుండా చూసుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి మంత్రులే ఆయన్ను అవుట్ చేస్తారని హెచ్చరించారు.

నవంబర్ 17,18 తేదీల్లో గ్రూప్–3

పది నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం : టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్–3 పోస్టుల భర్తీకి సంబంధించి వచ్చేనెల 17,18 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల 17న రెండు విడతల్లో ఉదయం, మధ్యాహ్నం, 18న ఒకే విడత ఉదయం మాత్రమే రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. అదేనెల పదో తేదీ నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని వివరించారు.

వచ్చేనెల 17న మొదటి పరీక్ష ప్రారంభమయ్యే వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మొదటి విడతలో ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షను నిర్వహిస్తామని వివరించారు. ఉదయం 8.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుందని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు గేట్లు మూసివేస్తామని పేర్కొన్నారు. ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. రెండో విడత మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకే అభ్యర్థులను అనుమతిస్తామనీ, ఆ తర్వాత వచ్చిన వారికి అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు. మొదటి రోజు తెచ్చిన హాల్‌టికెట్‌ను మిగతా రోజు జరిగే పరీక్షకు తేవాలని సూచించారు. నిబంధనలను పాటించాలని కోరారు. సాంకేతికంగా ఏమైనా సమస్యలుంటే టీజీపీఎస్సీ హెల్ప్‌డెస్క్ 040-23542185, 040-23542187 నెంబర్లతోపాటు helpdesk@tspsc.gov.in ను సంప్రదించాలని సూచించారు. తెలంగాణ తొలి గ్రూప్–3 ద్వారా 1,388 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ 2022, డిసెంబర్ 30న నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,36,477 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

అదో సాలె గూడు

(మొదటిపేజీ తరువాయి)

అవసరాలు తీర్చుకునేందుకు వేలాది మంది ప్రజలు

ఎన్‌బీఎఫ్‌సీలుగా నమోదైన రుణ యాప్‌ల నుంచి అప్పులు తీసుకుంటున్నారు. అనేక సందర్భాల్లో తీసుకునే రుణం స్వల్పంగానే... అంటే రూ.10,000 నుంచి రూ.50,000 వరకూ ఉంటోంది. కానీ వడ్డీ రేటు 40 శాతం వరకూ విధిస్తున్నారు. దీనికి ప్రాసెసింగ్ ఫీజులు అదనం.

వేధింపులతో బలవన్మరణాలు

దిగువ మధ్యతరగతి ప్రజలు తమ జీవనశైలిని మెరుగుపరచుకోవడానికి రుణాలు తీసుకుంటున్నారని హోమ్ క్రెడిట్ ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్ అనే సంస్థ తెలిపింది. ఇది దేశంలోని 17 నగరాల్లో అధ్యయనాన్ని నిర్వహించింది. స్మార్ట్‌ఫోన్లు, గృహోపకరణాల కొనుగోలు కోసం అప్పులు చేస్తున్నారని, వీరి సంఖ్య 2020లో కేవలం ఒక శాతం మాత్రమే ఉండగా ఇప్పుడు 37 శాతానికి పెరిగిందని తెలిపింది. ఇలా రుణాలు తీసుకుంటున్న వారిలో ఎక్కువ మంది వయసు 40 ఏండ్ల లోపే. నిరుద్యోగులు సైతం రుణ యాప్‌ల వలలో పడిపోతున్నారు. కొందరైతే వివిధ యాప్‌ల ద్వారా అప్పు తీసుకుంటున్నారు. ఇన్‌స్టెంట్ లోన్ యాప్స్ ద్వారా రుణం తీసుకున్న వారు సకాలంలో వడ్డీ చెల్లించకపోతే నరకాన్ని చూడాల్సి వస్తుంది. యాప్ ఏజెంట్లు ఫోన్ చేసి వేధిస్తుంటారు. అసభ్య పదజాలంతో దూషిస్తుంటారు. వీటిని తాళలేక ఆత్మహత్య చేసుకున్న వారి సంఖ్య తక్కువేమీ లేదు. బ్యాంకులు సులభ పద్ధతిలో, స్వల్ప మొత్తంలో రుణాలు ఇస్తే ప్రయివేటు యాప్స్ అవసరమే ఉండదని ఓ యువకుడు వాపోయాడు. అప్పు ఇచ్చే ముందు ఆధార్, పాన్ తీసుకుంటారని, వీడియో కూడా తీస్తారని, రుణం చెల్లించకపోతే అదే వీడియోను వాడుకుంటూ రికవరీ ఏజెంట్లు వేధిస్తారని, ఫొటోలు మార్చి బంధువులకు కూడా పంపుతారని మరో యువకుడి ఆవేదన.

మోసపూరిత యాప్‌ల తొలగింపు

ఇటీవలి కాలంలో అనేక మోసపూరిత యాప్‌లు పుట్టుకొస్తున్నాయి. 2022 సెప్టెంబర్–2023 ఆగస్టు మధ్యకాలంలో గూగుల్ సంస్థ తన ప్లే స్టోర్ నుంచి 2,200కు పైగా మోసపూరిత యాప్‌లను తొలగించింది. చిన్న మొత్తాల్లో రుణాలు అందించే యాప్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల సంఖ్య పెరుగుతుండడం, మొత్తంగా మైక్రో ఫైనాన్స్ పరిశ్రమ పుంజుకోవడం వంటి పరిణామాలు ఆర్థిక వ్యవస్థకు కొన్ని సమస్యలు సృష్టిస్తున్నాయి.

సచివాలయం భద్రత మళ్లీ టీజీ ఎస్పీఎఫ్‌కే

● ఆక్టోపస్, సీటీ పోలీసుల పర్యవేక్షణ యధాతథం

● ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్ర సచివాలయం బందోబస్తు బాధ్యతలను ప్రభుత్వం తిరిగి టీజీ ఎస్పీఎఫ్‌కు అప్పగించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. 'ఒకే రాష్ట్రం, ఒకే పోలీస్' విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సెక్యూరిటీని మార్చి ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్)కు అప్పగించిన విషయం విదితమే. తాజాగా సచివాలయం బందోబస్తు భాధ్యతలను సర్కార్ ప్రత్యేక పోలీసు విభాగం నుంచి టీజీఎస్పీఎఫ్‌కు బదిలీ చేసింది. బందోబస్తు మార్పు తక్షణమే అమలు చేయాలనీ, అందుకు సంబంధించి డీజీపీ తగు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులో సీఎస్ పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే ఆక్టోపస్, హైదరాబాద్ సిటీ పోలీసులు లా అండ్ అర్డర్, ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తారని ప్రభుత్వం తెలిపింది. కొత్త సచివాలయం ప్రారంభం నుంచి తెలంగాణ స్పెషల్ పోలీస్ భద్రత విధులు నిర్వహించింది. దాదాపు 600 మంది సిబ్బంది రోజువారి విధుల్లో ఉండేవారు. అంతకుముందు 25 ఏండ్లుగా ఎస్పీఎఫ్ సెక్రటేరియెట్ భద్రతను పర్యవేక్షించేది. కేసీఆర్ సర్కార్ కొత్త సచివాలయం నిర్మాణం తరువాత ఆ బాధ్యతలు తెలంగాణ స్పెషల్ పోలీస్‌లకు అప్పగించారు. మూడు నెలల క్రితం ప్రభుత్వం వారి నుంచి భద్రతను బెటాలియన్ పోలీసుకు బదిలీ చేసింది. వారి ఆందోళన నేపథ్యంలో రేవంత్ సర్కార్ తిరిగి ఎస్పీఎఫ్‌కు సచివాలయం భాద్యతలను అప్పగించింది.

కులగణనకు ఉపాధ్యాయుల సంపూర్ణ సహకారం

చారిత్రక బాధ్యతలో వారిని భాగస్వామ్యం చేస్తున్నాం

సర్వే కోసం ఉపాధ్యాయ సంఘాల సూచనలు ఆచరణలో పెడతాం: ఉప ముఖ్యమంత్రి భట్టి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం వచ్చేనెల ఆరో తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే కులగణన సర్వేకు ఉపాధ్యాయ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన విజ్ఞప్తికి ఓకే చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉపాధ్యాయ సంఘాలతో భట్టి విక్రమార్క సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిల్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకుల అభిప్రాయాలను వారు తెలుసుకున్నారు. కుల గణన సర్వే, రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనను భట్టి వారికి వివరించారు. చారిత్రాత్మక కుల గణన సర్వేలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించిందని అన్నారు. ఎన్నికల హామీల అమల్లో భాగంగా కులగణన చేపట్టాలని నిర్ణయించామని వివరించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినెట్ నిర్ణయించిందని చెప్పారు. ఉపాధ్యాయుల ఆలోచనలను తెలుసుకోవడం కోసమే ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. సామాజిక స్పృహ కలిగిన వారు, గురుతర బాధ్యత ఎరిగిన వారు ఉపాధ్యాయులని వివరించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరినట్టు ఉదయం వేళల్లో సర్వే నిర్వహించడం, వచ్చేనెల తొమ్మిది నుంచి 15 వరకు వరుస సెలవుల మధ్య సర్వే చేపట్టడం, సెలవు రోజుల్లో సర్వే విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు పరిహారంతో కూడిన సెలవులు (సీసీఎల్) మంజూరు చేయడం, సర్వేకు సంబంధించి సమాజంలో విస్తృత ప్రచారం చేయాలని ఇచ్చిన సూచనలన్నింటినీ ఆచరణలో పెడతామని చెప్పారు.

సర్వే విధుల్లోకి వెళ్లే ఉపాధ్యాయ, ఉద్యోగ లోకానికి సమాజం పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతుందన్నారు. అద్భుతమైన సమాజాన్ని రాష్ట్రంలో నిర్మించేందుకు ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నడవాలని కోరారు. సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, ఉపాధి రంగాల్లో ఎవరెవరు ఎక్కడెక్కడ ఏ స్థాయిలో ఉన్నారో తెలుసుకునేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని అన్నారు.సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులకు సీసీఎల్ పరిహారంతో కూడిన సెలవును మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య కోరారు. ఉపాధ్యాయులు అయితేనే సర్వే బాగా చేస్తారన్న నమ్మకం తమపై ఉంచినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు అని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గతంలో తాము చేపట్టిన సకల జనుల సర్వే ఎటు పోయిందో ఎవరికి తెలియదని, ప్రస్తుత ప్రభుత్వం కోరుకున్న విధంగా సర్వే చేయడానికి ఉపాధ్యాయ లోకం సంపూర్ణంగా సిద్ధంగా ఉందని టీఎస్‌పీటీఏ అధ్యక్షుడు షౌకత్‌అలీ చెప్పారు. సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులకు స్పెషల్ సీఎల్‌తోపాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని డీటీఎఫ్ అధ్యక్షుడు లింగారెడ్డి కోరారు. సమావేశాలకు ఆహ్వానిస్తున్నందుకు ప్రభుత్వానికి ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి ధన్యవాదాలు తెలిపారు.

పెండింగ్ బిల్లుల మంజూరుకు భట్టి సానుకూల స్పందన

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఎస్టీయూటీఎస్, బీసీటీఏ కోరాయి. ఆయన సానుకూలంగా స్పందించారని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, బీసీటీఏ అధ్యక్షుడు కె కృష్ణుడు తెలిపారు. పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. త్వరలోనే అన్ని విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తిలో ఉన్న దృష్ట్యా కనీసం మూడు డీఏలు వెంటనే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. సర్వే నిర్వహించడంలో ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులను సీపీఎస్ నుంచీ ఓపీఎస్‌కు మార్చాలని కోరారు.

కులగణనకు సహకరిస్తాం
బడులకు అంతరాయం లేకుండా చూడాలి : టీఎస్‌యూటీఎఫ్

రాష్ట్ర ప్రభుత్వం వచ్చేనెలలో నిర్వహించ తలపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే నిర్వహణకు సంపూర్ణంగా సహకరిస్తామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి తెలిపారు. అయితే పాఠశాలల్లో బోధనాభ్యసన ప్రక్రియకు అంతరాయం కలగకుండా చూడాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. విద్యాబోధనకు అంతరాయం కలుగకుండా ఆదివారాలు, సెలవురోజుల్లో కులగణన సర్వేను నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులకు కాంపెన్సేటరీ క్యాజువల్ సెలవు (సీసీఎల్) మంజూరు చేయొచ్చని కోరారు. సరిపోకపోతే చివర్లో ఒకటి, రెండు రోజులు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించి సర్వే నిర్వహించాలని తెలిపారు. సర్వే చేసినందుకు ఇచ్చే రెమ్యూన రేషన్ గౌరవప్రదంగా ఉండాలని కోరారు.

ఎన్నికలు, జన గణన వంటి కీలక కార్యక్రమాలు ఉపాధ్యాయులు లేకుండా పూర్తి కావనీ, కుల గణన సర్వేలోనూ సంపూర్ణంగా సహకరిస్తామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి వివరించారు. కులగణనను చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షులు కె కృష్ణుడు చెప్పారు.

గత ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసేవి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సందర్భంలోనూ తమను పిలిపించి మాట్లాడుకుని మా అభిప్రాయాలు తెలుసుకుంటోందని టీఎస్ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బి కొండయ్య అన్నారు. ఎవరి జనాభా ఎంత ఉందో, ఎక్కడ ఉన్నారో సరిగా లెక్కలు లేవనీ, కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నం చేయడం సంతోషకరమైన విషయమని ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జాజుల వెంకటేశ్వరరావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండరామ్, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంతోపాటు 13 ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని తమ అభిప్రాయాలు చెప్పారు. టీఎస్‌జీహెచ్ఎంఏ అధ్యక్షుడు పి రాజభాను చంద్రప్రకాశ్, టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, పీఆర్టీయూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఈపీని అమలు చేయొద్దు
విద్యా కమిషన్ చైర్మెన్‌కు టీజీజేఎల్ఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020)ని రాష్ట్రంలో అమలు చేయొద్దని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్ఏ-475) కోరింది. బుధవారం హైదరాబాద్‌లో విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళితో టీజీజేఎల్ఏ సమావేశమైంది. విద్యారంగ పరిస్థితులు, సమస్యలు, పరిష్కారం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇంటర్, డిగ్రీ, సాంకేతిక, విశ్వవిద్యాలయ విద్యారంగంలో ప్రస్తుత పరిస్థితి, సమస్యలు, అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, సూచనలతో రూపొందించిన నివేదికను ఆకునూరి మురళికి టీజీజేఎల్ఏ అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, గౌరవ సలహాదారు అందె సత్యం సమర్పించారు. ఎన్ఈపీని అమలు చేస్తే విద్యారంగం పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి వెళ్తున్నట్టు కనిపిస్తున్నదని తెలిపారు. సమాఖ్య విధానానికి, రాజ్యాంగ స్ఫూర్తికి ఇది విరుద్ధమని పేర్కొన్నారు. ఆర్థిక వనరుల కారణంతో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఎన్ఈపీని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించొద్దని కోరారు. తెలంగాణ విద్య అస్తిత్వాన్ని కాపాడటానికి ఎన్ఈపీ అమలుపై పునరాలోచించి సూచించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు ఎక్కువ మంది చదువుతున్నందున మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. పరీక్షల సమయంలో ఆ పథకం అమలు చేసిన కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెరిగిందని వివరించారు. ప్రవేశాలు కూడా పెరిగే అవకాశముందని తెలిపారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. కేజీ నుంచి పీజీ వరకు మూడు నెలలకోసారి సమీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. ఏడు జిల్లాల్లోనే డీఐఈవో పోస్టులున్నాయని తెలిపారు. 27 జిల్లాలకు డీఐఈవో పోస్టులను మంజూరు చేయాలని సూచించారు. కార్పొరేట్ విద్యాసంస్థలను అరికట్టాలని కోరారు. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో పది శాతం నిధులు కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీజేఎల్ఏ రాష్ట్ర నాయకులు కురుమూర్తి, శ్రీనివాస్ రెడ్డి, శోభన్, దేవేందర్, సాయిలు, గోవర్ధన్, పూర్ణచందర్, రాజా గౌడ్, రాజేందర్, రాష్ట్ర మహిళా కార్యదర్శులు సంగీత, షాహినా బేగం, విశాలాక్షి, డిగ్రీ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు జి రమణారెడ్డి, నాయకులు మధుసూదన్ రెడ్డి, డిగ్రీ అధ్యాపక సంఘ నాయకులు బొంకూరి ప్రవీణ్, రమేష్, పాలిటెక్నిక్ అధ్యాపక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి ఉదయభాస్కర్, ప్రధాన కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కార్యదర్శిగా గౌతం కృష్ణ
14 మందితో జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నిర్మల్

సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కార్యదర్శిగా మరోసారి గౌతం కృష్ణ ఎన్నికయ్యారు. పార్టీ జిల్లా 3వ మహాసభ 28, 29 తేదీల్లో జిల్లా కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా 14 మందితో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐదుగురితో కార్యదర్శి వర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా గౌతంకృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా బొమ్మెన సురేష్, దుర్గం నూతన్‌కుమార్, ఎస్‌కె.మస్తాన్, బి.వసుధ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఫసిఉద్దీన్, ద్యావత్ పోశెట్టి, తొడసం శంభు, అవర్గ ముత్యం, నాగెల్లి నర్సయ్య, గంగాదేవి, బి.లత, బి.సాధన, శృతి ఎన్నికయ్యారు.

అంతరిక్షంలోకి తొలి చైనా మహిళా వ్యోమగామి

బీజింగ్ : చైనా తమ దేశం తరపున ఓ మహిళా వ్యోమగామిని తొలిసారి అంతరిక్షంలోకి పంపింది. ఈ మేరకు చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ (సిఎంఎస్ఎ) బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గన్సు ప్రావిన్స్‌లోని జియుక్వియాన్ స్పేస్ సెంటర్ నుంచి షెంఝూ-19 మిషన్‌లో భాగంగా బుధవారం ముగ్గురు యువ వ్యోమగాములను అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్‌కు తరలించినట్టు పేర్కొంది. ఇందుకోసం లాంగ్‌మార్చ్-2ఎఫ్ అనే భారీ రాకెట్‌ను వినియోగించినట్లు తెలిపింది. వ్యోమగాముల్లో 34 ఏళ్ల మహిళా స్పేస్ ఫ్లైట్ ఇంజినీర్ వాంగ్ హవూజె కూడా ఉన్నారని, దాదాపు ఆరు గంటల పాటు ప్రయాణించిన వారు స్పేస్ స్టేషన్‌కు చేరుకొన్నారని సిఎంఎస్ఎ తెలిపింది. వీరు ప్రయాణించిన స్పేస్‌షిప్ అంతరిక్ష కేంద్రం కోర్‌మాడ్యూల్ తియాన్హేతో అనుసంధానమైందని ప్రకటించింది. ఈ ముగ్గురు వ్యోమగాములు ఆరు నెలలపాటు అక్కడే ఉండి వివిధ ప్రయోగాలను,




స్పేస్‌వాక్‌ను నిర్వహిస్తారని తెలిపింది. 2030 నాటికి చంద్రుడి పైకి చేపట్టే యాత్ర దిశగా ఈ ప్రయోగం విజయవంతమైందని సిఎంఎస్ఎ పేర్కొంది. 'వీరు వివిధ రంగాలకు చెందిన మొత్తం 86 ప్రయోగాలు నిర్వహిస్తారు. మిత్రదేశాల వ్యోమగాములకు కూడా శిక్షణ ఇచ్చే అంశంపై చర్చలు జరుగుతున్నాయి' అని సిఎంఎస్ఎ ప్రతినిధి చెప్పారు. ఈ ఏడాది మొత్తం 100 అంతరిక్ష ప్రయోగాలు చేసి నాసాను వెనక్కినెట్టాలని చైనా నిర్ణయించింది. విశ్వాన్ని అన్వేషించి అంతరిక్ష రంగంలో బలమైన శక్తిగా ఎదగాలని రెండేళ్లక్రితమే ఆ దేశాధ్యక్షులు జిన్‌పింగ్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

క్షయవ్యాధి కేసులు పెరుగుదల

● ఇండియాలోనే ఎక్కువ ● 2023లో 26 శాతం నమోదు ● డబ్ల్యూహెచ్ఓ నివేదిక స్పష్టం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో క్షయవ్యాధి (టీబీ) కేసులు పెరిగాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) స్పష్టం చేసింది. ఈమేరకు డబ్ల్యూహెచ్ఓ తన తాజా నివేదికలో క్షయవ్యాధి (టీబీ) కేసుల పెరుగుదలను వెల్లడించింది. 2023లో సుమారు 8.2 మిలియన్ల కొత్తగా టీబీ వ్యాధి కేసులు నమోదు అయ్యాయని పేర్కొంది. 1995 నుంచి చూస్తే అత్యధిక సంఖ్యలో నమోదైంది. 2022లో నమోదైన 7.5 మిలియన్ కేసుల నుంచి గణనీయమైన పెరుగుదలను సూచిస్తుంది. డబ్ల్యూహెచ్ఓ గ్లోబల్ ట్యూబర్క్యులోసిస్ రిపోర్ట్ -2024 ప్రకారం 2023లో ఇండియాలో 26 శాతం టీబీ కేసులు నమోదయ్యాయి. ఆ తరువాత ఇండోనేషియా (10 శాతం), చైనా (6.8 శాతం), ఫిలిప్పీన్స్ (6.8 శాతం), పాకిస్తాన్ (6.3 శాతం) ఉన్నాయి. కొత్త కేసుల్లో 55 శాతం మంది పురుషులు, 33 శాతం మంది మహిళలు, 12 శాతం మంది పిల్లలు, యుక్తవయసులో ఉన్నారని నివేదిక స్పష్టం చేసింది. అంటు వ్యాధి సంబంధిత మరణాలకు ప్రధాన కారణంగా క్షయవ్యాధి నిర్మూలనకు తక్షణ చర్యలు



అవసరమని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది. టీబీ కేసుల భారం ఎక్కువగా ఉన్న 30 దేశాల్లోని జనాభాను ఈ వ్యాధి అసమానంగా ప్రభావితం చేసిందని నివేదిక స్పష్టం చేసింది. ఈ దేశాల్లో అంగోలా, బంగ్లాదేశ్, బ్రెజిల్, కంబోడియా, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, చైనా, కాంగో, ఉత్తర కొరియా, డిఆర్ కాంగో, ఇథియోపియా, ఇండియా, ఇండోనేషియా, కెన్యా లెసోతో, లైబీరియా, మొజాంబిక్, మయన్మార్, నమీబియా, నైజీరియా, పాకిస్థాన్, పాపువా న్యూ గినియా, ఫిలిప్పీన్స్, రష్యా, సియెర్రా లియోన్, దక్షిణాఫ్రికా, థాయిలాండ్, టాంజానియా, వియత్నాం, జాంబియా, జింబాబ్వే ఉన్నాయని పేర్కొంది. డబ్ల్యూహెచ్ఓ నివేదిక ప్రకారం.. టీబీని ఎదుర్కోవడంలో అండర్ ఫండింగ్ వంటి నిరంతర సవాళ్లు ప్రపంచ ప్రయత్నాలకు ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొంది. టీబీ సంబంధిత మరణాలు 2022లో 1.32 మిలియన్లు ఉండగా.. 2023లో 1.25 మిలియన్లకు కొద్దిగా తగ్గాయి. అయితే టీబీతో బాధపడుతున్న వారి సంఖ్య 10.8 మిలియన్లకు పెరిగింది.

టీబీ పెరుగుదలపై డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ ఆందోళన వ్యక్తం చేశారు. "టీబీ ఇప్పటికీ చాలా మందిని చంపుతుంది. అనారోగ్యానికి గురిచేస్తుంది. దానిని నిరోధించడానికి, దానిని గుర్తించడానికి, చికిత్స చేయడానికి సాధనాలు ఉన్నప్పుడు ఇలా జరగడం ఆందోళనకరం. టీబీని ఎదుర్కోవడానికి అందుబాటులో ఉన్న సాధనాల వినియోగాన్ని విస్తరించడానికి దేశాలు తమ చర్యలను నెరవేర్చాలి" అని ఆయన పిలుపునిచ్చారు.



సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ఎస్. హరీశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, ఎడిటర్ సుధాభాస్కర్, న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేష్, జీఎం వెంకటేశ్

ఆ కుట్ర వెనుక అమిత్ షా

సిక్కు వేర్పాటువాదుల హత్యపై కెనడా తొలిసారి బహిరంగ ఆరోపణ

కాన్సులర్ పాత్రపై పోలీస్ కమిషనర్ సాక్ష్యం

ఒట్టావా : అమెరికా, కెనడా మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతింటున్న నేపథ్యంలో కెనడా ఉప ప్రధాని (విదేశీ వ్యవహారాలు) డేవిడ్ మారిసన్ మంగళవారం ఓ సంచనల ఆరోపణ చేశారు. తమ దేశంలోని సిక్కు వేర్పాటు వాదులను హత్య చేయడానికి లేదా భయ పెట్టడానికి జరిగిన కుట్ర వెనుక భారత హోం మంత్రి అమిత్ షా హస్తమున్నదని ఆయన ఆరోపించారు.

కెనడా ఎన్నికలలో, నేరపూరిత కార్యకలాపాలలో భారత ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం' అనే అంశంపై స్టాండింగ్ కమిటీ విచారణ సందర్భంగా మారిసన్ ఈ వ్యాఖ్య చేశారని సీబీసీ న్యూస్ తెలిపింది. ప్రజల రక్షణ, దేశ భద్రతపై ఈ స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రజల రక్షణ, దేశ భద్రత, పోలీసింగ్, అత్యవసర నిర్వహణ, నేరాల అదుపు, సరిహద్దు రక్షణ వంటి వ్యవహారాలను చూసే కెనడా ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన చట్టాలు, విధానాలు, వ్యయ ప్రణాళికలను ఈ కమిటీ సమీక్షిస్తుంది.



భారత ఏజెంట్ల ప్రమేయం

కెనడాలో పెద్దఎత్తున జరుగుతున్న నేరాల్లో భారత ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం ఉన్నదని ఈ నెల 14న రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు చేసిన ఆరోపణలపై చట్టసభ సభ్యుల ఎదుట మారిసన్ సాక్ష్యమిచ్చారు. గతేడాది జూన్‌లో వాంకోవర్ సమీపంలో సిక్కు వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య జరిగిన విషయం తెలిసిందే. అసమ్మతి గళం వినిపించే భారతీయులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున జరిగిన ప్రచారానికి భారత్‌కు చెందిన సీనియర్ రాజకీయ నేత రూపకల్పన చేశారని, నిజ్జర్ హత్య ఈ కుట్రలో భాగమేనని గుర్తు తెలియని కెనడా అధికారులను ఉటంకిస్తూ ఈ నెల 14న వాషింగ్టన్ పోస్ట్ పత్రికలో వచ్చిన వార్తను కమిటీ తన విచారణ సందర్భంగా ప్రస్తావించింది. సిక్కు వేర్పాటువాదులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, వారిపై దాడి చేసేందుకు అనుమతి ఇచ్చిన రాజకీయ నేత అమిత్ షాయేనని కెనడా అధికారులు గుర్తించినట్టు తెలిసింది. 'ఆ వ్యక్తి అమిత్ షాయేనా అని పాత్రికేయులు నన్ను అడిగారు. నేను ఆయనేనని ధృవీకరించాను' అని కమిటీ ఎదుట మారిసన్ చెప్పినట్టు సీబీసీ న్యూస్ తెలిపింది. ఈ ఉదంతంలో అమిత్ షా ప్రమేయంపై కెనడా నేతలు అధికారికంగా వ్యాఖ్యానించడం ఇదే మొదటిసారి.

పోలీస్ కమిషనర్ ఏమన్నారు?

కాగా భారత దౌత్యవేత్తలు, కాన్సులర్ సిబ్బంది తమ ప్రభుత్వం కోసం సమాచారాన్ని సేకరించారని పోలీస్ కమిషనర్ మైక్ దుహేమ్ కమిటీకి తెలియజేశారు. ఈ సమాచారాన్ని ఉపయోగించుకొని కెనడాలో హింసాత్మక చర్యలు చేపట్టడానికి నేర సంస్థలకు ఆదేశాలు జారీ చేశారని దుహేమ్ చెప్పినట్టు సీబీసీ న్యూస్ వివరించింది. దక్షిణాసియా సమాజ సభ్యులకు.. ముఖ్యంగా ఖలిస్థాన్ మద్దతుదారులకు బెదిరింపులు వచ్చినట్టు ఆధారమున్నదని కూడా దుహేమ్ చెప్పారు. భారతీయ ఏజెంట్ల నుంచి ముప్పు లేదా బెదిరింపులు వస్తాయని గతేడాది సెప్టెంబర్ నుంచి 13 మంది కెనడా వాసులకు హెచ్చరికలు జారీ చేశామని ఆయన అన్నారు.

కుల అసమానతలే కారణం
చిన్నారుల్లో కుంగుబాటుపై తాజా అధ్యయనం


సబ్-సహారన్ ఆఫ్రికాలో కంటే పరిస్థితి దారుణం



న్యూఢిల్లీ : మన దేశంలో చిన్నారుల్లో వయసుకు తగిన ఎదుగుదల కన్పించడం లేదు. ఈ కుంగుబాటు రేటు సబ్-సహారన్ ఆఫ్రికా (ఆఫ్రికా ఖండంలో సహారాకు దక్షిణంగా ఉన్న ప్రాంతం)లో కంటే అధికంగా ఉండడం గమనార్హం. కులాల మధ్య అసమానతల కారణంగా తలెత్తే పోషకాహార లోపమే దీనికి కారణమని ఓ అధ్యయనం చెబుతోంది. సబ్-సహారన్ ఆఫ్రికా ప్రపంచంలోని అత్యంత నిరుపేద ప్రాంతాల్లో ఒకటి. చిన్నారుల్లో కుంగుబాటు రేటు ఆ ప్రాంతంలో కంటే అధికంగా ఉన్నదని అంటే మన ఆర్థిక వ్యవస్థ పరిస్థితి అర్థమవుతుంది. సంపన్న కులాలకు చెందిన చిన్నారులతో పోలిస్తే ఎస్సీ, ఎస్టీ వంటి అట్టడుగు వర్గాల చిన్నారులే యాభై శాతం అధికంగా కుంగుబాటుకు గురవుతున్నారని ప్రముఖ ఆర్థికవేత్తలు అశ్వినీ దేశ్‌పాండే, రాజేష్ రామచంద్రన్ తెలిపారు. 2019-20లో దేశవ్యాప్తంగా నిర్వహించిన కుటుంబ సర్వే ఆధారంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఐదేండ్ల లోపు వయసున్న 20 వేల మంది పిల్లల ఆరోగ్య పరిస్థితులను విశ్లేషించారు. సబ్-సహారన్ ఆఫ్రికాలోని 19 దేశాల పిల్లల్లో సగటున 34 శాతం కుంగుబాటు రేటు ఉంటే మన దేశంలో అది 36 శాతంగా ఉన్నదని అంచనా వేశారు. అయితే ఎగువ తరగతికి చెందిన పిల్లల్లో ఈ రేటు 27 శాతంగానే ఉంది. పిల్లల పోషకాహారం, కుంగుబాటు స్థాయిలను ప్రభావితం చేసే సామాజిక-ఆర్థిక, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకున్నప్పటికీ సంపన్న కుటుంబాలకు చెందిన భారతీయ పిల్లలు సబ్-సహారన్ ఆఫ్రికా పిల్లల కంటే 20 శాతం తక్కువగానే కుంగుబాటుకు గురవుతున్నారు. సబ్-సహారన్ ఆఫ్రికా దేశాలతో పోల్చినప్పుడు మన దేశంలో అసమానతలు ఎంత ఎక్కువగా ఉన్నాయో అర్థమవుతుంది. గతంలో కుంగుబాటుపై జరిపిన అధ్యయనాలన్నీ కుటుంబంలోని పిల్లల సంఖ్య, పారిశుధ్య సౌకర్యం, మగ పిల్లలా లేక ఆడపిల్లలా వంటి అంశాలనే పరిగణనలోకి తీసుకున్నాయి. కులాలను బట్టి పిల్లల్లో పోషకాహార విలువలు మారుతుంటాయని దేశ్‌పాండే, రామచంద్రన్ నిర్వహించిన అధ్యయనం తేల్చింది. ఈ అధ్యయనాన్ని జర్నల్ ఆఫ్ ఎకనమిక్స్, రేస్ అండ్ పాలసీ జర్నల్‌లో ప్రచురించారు.

సంపాదకీయం

నిజం నిగ్గుతేలేనా ?



గోదావరి నదిపై నిర్మించిన 240 టీఎంసీల మెగా సాగునీటి ప్రాజెక్టు కాళేశ్వరం డొల్లతనం ఆవిష్కృతమవుతున్నది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, కాళేశ్వరం న్యాయ కమిషన్ చైర్మెన్ జస్టిస్ ఘోష్ విచారణలో ఒక్కొక్కటిగా నిజాలు బయట కొస్తున్నాయి. కమిషన్ అధికారులను ప్రశ్నిస్తున్న తీరుతో, ఆశ్చర్యం గొలిపే అనేక కఠినమైన వాస్తవాలు బట్టబయలవుతున్నాయి. దోషులను నిగ్గు తేల్చే సమయం దగ్గర పడుతున్నది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో కూడిన కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్దది. బడ్జెట్‌లోనూ భారీనే. ప్రాణహిత చేవెళ్లకు పేరు మార్చి, నిధుల అంచనాలు పెంచి ప్రాజెక్టును ఇష్టారాజ్యంగా నిర్మించిన సంగతి, అఫిడవిట్ల ఆధారంగా జరుగుతున్న కమిషన్ విచారణతో కండ్లకు కడుతున్నది.ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం వైఎస్సార్ హయాంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు స్థలం మార్పుతో రూ.750 కోట్లు వృధా అయ్యాయి. దీనికి బీఆర్ఎస్ సర్కారుదే బాధ్యత. గత ప్రభుత్వ ఏలికలో అంతా ఏకపక్షం. అధికా రులు, సాంకేతిక నిపుణులకు విలువ లేదు. వారి సూచనలనూ బేఖాతర్ చేశారు. తానే చీఫ్ ఇంజినీరునంటూ ప్రభుత్వ పెద్ద చెప్పిందే వేదంగా నిర్మాణం సాగింది. ఏకంగా బడ్జెట్ రూ. 80,180 కోట్ల నుంచి రూ.1.27 లక్షల కోట్లకు ఎగబాకించారు. ఇంకా రూ. 40 వేల కోట్లు కావాలట! తక్కువ సమయంలో ప్రాజెక్టును పూర్తిచేసి నదులకే నడక నేర్పారంటూ మాజీ సీఎం కేసీఆర్‌నూ ఆకాశానికెత్తేశాయి బీఆర్ఎస్ శ్రేణులు అప్పట్లో.

> ఎన్నో అనుకుంటాం..అన్నీ జరుగుతాయా ఏంటీ అని సాధారణంగా జనం అనుకుంటూ ఉంటారు. మేము అలా అనుకుని ప్రాజెక్టు కట్టాం.. ఇలా జరుగుతుందని ఉహించామా ఏంటీ అనే తరహా ప్రచారానికి బీఆర్ఎస్ ఒడికడితే అంతకంటే మహాపాపం ఏముంటుంది ? ఘోష్ కమిషన్ ఎదుట కుప్పిగంతులు వేసేందుకు ఒకరిద్దరు అధికారులు ప్రయత్నిస్తే 'ఎవరో చేసిన తప్పులకు మీ భుజాలపై వేసుకోవద్దు' అని చైర్మెన్ బుద్ధిచెప్పిన వైనం పత్రికల్లోనే చూశాం. అసలు ప్రాజెక్టు ప్రారంభ ఏడాది 2019 నుంచే సమస్యల్లో ఉందని అధికారులు చెప్పడాన్ని బట్టి చూస్తే కనీస సాంకేతిక ప్రమాణాలను బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోలేదనే నిగూఢ సత్యాన్ని అంగీకరించకతప్పదు.

ఇప్పుడు సీన్ రివర్స్. బ్లాకులు బద్దలై, ఇసుక కదిలిపోయి మొత్తం ప్రాజెక్టుకే ఎసరొచ్చింది. 'కాగ్' నివేదిక సైతం కాళేశ్వరం సామర్థ్యంపై రెండేండ్ల కిందే అనుమానపడ్డది. ఎన్‌డీఎస్‌ఏతోపాటు విజిలెన్స్ శాఖ సైతం కాళేశ్వరం నిర్మాణంలో అవినీతి, అవకతవకలు జరిగాయని ఇప్పటికే నివేదికలిచ్చాయి. భారీ సొమ్ముతో నిర్మించిన బ్యారేజీల్లో నీటిని నిలువ చేసే పరిస్థితీ లేదు. ఇందులో మోడీ సర్కార్ పాపమూ ఉంది. కనీస పరిశీలన లేకుండానే కేంద్ర జల సంఘం డీపీఆర్‌ను ఆమోదించడం, అలాగే వ్యాప్కోస్ సంస్థ సైతం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆగమేఘాల మీద ప్రాజెక్టును పట్టాలెక్కించారు. ఇదిలా వుండగా గత ఐదు నెలలుగా కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యంపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇప్పటికే ఉన్నతాధికారులు, ఇతరులను విచారించింది. ఇక ఉన్నతస్థాయి ప్రజా ప్రతినిధుల వంతు రానుంది. రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు స్టేట్‌మెంటు ఇస్తూ డీపీఆర్, డిజైన్లు, డ్రాయింగులు, బ్యారేజీల్లో నీరు నింపడం వరకు అన్ని అప్పటి ముఖ్యమంత్రి నిర్ణయాలేననీ, మొత్తం కాళేశ్వరం ప్రణాళిక ఆయనదని కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో కుండబద్దలు కొట్టారు. కేసీఆర్‌దే పాపమంటూ వేలెత్తి చూపారు. అందుకవసరమైన సాక్ష్యాధారాలు, సమావేశాల మినిట్స్, ఇతర ఫైళ్లనూ కమిషన్‌కు అందజేశారు. అంతా తానై వ్యవహరించిన నేపథ్యంలో ప్రాజెక్టు ఆరంభంలో భుజకీర్తులు తగిలించుకున్న మాజీ సీఎం కేసీఆర్, తాజా ఘోర పరిస్థితికి కూడా బాధ్యత వహిస్తారా? ఇది ఇంజినీర్ల పని అంటూ తప్పించుకోజూస్తారా? అనేది మిలియన్ డాటర్ల ప్రశ్న.

జస్టిష్ ఘోష్ కమిషన్ విచారణ నివేదిక కోసం తెలంగాణ ప్రజానీకం వేయికండ్లతో ఎదురుచూస్తున్నది. భారీగా అప్పులు చేసి ఈ ప్రాజెక్టు కోసం ఖర్చుపెట్టారు. తీరాచూస్తే పిల్లర్లు కుంగిపోయి, సీపేజీలు ఏర్పడి సొంతం ప్రాజెక్టు ఉనికే ప్రశ్నార్థకమవుతున్న వేళ, వేల కోట్ల ప్రజాధనం సముద్రం పాలైనట్టే కదా. గత వర్షాకాలపు వరదనీటిని ఈ ప్రాజెక్టులో నిలువచేసే పరిస్థితి లేకే గేట్లు ఎత్తేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సాగు, తాగు, పరిశ్రమల అవసరాలకు నీరం దించాలని కేసీఆర్ సర్కారు భావించింది. అలాగే చేపల వ్యాపారం,జలక్రీడల నిర్వహణతోపాటు పర్యాటకాన్ని అభివృద్ధికీ అవకాశాలూ ఉంటాయని ఉబ్బగొట్టింది. ఎన్నో అనుకుంటాం.. అన్నీ జరుగుతాయా ఏంటీ అని సాధారణంగా జనం అనుకుంటూ ఉంటారు. మేము అలా అనుకుని ప్రాజెక్టు కట్టాం.. ఇలా జరుగుతుందని ఉహించామా ఏంటీ అనే తరహా ప్రచారానికి బీఆర్ఎస్ ఒడికడితే అంతకంటే మహాపాపం ఏముంటుంది? ఘోష్ కమిషన్ ఎదుట కుప్పిగంతులు వేసేందుకు ఒకరిద్దరు అధికారులు ప్రయత్నిస్తే 'ఎవరో చేసిన తప్పులకు మీ భుజాలపై వేసుకోవద్దు' అని చైర్మెన్ బుద్ధిచెప్పిన వైనం పత్రికల్లోనే చూశాం. అసలు ప్రాజెక్టు ప్రారంభ ఏడాది 2019 నుంచే సమస్యల్లో ఉందని అధికారులు చెప్పడాన్ని బట్టి చూస్తే కనీస సాంకేతిక ప్రమాణాలను బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోలేదనే నిగూఢ సత్యాన్ని అంగీకరించకతప్పదు. అందుకే అప్పట్లో రాష్ట్ర మంత్రివర్గం చేసిన నిర్ణయాలు, ఇతర వివరాలూ ఇవ్వాలని తాజాగా కమిషన్ సర్కారును కోరింది. నాసిరకం పనులతో వేల కోట్లు విలువైన ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వారు పాలకులైనా, అధికారులైనా కోర్టు బోనులోకి లాగాల్సిందే. నిజాన్ని నిగ్గుతేల్చాల్సిందే. శిక్షపడేలా సర్కారు కఠినంగా వ్యవహరించాల్సిందే.

కార్మికుల కర్షకుల నవ్వులే
దీపావళి వెండి
వెలుగులవుతాయి
కర్షకుడి దిగుబడి
కార్మికుడి కూలిడబ్బులు
చిచ్చుబుడ్డిలా నిండుగా
చిమ్మితేనే
మొహాలు మతాబుల్లా
వెలిగిపోతాయి
అనూహ్య విలయాలు
పనులు దొరకని కరువులు

వెలిగే దీపాలు..



మేఘమల్లే కమ్మితే
బతుకులు తడిసిన
టపాసులవుతాయి
రైతుకి గిట్టుబాటు ధర
శ్రామికుడికి శ్రమకు తగ్గ ధర
దొరికిన రోజు వాళ్ల
జీవితాలు కాకరపువ్వొత్తుల్లా
వెలిగిపోతాయి
రైతులు మట్టినే నమ్ముకున్నా
కార్మికులు శ్రమనే అమ్ముకున్నా
వాళ్ల కుటుంబాలు
మూడు పూటలా అన్నం
తినగలిగే రోజు
దేశ భవిష్యత్తు తారాజువ్వల్లా
అభివృద్ధి నింగిలోకి
దూసుకుపోతాయి..!!

- బి.పురుషోత్తమ్,
9949800253

మరకుంభి పోరాటం- నేటి తరానికి స్ఫూర్తిదాయకం



బండారు రమేష్
9490098251

కొన్ని ఘటనలు గుండెల్ని పిండేస్తాయి.. మరికొన్ని సన్నివేశాలు కండ్లముందే నిలుస్తాయి ఇంకొన్ని దృశ్యాలు అసలు నిద్రే లేకుండాచేస్తాయి.. వాటి గురించి చెప్పడానికి భావాలే తప్ప, భాష సరిపోదు. కన్నీళ్లే తప్ప వర్ణనా ఉండదు. అలాగని చెప్పకుండా ఉండలేం.. మాట్లాడకుండా తప్పించు కోలేం. పదేండ్ల కిందట జరిగిన ఘటన ఇది. అయితే దీన్ని చెప్పేకంటే ముందు మనం స్వతంత్ర భారతావనిలోనే ఉన్నామా? లేదంటే బానిస యుగంలో బతుకుతున్నామా? అనే సందేహం రాక మానదు. అంతులేని అంటరానితనం, ఏకధాటిగా కొనసాగిన కులవివక్ష, రెండుగ్లాసుల పద్ధతి, ఇది పెత్తందారుల దాష్టీకానికి నిదర్శనం. దీన్ని ప్రశ్నించినందుకు జరిగిన ఘోరం, దళితకాలనీ శ్మశానంగా మారడం. దీనిపై న్యాయపోరాటానికి నడుం బిగించిన సీపీఐ(ఎం), ఇన్నాళ్లకు దోషులకు శిక్షపడేలా చేసింది. ఈ ఘటన జరిగింది గ్రామమే కావచ్చు, కానీ అక్కడ జరిగిన స్ఫూర్తివంతమైన పోరాటం నేటితరానికి ఆదర్శం.

అది 2014వ సంవత్సరం. కర్నాటక రాష్ట్రం, కొప్పాల జిల్లా, గంగావతి తాలూకా మరకుంభి గ్రామంలో జరిగిన ఓ దారుణం. ఆధిపత్య కులాలకు చెందిన వందలాది మంది ఆ గ్రామంలోని దళిత కాలనీపై దాడి చేశారు. సినిమా థియేటర్లో జరిగిన ఓ ఘటనను ఆసరాగా చేసుకుని గ్రామ పెత్తందారులు, ఆధిపత్య భూస్వాములు రాళ్లు, కర్రలు , మారణాయుధాలతో దళిత కాలనీపై విరుచుకుపడ్డారు. దొరికిన వారిని దొరికినట్లు దారుణంగా కొట్టి తీవ్రంగా హింసించారు. మహిళలు, పిల్లలు అని తేడా చూడకుండా చితకబాదారు. 'మాకు ఎదురు తిరిగితే మంటల్లో మాడి మసి కావాల్సిందే' అంటూ దళితుల ఇండ్లకి నిప్పు పెట్టారు. వారికున్న కొద్దిపాటి ఆస్తులనూ ధ్వంసం చేశారు. కాలనీని మొత్తంగా శ్మశానంగా మార్చారు. 'ఇప్పుడు ఇండ్లు మాత్రమే దహనమయ్యాయి, భవిష్యత్తులో మాకు ఎదురు తిరిగితే శవాల దిబ్బలు మిగులుతాయి' అని హెచ్చరించారు.

అసలు కారణమేంటి?

ఈ ఘటన ఎందుకు జరిగింది? దీని వెనుకున్న అసలు కారణమేంటి? ఈ ఘోరం అకస్మాత్తుగా జరిగిందా? కానే కాదు, ఇది ప్రణాళికాబద్ధంగా దళితుల మీద జరిగిన హత్యాయత్నం. ఎన్నో ఏండ్ల నుండి గ్రామంలో పెద్ద ఎత్తున కులవివక్ష, అంటరానితనం కొనసాగుతూ వస్తున్నది. దళితులు క్షవరం చేయించుకోవడానికి అనుమతిలేదు. హోటళ్లలో కనీసం టీ తాగ డానికి కూడా అవకాశం లేదు. ఒకవేళ తాగాలన్నా రెండోగ్లాసులో మాత్రమే తాగి, వెంటనే ఆ గ్లాసును శుభ్రంగా కడగాలి. ఆధిపత్య కులాల వారు షాపులో ఉన్న సమయంలో కిరాణ సరుకులు కొనడానికి వీల్లేదు.వారితో కలిసి కూర్చొని ఆటోల్లో ప్రయాణించరాదు. దళిత మహిళలపైన ఒకవేళ అఘాయిత్యాల వంటి ఘటనలు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయడం, అలాగే న్యాయస్థానాల్ని ఆశ్రయించడం కూడా నిషేధమే.అయితే, ఈ మారణ, దారుణాల వెనుక ఉన్న విస్తుగొలిపే విష యాలున్నాయి. తరతరాల నుంచి కొనసాగుతున్న కులవివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా ఆ గ్రామంలో సీపీఐ(ఎం) పెద్దఎత్తున

> ఈ ఘటన ఎందుకు జరిగింది? దీని వెనుకున్న అసలు కారణమేంటి? ఈ ఘోరం అకస్మాత్తుగా జరిగిందా? కానే కాదు, ఇది ప్రణాళికాబద్ధంగా దళితుల మీద జరిగిన హత్యాయత్నం. ఎన్నో ఏండ్ల నుండి గ్రామంలో పెద్ద ఎత్తున కులవివక్ష, అంటరానితనం కొనసాగుతూ వస్తున్నది. దళితులు క్షవరం చేయించుకోవడానికి అనుమతిలేదు. హోటళ్లలో కనీసం టీ తాగ డానికి కూడా అవకాశం లేదు. ఒకవేళ తాగాలన్నా రెండోగ్లాసులో మాత్రమే తాగి, వెంటనే ఆ గ్లాసును శుభ్రంగా కడగాలి. ఆధిపత్య కులాల వారు షాపులో ఉన్న సమయంలో కిరాణ సరుకులు కొనడానికి వీల్లేదు.వారితో కలిసి కూర్చొని ఆటోల్లో ప్రయాణించరాదు. దళిత మహిళలపైన ఒకవేళ అఘాయిత్యాల వంటి ఘటనలు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయడం, అలాగే న్యాయస్థానాల్ని ఆశ్రయించడం కూడా నిషేధమే.



పోరాటాలు నిర్వహిస్తూ వస్తోంది. ప్రజా సంఘాలను నిర్మిస్తూ, ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తూ, ఆధిపత్య కులాల్లోని అభ్యుదయ శక్తులను సైతం కలుపుకుంటూ ఉద్యమాలు నిర్వహిస్తూ వచ్చింది. రెండు గ్లాసుల పద్ధతికి వ్యతిరేకంగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టింది. కులాంతర వివాహాలను ప్రోత్సహించింది. ఆటోల్లో, బస్సుల్లో దళితులు, ఆధిపత్య కులాల ప్రజలు కలిసి ప్రయాణం చేయడంలో తప్పులేదని, అందరూ మనుషులమేనంటూ, అంటరానితనానికి వ్యతిరేకంగా పార్టీ నికరంగా దీర్ఘకాల ఉద్యమాలను నడిపింది. దళితుల క్షవరంలో వివక్ష చూపించడం నేరమని ఎత్తిచూపింది. ఓ వైపు పెత్తందారుల దౌర్జన్యాలను అడ్డుకోవడం, మరోవైపు దళితుల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించే కార్యకలాపాలను చేపట్టడాన్ని పెత్తందారులు జీర్ణించుకోలేదు.

గ్రామంలో సీపీఐ(ఎం) బలపడటం, దళితులు సంఘటిత మవ్వడం, ప్రశ్నించడం అతిపెద్ద నేరంగా చూశారు.దళితుల మీద విపరీతమైన ద్వేషాన్ని పెంచుకున్నారు. అప్పటినుంచి సీపీఐ(ఎం), దాని అనుబంధ ప్రజా సంఘాల్లో పనిచేస్తున్న కార్యకర్తలను శత్రువులుగా చూడటం మొదలుపెట్టారు. దళితుల్లో వస్తున్న సామాజిక చైతన్యాన్ని తట్టుకోలేకపోయారు. ఇది తమ ఆర్థిక, సామాజిక ప్రయోజనాలకు నష్టమని, గ్రామ రాజకీయాలపై తమ పట్టు సడలే అవకాశం ఉందనే అభిప్రాయానికి వచ్చారు. ఎలాగైనా తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవాలనుకున్నారు.

పెత్తందారుల తీర్మానాలు, బహిష్కరణలు

దీంతో పెత్తందారులు దళితుల పైన మరింత ఒత్తిడిని పెంచారు. అనాధిగా వస్తున్న వివక్ష రూపాలు అలాగే కొనసాగుతాయని హెచ్చరించారు. తమ మాట విన్నవారు, తాము చెప్పినట్టుగా నడుచుకునే వారిని మాత్రమే వ్యవసాయ పనులకు పిలుస్తామని చాటింపులు వేయించారు. ఏదైనా ఆర్థిక అవసరాలు ఉన్నప్పుడు విధేయులుగా ఉండేవారికే అప్పులిస్తామని ప్రకటించారు. మాటవినని వారికి అప్పు పుట్టదని హెచ్చరించారు. తమ ఆదేశాల్ని పాటించకపోతే దళితులకు గ్రామబహిష్కరణ తప్పదని హెచ్చరించారు. అలా మాటవినని దళిత కుటుంబాలను బహిష్కరించారు కూడా. ఆధిపత్య భూస్వాములు, పెత్తందారి కులపెద్దలు తమను ప్రశ్నించేవారిని, ఉద్యమాల్లో పాల్గొంటున్న వారిని 'అధికార' అండతో నిర్బంధించారు, కేసులు పెట్టి జైల్లోకి పంపే ప్రయత్నం చేశారు. అయితే వారు ఎంత ఒత్తిడి చేసినా సీపీఐ(ఎం)తో పాటు, ప్రజా సంఘాలు వెనుకడుగు వేయలేదు. కులవివక్ష వ్యతిరేక పోరాటాల్లో దళితులు పెద్ద ఎత్తున పాల్గొనటం మొదలుపెట్టారు. ఇది పెత్తందారులను మరింత అసహనానికి గురిచేసింది.అదను చూసి కసితీరా దళితులపైన దాడి చేయాలనుకున్నారు. భౌతికదాడులతో భయభ్రాంతులకు గురిచేసి పార్టీకి దూరం చేయాలనుకున్నారు.

> పెత్తందారులు దళితుల పైన మరింత ఒత్తిడిని పెంచారు. అనాధిగా వస్తున్న వివక్ష రూపాలు అలాగే కొనసాగుతాయని హెచ్చరించారు. తమ మాట విన్నవారు, తాము చెప్పినట్టుగా నడుచుకునే వారిని మాత్రమే వ్యవసాయ పనులకు పిలుస్తామని చాటింపులు వేయించారు. ఏదైనా ఆర్థిక అవసరాలు ఉన్నప్పుడు విధేయులుగా ఉండేవారికే అప్పులిస్తామని ప్రకటించారు. మాటవినని వారికి అప్పు పుట్టదని హెచ్చరించారు. తమ ఆదేశాల్ని పాటించకపోతే దళితులకు గ్రామబహిష్కరణ తప్పదని హెచ్చరించారు. అలా మాట వినని దళిత కుటుంబాలను బహిష్కరించారు కూడా. ఆధిపత్య భూస్వాములు, పెత్తందారి కులపెద్దలు తమను ప్రశ్నించేవారిని, ఉద్యమాల్లో పాల్గొంటున్న వారిని 'అధికార' అండతో నిర్బంధించారు, కేసులు పెట్టి జైల్లోకి పంపే ప్రయత్నం చేశారు.

ఆగస్టు 28న ఏం జరిగిందంటే?

28 ఆగస్టు 2014. గంగావతి సినిమా హాలులో జరిగిన ఓ చిన్న ఘటన. సినిమా టిక్కెట్లు తీసుకునే సందర్భంలో తమకే ముందు టిక్కెట్లు ఇవ్వాలని ఆధిపత్య కులానికి చెందిన మంజునాథ అనే వ్యక్తి కోరాడు. దీన్ని అదే మరకుంభి గ్రామనికి సంబంధించిన దళిత యువకుడు బీమ్ సే వ్యతిరేకించాడు. ఎవరైనా క్యూలో నిలబడి మాత్రమే టికెట్ తీసుకోవాలని వాదించాడు. దీన్ని సహించలేని మంజునాథ భీమ్ సేను కులం పేరుతో దూషించాడు. దీంతో చిన్నపాటి ఘర్షణ మొదలైంది. అక్కడ ఉన్న మరికొంత మంది దళిత యువకులు భీమ్ సేకు అండగా నిలబడ్డారు. మంజునాథను వెనక్కినెట్టారు. దీన్ని అవమానంగా భావించిన మంజునాథ మరకుంభి గ్రామానికి వెళ్లి తమ ఆధిపత్య కులపెద్దలను రెచ్చగొట్టాడు. అప్పటికే దళితుల మీద కసితో రగిలిపోతున్న పెత్తందారులు ఈ ఘటనను ఆసరాగా తీసుకుని మరుసటి రోజు తెల్లవారుజామునే నాలుగు గంటల ప్రాంతంలో దళిత కాలనీపై విరుచుకుపడ్డారు. కర్రలు, కత్తులు, ఇతర మారణాయుధాలతో దాడి చేశారు. అకస్మాత్తుగా నిద్రమత్తులో తమపై జరిగిన దాడిని దళితులు వెనక్కి కొట్టలేకపోయారు. తేరుకునే లోగానే జరగాల్సిందంతా జరిగిపోయింది. తీవ్రగాయాలతో దళితులంతా చెల్లాచెదురై పరుగులు పెట్టారు. చంటి పిల్లలను, వృద్ధులను కాపాడుకునే ప్రయత్నం చేశారు. మంటల్లో కాలి పోతున్న తమ ఇండ్లను చూస్తూ బోరున విలపించారు. పెత్తందారులకు ఎదురు తిరిగేంతా శక్తి అక్కడ లేకుండా పోయింది. గుండె ధైర్యాన్ని కోల్పోయారు. కాలిపోతున్న గుడిసెల్లో వారి ఆశలు మాడిపోతుంటే విగతజీవుల్లా నిలబడిపోయారు. తెల్లారేసరికే వారి జీవితాలు తెల్లారిపోయాయి.

సీపీఐ(ఎం) రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

అయితే ఈ దుర్మార్గాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా నిరసించింది. ధైర్యం కోల్పోయిన దళితులకు గుండె ధైర్యాన్ని అందించింది. దళిత కాలనీపై కుల దురహంకారంతో దాడి చేసిన ఆధిపత్య కుల పెద్దలను , వారికి సహకరించిన వారందరికీ శిక్ష పడాల్సిందేనని పట్టుబట్టింది. వీధులు, కాలనీలు, గ్రామాల్లో మొదలైన ఉద్యమం ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రాన్ని కదిలించింది. ఈ సమస్యను సీపీఐ(ఎం) జాతీయ, కర్నాటక రాష్ట్ర కమిటీ తీవ్రంగా పరిగణించింది. గంగావతి తాలూకాలోని మరకుంభి గ్రామం నుంచి బెంగళూరు వరకు పాదయాత్ర చేపట్టింది. పోలీస్‌స్టేషన్ల ముందు బైఠాయించి దళితులకు న్యాయం చేయాలని నినదించింది. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఏ బేబీ , కేరళ పార్టీ ప్రస్తుత పార్లమెంటు సభ్యులు రాధాకృష్ణన్ తదితరులు పెద్ద ఎత్తున దళిత సంఘీభావ ఉద్యమాన్ని నడుపుతూనే దళితులపై దాష్టీకానికి పాల్పడ్డ నిందితులను శిక్షించాలని కోర్టులో న్యాయ పోరాటం చేశారు. అయితే బలమైన సాక్ష్యాలు లేకపోవడంతో పెత్తందారుల తమకు ఎదురే లేదనుకున్నారు. ఈ నేపథ్యంలో దళితుల పైన జరిగిన దాడిని ప్రత్యక్షంగా చూసిన సీపీఐ(ఎం) కార్యకర్త దొడ్డ వీరేశప్ప కోర్టులో సాక్ష్యం చెప్పేందుకు ముందుకొచ్చాడు. అయితే 2015లో కొప్పాల రైల్వే స్టేషన్ పరిధిలోని రైలు పట్టాలపై వీరేశప్ప శవమై కనిపించాడు. పోలీ సులు దీన్ని ఆత్మహత్యగా ప్రకటించారు. అయితే తమకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి ముందుకొచ్చిన వీరేశప్పను ఆధిపత్య కులాలే హత్యచేసి, రైలు పట్టాలపై పడేశారని సీపీఐ(ఎం) ఆందోళన వ్యక్తం చేసింది. హత్యను ఖండించి, అంతటితో ఆగకుండా ఉద్యమాన్ని మరింత బలంగా ముందుకు నడిపించింది. పదేండ్ల పాటు వీధి ఆందోళనలు, న్యాయ పోరాటాలు నిర్వహించింది. ఇది రాష్ట్రవ్యాప్త సమస్యగా పాలక, ప్రతిపక్ష పార్టీలపై ఒత్తిడి తెచ్చింది.

కోర్టు తీర్పు-98మందికి శిక్ష

ఈ క్రమంలో వారి పదేండ్ల పోరాటం ఫలించింది. పది రోజుల క్రితం కర్నాటక రాష్ట్రం కొప్పాల జిల్లా సెషన్స్ కోర్టు మరకుంభి కేసులో తీర్పునిచ్చింది. దళితులపైన విచక్షణారహితంగా దాడి చేసిన ఆధిపత్య కులాలకు చెందిన 98 మందికి కోర్టు జీవితకాల కఠిన కారాగార శిక్షను విధిస్తూ సంచలన తీర్పును వెల్లడించింది. మరో ముగ్గురికి ఐదేండ్ల సాధారణ జైలు శిక్షను విధించింది. కుల వివక్షతను ప్రోత్సహించే వారికి భవిష్యత్తులో సైతం ఇటువంటి శిక్షలే విధించబడతాయని న్యాయమూర్తి తీర్పులో పేర్కొనడం ఆహ్వానించదగిన అంశం. ఇంతకాలానికి నిందితులకు జీవితకాల శిక్షను విధిస్తూ, ఇచ్చిన తీర్పు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇది భారతదేశ న్యాయవ్యవస్థ ప్రస్థానంలోనే ఓ ప్రత్యేకమైన కేసుగా నిలబడుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సీపీఐ(ఎం) చేసిన సుదీర్ఘ న్యాయ పోరాటాలను పలు దళిత సంఘాలు, సామా జిక ఉద్యమ నాయకులు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా మరకుంభి దళిత న్యాయ పోరాటంలో అసువులు బాసిన దొడ్డ వీరేశప్పకు ఈ సందర్భంగా విప్లవ జోహార్లు అర్పిద్దాం.దళితులపై జరిగిన దాష్టీకానికి వ్యతిరేకంగా సీపీఐ(ఎం) చేసిన పోరాటంలో కలిసొచ్చిన వారందరికీ విప్లవ జేజేలు తెలుపుదాం. ■

భారత్-చైనా సంబంధాల్లో ముఖ్య ఘట్టం

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

వాస్తవాధీన రేఖ (లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్-ఎల్.ఒ.సి) పొడుగునా గస్తీ ఏర్పాట్లపై భారత్-చైనాల మధ్య ఒక ఒప్పందం కుదిరినట్టు భారత ప్రభుత్వం అక్టోబర్ 21న ప్రకటించింది. ఇది స్వాగతించదగిన పరిణామం. ఈ రెండు పొరుగు దేశాల మధ్య సంబంధాల సాధారణీకరణకు ఇది దారితీస్తుందని ఆశించవచ్చు. 2020లో గాల్వాన్ లోయలో సరిహద్దు ఘర్షణల తర్వాత భారత్-చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ ఘర్షణలు పూర్తిస్థాయి యుద్ధానికి దారి తీయకుండా చూడాలని రెండు దేశాలు అంగీకరించాయి. 2020 నుంచి ఇరు దేశాల మధ్య సైనిక దౌత్య స్థాయిల్లో 31 దఫాల చర్చలు జరిగాయి. ఇరుపక్షాలకు చెందిన సైనిక కమాండర్లు సైనిక చర్చల్లో పాల్గొన్నారు. కాగా భారత్-చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు సమన్వయ యంత్రాంగం (డబ్ల్యు.ఎం.సి.సి) ఆధ్వర్యంలో దౌత్య స్థాయి చర్చలు జరిగాయి. రాజకీయ నాయకత్వ జోక్యంతో ఈ చర్చలు నిర్ణయాత్మక దశకు చేరుకున్నాయి. సాధారణ సంబంధాల పునరుద్ధరణ అవసరాన్ని రాజకీయ నాయకత్వం గుర్తించింది. "భారత్- చైనాల మధ్య స్థిరమైన శాంతియుత సంబంధాలు మన రెండు దేశాలకే గాక మొత్తం ప్రాంతానికి, ప్రపంచానికి కూడా అవసరం" అని మోడీ అన్న మాటల్లో ఈ వైఖరినే ప్రతిబింబించారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీని రెండు మాసాల మధ్యలో రెండు సార్లు (జులై, ఆగష్టు నెలల్లో) కలుసుకున్నారు. రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్‌లో 'బ్రిక్స్' సమావేశాలతో పాటు భద్రతా వ్యవహారాల సలహాదార్ల సమావేశం నేపథ్యంలో అజిత్ దోవల్ కూడా వాంగ్ యీ ని కలుసు కున్నారు. వీటి కొనసాగింపుగా డబ్ల్యు.ఎం.సి.సి రెండు సార్లు వెంట వెంట సమావేశాలు జరిపింది. చాలా సహనంతోనూ చాలా నికరంగానూ సాగించిన దౌత్య నీతి ఫలితమే ఈ ఒప్పంద మని జైశంకర్ పేర్కొనడానికి కారణమదే. రెండు దేశాల మధ్య వివాదాల పరిష్కారానికి సరైన మార్గం కూడా అదే. రష్యాలోని కజన్‌లో 'బ్రిక్స్' శిఖరాగ్రసభ నేపథ్యంలో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల ద్వైపాక్షిక సమావేశం జరగడానికి ఈ దౌత్యపరమైన ప్రయత్నాలన్నీ బాట వేశాయి.

తొలిసారి భేటీ ప్రాధాన్యత

2020 ప్రతిష్టంభన తర్వాత ఉభయ నాయకులు ద్వైపాక్షిక భేటీ జరపడం ఇదే మొదటిసారి గనక ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ద్వైపాక్షిక సంబంధాలను సుస్థిరపర్చుకోవడానికి, పునర్నిర్మించుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలని ఇరువురు నాయకులు అంగీకారానికి వచ్చారు. భారతదేశ బూర్జువా వర్గానికి ఎదురైన ఆర్థిక సమస్యలే చైనాతో వ్యాపారం చేసుకునే సదుపాయాన్ని సరళతరం చేసేందుకు ఒత్తిడి తెచ్చేలా చేశాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖ చెప్పే ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య 562.9 వందల కోట్ల డాలర్లతో చైనా ఇండియా దిగుమతులలో అగ్రస్థానంలో నిలిచి వుంది. ప్రస్తుత ప్రపంచీకరణ ఆర్థికావరణంలో ఆర్థిక సహకారాన్ని పెంచుకోవడం ఉభయ దేశాలకూ లాభదాయకమని అంతకంతకూ ఎక్కువగా గుర్తించబడింది. భారతదేశాన్ని ఒక ఉత్పత్తి కేంద్రంగా మార్చాలంటే విద్యుత్ వాహనాలు (ఇ.విలు), స్మార్ట్‌ఫోన్లు, సోలార్ ఫోన్లు, మందుల వంటి కొన్ని సరుకులు ఉత్పత్తి చేసే పరిశ్రమలను భారత ప్రభుత్వం కీలకంగా గుర్తించింది. చైనాతో ఆర్థిక సంబంధాల పునరుద్ధరణ ఈ పరిశ్రమలలో అత్యధిక వాటికి ఉపయోగంగా వుంటుంది. ఉత్పత్తి రంగంలో సంయుక్త



> 2020 సరిహద్దు ఘర్షణల తర్వాత భారత ప్రభుత్వం అమెరికాతో తన సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంది. అనేక రక్షణ ఒప్పందాలు మాత్రమేగాక భారత్-చైనా వివాద సరిహద్దు గురించి వాస్తవ సమాచారం ఎప్పటికప్పుడు పంచుకునేలా కూడా ఒప్పందాలు చేసు కుంది. హిమాలయ సరిహద్దులో సైనిక దళాల కదలికలపై నిఘా కోసం 300 కోట్ల డాలర్ల పైన వ్యయంతో 31 ఆయుధ సహిత గార్డియన్ డ్రోన్లను ఇండియా కొనుగోలు చేయడం కూడా ఆ ఒప్పందాల్లో ఒకటి. అమెరికా నాయకత్వంలోని 'క్వాడ్' కూటమితో ఆస్ట్రేలియా, జపాన్‌లతో పాటు ఇండియా కూడా సభ్యదేశంగా వుంది. ఆఫ్ఘనిస్తాన్ నుంచి అమెరికా ఉపసంహరణ, మరీ ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ మరోసారి అధ్యక్షుడయ్యేట్టయితే దాని విధాన నిర్ణయాలలో విశ్వాస రాహిత్యం రీత్యా ప్రభుత్వం చైనాతో సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చుకోవడం వివేకవంతమైన పని అని ఆరెస్సెస్ పత్రిక 'ఆర్గనైజర్' (2024 సెప్టెంబర్ 22) కూడా వ్యాఖ్యానించింది.

పథకాలకు చైనా నుంచి పెట్టుబడులు రావడం పట్ల ప్రస్తుతం వున్న ప్రతికూల వైఖరి మారవలసి వుంటుంది. విద్యుత్ వాహనాల తయారీలో ప్రపంచంలోనే అగ్ర స్థానంలో వున్న అతి పెద్ద చైనా పరిశ్రమ బివైడి 2023లో ఒక భారతీయ కంపెనీలో వంద కోట్ల డాలర్ల పెట్టుబడి పెడతానంటే తిరస్కరించడం ముందుచూపు లేకుండా తీసుకున్న చర్య. విద్యుత్ వాహనాలు, బ్యాటరీల తయారీ కర్మాగారం స్థాపించి వుంటే భారత దేశం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉత్పత్తి ప్రక్రియలనూ అందుకునేందుకు సహాయపడేది.

అంతర్జాతీయ ప్రభావం, అమెరికా పాత్ర

వేగంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితి కూడా ఈ రెండు దేశాల మధ్య సంబంధాల సాధారణీకరణ అవసరం గుర్తించాల్సిన స్థితిని కల్పించింది. ఉక్రెయిన్ యుద్ధం, గాజా పశ్చిమాసియాలలో ఇజ్రాయిల్ దురాక్రమణ వనరుల పైన, వాణిజ్య మార్గాల పైన, దేశాల మధ్య సంబంధాల పైన తీవ్ర ప్రభావం వేశాయి. తమ వ్యవహారాలన్నీ కేవలం అమెరికాతోనే జతపర్చడం విషతుల్యమని చాలా దేశాలు కళ్లు తెరిచి గుర్తించాల్సి వచ్చింది. ఈ పూర్వరంగంలో 'బ్రిక్స్' వంటి కూటములు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అలాంటి బృందాలలో చేరాలనే ఆకాంక్షను అనేక దేశాలు బహిరంగంగానే వెల్లడిస్తున్నాయి. పశ్చిమాసియాలో రెండు ప్రాంతీయ అధికార కేంద్రాలుగా వున్న సౌదీ అరేబియా, ఇరాన్ ఈ మధ్యనే ఈ కూటమిలో చేరాయి. తన చుట్టూ ఇలాంటి భౌగోళిక రాజకీయ మార్పులు సంభవిస్తుంటే ఈ కూటమిలో ఇండియా ఒంటిగొట్టుగా వుండజాలదు. కూటమి వ్యవస్థాపక సభ్య దేశాలైన వాటితో శత్రుపూరిత సంబంధాలు గాక సత్సంబంధాలు కలిగివుండటం సహజం.

2020 సరిహద్దు ఘర్షణల తర్వాత భారత ప్రభుత్వం అమెరికాతో తన సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంది. అనేక రక్షణ ఒప్పందాలు మాత్రమేగాక భారత్-చైనా వివాద సరిహద్దు గురించి వాస్తవ సమాచారం ఎప్పటికప్పుడు పంచుకునేలా కూడా ఒప్పందాలు చేసు కుంది. హిమాలయ సరిహద్దులో సైనిక దళాల కదలికలపై నిఘా కోసం 300 కోట్ల డాలర్ల పైన వ్యయంతో 31 ఆయుధ సహిత గార్డియన్ డ్రోన్లను ఇండియా కొనుగోలు చేయడం కూడా ఆ ఒప్పందాల్లో ఒకటి. అమెరికా నాయకత్వంలోని 'క్వాడ్' కూటమితో ఆస్ట్రేలియా, జపాన్‌లతో పాటు ఇండియా కూడా సభ్యదేశంగా వుంది. ఆఫ్ఘనిస్తాన్ నుంచి అమెరికా ఉపసంహరణ, మరీ ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ మరోసారి అధ్యక్షుడయ్యేట్టయితే దాని విధాన నిర్ణయాలలో విశ్వాస రాహిత్యం రీత్యా ప్రభుత్వం చైనాతో సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చుకోవడం వివేకవంతమైన పని అని ఆరెస్సెస్ పత్రిక 'ఆర్గనైజర్' (2024 సెప్టెంబర్ 22) కూడా వ్యాఖ్యానించింది.

వివాద పరిష్కారం, సంబంధాల విస్తరణ

ఇండియా, చైనాలు 3400 కిలోమీటర్ల పైగా సరిహద్దును పంచుకుంటున్నాయి. ఈ సరిహద్దులో పెద్ద భాగం సరిగ్గా నిర్ణయించ బడకపోవడం, రెండు దేశాల మధ్య దీర్ఘకాలంగా వివాదం కొనసాగడానికి కారణమవుతున్నది. భారత్-చైనా సరిహద్దు వివాదాలు మొత్తాన్ని పరిష్కరించుకునే యంత్రాంగాన్ని పునరుద్ధరించుకోవడమే ఇప్పుడు జరగాల్సింది. 1993 సరిహద్దు శాంతి ప్రశాంతతల ఒప్పందం, 2013 సరిహద్దు రక్షణ సహకారంపై పెంచుకోవలసి వుంటుంది. అదే సమయంలో మోడీ ప్రభుత్వం ఆర్థిక సంబంధాల విస్తరణకు చర్యలు తీసు కోవాలి.ప్రజల మధ్య రాకపోకలు ప్రత్యేకించి ఉత్పత్తి రంగంలో మన సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉత్పత్తిని పెంచే పెట్టుబడులను రాబట్టే చర్యలను పెంచుకోవాలి.

(అక్టోబర్ 23 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం) ■

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఖమ్మం
గురువారం | అక్టోబర్ 31, 2024 | www.navatelangana.com

ధాన్యం కేటాయింపునకు బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి

- రైస్ మిల్లులో తాలు పేరుతో కోతలు పెట్టవద్దు
- రైస్ మిల్లర్ల ధాన్యం కేటాయింపుపై సమీక్షించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ- ఖమ్మం

జిల్లాలోని రైస్ మిల్లర్లకు వరి ధాన్యం కేటాయింపు చేసేందుకు బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చూపించడం తప్పనిసరి అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో వరి ధాన్యం కేటాయింపు, బ్యాంక్ గ్యారంటీపై మిల్లర్లతో, బ్యాంక్ అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మిల్లులకు సరఫరా చేసే ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ, సెక్యూరిటీ డిపాజిట్ తప్పనిసరి అని అన్నారు. పౌర సరఫరాల కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా రైస్ మిల్లులకు బ్యాంకు గ్యారంటీ ఆధారంగా కేటాయింపు చేయడం జరుగుతుందని, ప్రభుత్వం పాలసీ నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎటువంటి బకాయిల చరిత్ర లేని



మిల్లర్లు, మిల్లింగ్ సామర్థ్యంపై 10 శాతం బ్యాంకు గ్యారంటీ, 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్, గతంలో బకాయిలు ఉండి సకాలంలో పెనాల్టీతో సహా చెల్లించిన మిల్లర్లు 20 శాతం బ్యాంకు గ్యారంటీ, 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్, వంద శాతం బకాయిలు చెల్లించి 25 శాతం పెనాల్టీతో డిఫాల్ట్ ఉన్న మిల్లర్లు 25 శాతం బ్యాంకు గ్యారంటీ, 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చూపెట్టాల్సి ఉంటుందని అన్నారు. రైస్ మిల్లులకు ధాన్యం మొత్తం కేటాయింపుల ప్రకారం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరిగా తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం శుభ్రం చేయకుండా కొనుగోలు చేయవద్దని ఆదేశాలు జారీ చేశామని, మిల్లుల వద్ద తాలు పేరుతో ఎటువంటి కోతలూ విధించడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. రైస్ మిల్లుల వద్ద హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని అన్నారు. నాణ్యమైన ధాన్యానికి కూడా కోతలు విధించాలని ప్రయత్నిస్తే మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో అధికంగా ధాన్యం కొనుగోలు కూడా లేదని, మనపై అధికంగా ఒత్తిడి లేకపోయినా ఆశించిన స్థాయిలో పని చేయడం లేదని అన్నారు.

ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం జిల్లాలకు సంబంధించి గోడౌన్ స్పేస్ ఉన్నందున, ముందుగా ఖమ్మం జిల్లా స్పేస్, ఎఫ్‌సిఐ అలాట్మెంట్ జరిగేలా చూడాలని అన్నారు. మిల్లుల వద్ద ఉన్న గన్నీ బ్యాగులు కొనుగోలు కేంద్రాలకు త్వరగా అందజేయాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాలకు దగ్గర్లోని రైస్ మిల్లులకు ధాన్యం ట్యాగింగ్ చేయాలని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఎప్పుడు, ఎంత వస్తుందో ప్రణాళిక తయారు చేసుకొని దాని ప్రకారం సన్నద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, మిల్లర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఆనందం

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి రమేష్

నవతెలంగాణ-ఖమ్మం

క్రీడలు మానసిక, శారీరక ఆనందాన్ని, ఆరోగ్యాన్ని కలిగిస్తాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బండి రమేష్, ప్రముఖ న్యాయవాది మక్కెన రాము అన్నారు. బుధవారం ఖమ్మంలోని స్ఫూర్తి షటిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా నిర్వహించిన ఇన్విటేషన్ మెగా షటిల్ టోర్నమెంట్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం మక్కెన రాము స్పాన్సర్ చేసిన బహుమతులను అందజేశారు. సీనియర్ క్రీడాకారుడు ఉసేన్‌ను సన్మానించారు. ఈ టోర్నమెంట్లో ప్రథమ బహుమతి లక్ష్మణ్, షాజీ, ద్వితీయ బహుమతి రమేష్, ఆసిఫ్, తృతీయ



బహుమతి రామారావు, సురేష్ పొందారు. కార్యక్రమంలో నిర్వాహకులు 52 డివిజన్ కార్పొరేటర్ బుర్రి వెంకట్ కుమార్, మాజీ కౌన్సిలర్ రమేష్, పిఆర్టియు జిల్లా ఉపాధ్యక్షులు గుడిపూడి శ్రీనివాసరావు, బి.రాజేందర్, పి.ముత్తయ్య, బి.భాస్కర్, ఎస్కే వహీద్, కిన్నెర లక్ష్మణ్, ఉప్పల రమేష్, చిన్న లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సకల ఉద్యోగుల, సమ్మేళనం, సమారాదనను విజయవంతం చేయండి

- జేపీసీ ప్రధాన కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు

నవతెలంగాణ- ఖమ్మం

నవంబర్ 3వ తేదీన జరిగే ఉద్యోగుల సమ్మేళనం, వనసమారాధన కార్యక్రమం నిర్వహించే తోటను జేపీసీ ప్రధాన కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు సందర్శించారు. బుధవారం హైదరాబాద్ నుండి వచ్చిన అయన 3వ తేదీ జరిగే కార్యక్రమ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రధాన వేదిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు వేరే మరొక వేదికను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ముఖ్య అతిథులు, విశిష్ట అతిథిలు, జిల్లా అధికారులు, ఇతర ఉన్నతాధికారులు, మంత్రులు, ఎంఎల్ఏలు వంటి వారిని ఆహ్వానించడం ముగిసిందన్నారు. ఆ రోజు జరిగే కార్యక్రమానికి వచ్చిన వారిని సాధారంగా ఆహ్వానించేందుకు ప్రత్యేక బృందాలను కేటాయించినట్లు చెప్పారు. ముఖ్యగా భోజనాలు, పార్కింగ్, బస వంటి కార్యక్రమాలకు సైతం ప్రత్యేకంగా



ఏర్పాటు చేసినట్టు వివరించారు. అత్యంత ఘనంగా జరిగే కార్యక్రమం అయినందున ఎక్కడా లోటు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని, ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఉమ్మడి జిల్లా వ్యాపితంగా ఉన్న అన్ని కేడర్ల ఉద్యోగినులు కుటుంబాలతో పాటు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వంటమనిషి వైద్యానికి ఆర్థిక చేయూత

- జీఎం చేతుల మీదుగా రూ. 47వేలు అందజేత

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లిలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో వంటమనిషిగా పనిచేస్తున్న నాగరాజు ఇటీవల గాల్ బ్లాడర్ సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకోవడానికి అతని ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న నేపథ్యంలో వైద్య ఖర్చుల కోసం సంస్థలో పనిచేస్తున్న అధికారులు విరాళాలుగా సేకరించిన రూ. 47వేలు బుధవారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేంరాజు చేతుల మీదుగా బాధితుడు నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కిష్టారం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మునగంటి వేద్రాది నరసింహారావు మాట్లాడుతూ వంటమనిషి నాగరాజు గాల్ బ్లాడర్ సమస్యతో బాధపడుతున్న విషయం తెలిసిన జీఎం షాలేంరాజు



అతని వైద్య ఖర్చుల కోసం ప్రత్యేక చొరవ చూపడంతో అధికారులంతా కలిసి కుక్ నాగరాజుకు సాయం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్, ఏజీఎం సివిల్ రామకృష్ణ, జేవీఆర్ ఓసీ ప్రాజెక్టు ఇంజినీర్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



'స్మార్ట్ కిడ్జ్'లో దీపావళి సంబురాలు

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో బుధవారం ముందస్తు దీపావళి సంబరాలు ఆనందోత్స వాలతో నిర్వహించారు. పాఠశాలలో చిన్నారులు వెలుగులు పండుగను సంబురంగా జరిపారు. తొలుత లక్ష్మీదేవికి విశేష రీతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిఠాయిలను తిని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులు పర్యావరణ రహిత బాణసంచా వెలుగులు నింపారు. నూనె ప్రమిదలను వెలిగించి పాఠశాల ఆవరణమంతా ప్రమిదల వెలుగులతో నింపారు. బాణసంచా కాలుస్తూ చిన్నారులు ఉత్సాహంగా సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



'బ్లూమింగ్ మైండ్స్'లో దీపావళి వేడుకలు

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలను రకరకాల పుష్పాలతో, విద్యుత్, దీపాలతో అందంగా అలంకరించారు. పాఠశాలలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాణాసంచాను కాల్చినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్న పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలో బాణసంచాను కాల్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి.కిరణ్ కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కలెక్టర్‌ని కలిసిన ఆర్డీవో నరసింహారావు

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం ఆర్డీవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన జి.నర్సింహారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ని కలిసి పూలమొక్క అందించారు.

ఇందిరా డెయిరీ కార్యాచరణ చర్యలు వెంటనే చేపట్టాలి

- తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ ప్రొఫెసర్ స్టీవెన్ నిల్, సుభాష్ చంద్రబోస్

నవతెలంగాణ- బోనకల్

ఇందిరా డెయిరీ కార్యాచరణ చర్యలు వెంటనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ ప్రొఫెసర్స్ స్టీవెన్ నిల్, సుభాష్ చంద్రబోస్, ఇందిరా డైరీ ఏపీఎం జంగం లక్ష్మణరావులను ఆదేశించారు. మండల కేంద్రంలో స్నేహాంజలి మండల సమైక్య కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరా డెయిరీ విజయవంతంగా నిర్వహణకుగాను పాల ఉత్పత్తి, పాల సేకరణ మార్కెటింగ్‌కి, రవాణాకి పకడ్బందీ ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. డెయిరీలకు పాల సరఫరా చేస్తున్న వారికి గేదెల పెంపకంలో అవగాహన కల్పించాలని, గేదెలు ఉన్నవారికి గేదెల షెడ్లు, పశుగ్రాసం లభ్యత ఉన్నవారికి మరో యూనిట్ ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు మండల కేంద్రంలో 5000 లీటర్ల సామర్థ్యం గల పాలసీతలీకరణ కేంద్రాన్ని



ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందిరా డెయిరీలో సభ్యత్వం కలిగి ఉన్న వారికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల కార్పొరేషన్ ద్వారా పాడి యూనిట్ల కొనుగోలుకు, పాడి గేదెల యూనిట్ల ఏర్పాటుకు కావలసిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం ఇందిరా డెయిరీ నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. ఈ సమీక్ష సమావేశంలో డిపిఎం శ్రీనివాస్‌రావు, ఇందిరా డెయిరీ అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఐకెపి ఏపీఎం యద్దనపూడి పద్మాలత, సీసీలు కనకపుడి వెంకటేశ్వర్లు, లావూరి ఝాన్సీ భాయ్, కే.పుల్లయ్య, జి.శ్రీనివాసరావు, జెట్టి శోభ, వివోఏలు, పాలమిత్రలు, సభ్యత్వం కలిగిన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- లేకుంటే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు
- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దీక్ష

నవతెలంగాణ- ఖమ్మం

ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫీజుల దీక్ష కార్యక్రమాన్ని ఖమ్మం నగరంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని, పెండింగ్ స్కాలర్షిప్స్, రియంబర్స్మెంట్స్ ఇవ్వకుండా గత ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిందని, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కూడా అదే పోకడలు పోతుందని, ఎస్ఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయకుంటే రాష్ట్ర ముఖ్యమంత్రిని సైతం అడ్డుకుంటామని హెచ్చరించారు. దీక్ష కార్యక్రమానికి మద్దతుగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల



యాజమాన్యాల జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిరంతరం విద్యారంగ సంస్థలు పరిష్కారం కోసం కృషి చేస్తున్న సంఘం ఎస్ఎఫ్ఐ అని, ఎస్ఎఫ్ఐ చేసే ప్రతి పోరాటానికి తమ యాజమాన్యాల మద్దతు ఉంటుందని తెలిపారు. జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ దశలవారీగా జిల్లా వ్యాప్తంగా పెండింగ్ బకాయిల విడుదల కోసం పోరాటాలు నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిని కలిసినా ప్రయోజనం లేకుండా పోతుందని, తక్షణమే స్పందించి విద్యారంగానికి ఇవ్వాల్సినటువంటి నిధులను విడుదల చేయకుంటే జిల్లాలో ముగ్గురు మంత్రులను సైతం అడ్డుకుంటామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్. రమేష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ చేసే ప్రతి పోరాటంలో డివైఎఫ్ఐ మద్దతు ఉంటుందని, విద్యారంగ సంస్థల పరిష్కారం కోసం మరింత కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు సాయి శేషు, జిల్లా కమిటీ సభ్యులు ఉమేష్, రాగిణి నాయకులు శ్రీలత, సంతోష్, మణికంఠ తరుణ్, వంశీ పూజిత సింధు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ'లో అవకాశం ఇవ్వండి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్సీ తాతా, మాజీ ఎమ్మెల్యే సండ్ర

నవతెలంగాణ-సత్తుపల్లి

గత ప్రభుత్వ హయాంలో సొంత స్థలాల్లో గృహాలు మంజూరైన లబ్ధిదారులకు కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లలో అవకాశం కల్పించి ఆదుకోవాలని ఎమ్మెల్సీ తాతా మధుసూదనరావు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌ను కోరారు. బుధవారం ఖమ్మంలో కలెక్టర్‌ను కలిసిన తాతా, సండ్ర అప్పటి ఇండ్ల మంజూరు నేపథ్యాన్ని కలెక్టర్‌కు వివరించారు. సొంత స్థలాలున్న పేద కుటుంబాలకు గత ప్రభుత్వ హయాంలో ఇంటి నిర్మాణాల జీవో విడుదల చేసిన క్రమంలో అప్పటి కలెక్టర్ ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఇండ్ల నిర్మాణాల కోసం రూ. 3లక్షలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీలను లబ్ధిదారులకు కలెక్టర్ అందించారన్నారు. ఆ ప్రొసీడింగ్ కాపీలను అందుకున్న లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను ప్రారంభించారని, చాలా వరకు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. అయితే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అట్టి జీవోను రద్దు చేయడంతో లబ్ధిదారులకు అన్యాయం జరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ఇందిరమ్మ ఇండ్ల



మంజూరులో గతంలో ప్రొసీడింగ్ కాపీలను అందుకున్న గృహ లబ్ధిదారులకు ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం సమస్య పరిష్కారం కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తాతా, సండ్రతో పాటు సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, పెనుబల్లి మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు యాగంటి శ్రీనివాసరావు, రెడ్డెం వీరమోహనరెడ్డి, పాలెపు రామారావు, కనగాల వెంకటరావు, పెనుబల్లి, తల్లాడ మాజీ ఎంపీపీలు లక్కినేని అలేఖ్య, దొడ్డా శ్రీనివాసరావు, సత్తుపల్లి, కల్లూరు మాజీ జెడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు, కట్టా అజయ్‌కుమార్, నాయకులు కాటమనేని వెంకటేశ్వరరావు, దుగ్గిరాల వెంకట్‌లాల్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కంటె వెంకటేశ్వరరావు, బద్దం కోటిరెడ్డి, వజ్రాల రామిరెడ్డి పాల్గొన్నారు.



'మానవ హక్కులు-చట్టాల'పై అవగాహన

నవతెలంగాణ-వైరాటౌన్

మండల పరిధిలోని ఖానాపురం గ్రామంలో బహుజన అభ్యుదయ సేవా సమితి అధ్యక్షురాలు, హ్యూమన్ రైట్స్ సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదూరి మణి అధ్యక్షతన బుధవారం అంగన్వాడి టీచర్లకు మానవ హక్కులు-మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన మహిళా హక్కులను దుర్వినియోగం చేయకుండా, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో హ్యూమన్ రైట్స్ సొసైటీ, బహుజన అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం మాట్లాడుతూ మహిళలకు సమాజంలో అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని తెలుసుకొని మరికొంత మందికి తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా మహిళా హక్కులు, వినియోగదారుల హక్కు చట్టం, పోక్సో చట్టం, పోలీస్ చట్టం, బాల్య వివాహాలు మొదలగు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ ఎస్.కె.బిజాన్ బి.ఖానాపురం, గన్నవరం, గొల్లపుడి, పాలడుగు, గోల్లెనపాడు, రెబ్బవరం, అష్టగుర్తి, కొండకొడిమ గ్రామాల అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులు పెడితే సహించం

నవతెలంగాణ-వేంసూరు

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులు పెట్టినట్లయితే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ ప్రారంభించారు. అనంతరం రైతులను ఉద్దేశించి దయానంద్ మాట్లాడుతూ పక్క రాష్ట్రం నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే సీఈవోనే బాధ్యుడని, రైతులు కూడా సహకరించాలని కోరారు, సొసైటీ డైరెక్టర్ మోరంపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బోనస్ పేరుతో ధాన్యాన్ని శాంపిల్స్ పరిశీలన పేరుతో కాలయాపన చేయటం మూలంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇన్ని నిబంధనలతో రైతులు కల్లాల్లోనే పడిగాపులు పడాల్సి వస్తుంది. దీంతో ఎక్కువ మంది రైతులు ప్రైవేటు వ్యాపారస్తులకు ధాన్యాన్ని



విక్రయించడానికి సానుకూలంగా ఉన్నారన్నారు. సొసైటీ అధ్యక్షుడు తక్కెళ్ళపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ మిల్లర్లు ట్రాన్స్ఫర్ట్ సమస్యలు మూలంగా గతంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఎమ్‌డి ఫైజుద్దీన్ ఫక్రుద్దీన్, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, మందలపు శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్లు సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ చార్జీ పెంపు విరమణ బీఆర్ఎస్ విజయం

నవతెలంగాణ-కారేపల్లి

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరణ బీఆర్ఎస్ విజయమని ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ వైస్‌ఎంపీపీ రావూరి శ్రీనివాసరావులు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరణ బీఆర్ఎస్ విజయంగా అభివర్ణిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో కారేపల్లిలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన ఫలితంగా సామాన్యులపై విద్యుత్ భారం లేకుండా అయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలలో భ్రమలు తొలిగాయని, 100 రోజులలోనే ప్రజలలో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుందన్నారు. రైతు బంధు, రుణమాఫీ, పెన్షన్ల పెంపు, మహిళలకు రూ.2500 ఇవ్వటంలో కాంగ్రెస్ ప్రభుత్వం చతికిల పడిందని ఎద్దేవా చేశారు. ఖరీఫ్ సీజన్ ముగిసి, రబీ సీజన్ ప్రారంభం కావస్తున్న రైతు బంధు వేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గ్రామపంచాయతీలు నిధులు లేక పనులు చేయక మురికి కూపాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో సోసైటీ ఉపాధ్యక్షులు దారావత్ మంగీలాల్, నాయకులు బానోత్ రాందాస్, జూపల్లి రాము, సిద్దంశెట్టి చిన్న నాగయ్య, బర్మావత్ రాందాస్, జాల సాంబ, పాడిత్యా గుగులోత్ కుమార్, సురభి సాగర్, గంగరబోయిన సత్యనారాయణ, రెడ్డిబోయిన వెంకటేశ్వర్లు, నవీన్, పోగాకు సాయి, అజ్మీక సుక్య తదితరులు పాల్గొన్నారు.

'డిఆర్ఎస్'లో ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సు

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహణలో ఎయిడ్స్ వ్యాధి వ్యాపించకుండా నియంత్రించడం ఎలా అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మేనేజర్ ఏ.సుందర్ రావు మాట్లాడుతూ మొదటిసారిగా ఈ వ్యాధి దక్షిణ ఆఫ్రికాలో చింపాంజీల నుండి ప్రారంభం అయి విస్తరిస్తూనే ఉందని, కొంతమంది వైద్యులు వాడే ఇంజెక్షన్స్ వాడడం వలన ట్రక్ డ్రైవర్స్ వలన ఇది ప్రారంభంలో బాగా వ్యాప్తి చెందిందని చెప్పారు. ఇటీవలి కాలంలో త్రిపుర రాష్ట్రంలో ఒక సాంకేతిక కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఇంజక్షన్ ద్వారా డ్రగ్స్ ప్రయోగించడం వల్ల సోకిందని తెలిపారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి మాత్రమేనని తగిన జాగ్రత్తలు తీసుకుంటే దీన్ని నివారించడం చాలా సులభం అని, తగిన జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులను కోరారు. విద్యార్థులకు వచ్చిన సందేహాలను



నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అవగాహన రాహిత్యం వలన రోజు రోజుకు పెరిగి పోతుందని, దీన్ని నివారించడమే మార్గమని, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే దీన్ని నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వి.మోహన్ రెడ్డి, కళాశాల చైర్ పర్సన్ శోభ మోహన్ రెడ్డి, కౌన్సిలర్ రుబీనా, సుధాకర్, దిల్షాద్, కళాశాల ఏఓ బి.వెంకట కృష్ణ, ఎన్ఎస్ఎస్ పిఓ ఎం.యాదగిరి విద్యార్థులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఐకేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్పెషల్ ఆఫీసర్ నవీన్‌బాబు, ఎంపీడీవో సురేందర్, తహసీల్దార్ సంపత్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ కారేపల్లి మండలంలో ఐకేపీ, సోసైటీల ఆధ్వర్యంలో ఐదు సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వ్యవసాయశాఖ అధికారులు ధృవీకరణతోనే తీసుకరావాలని కోరారు. సన్న రకం ధాన్యంకు ప్రభుత్వం మద్దతు ధర రూ.2320తో పాటు అదనంగా బోనస్ రూ.500 ప్రభుత్వం ఇస్తుందన్నారు. రైతులు ధాన్యంను నాణ్యతతో కేంద్రానికి తీసుకవచ్చి బోనస్‌ను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, వజ్జా రామరావు, తలారి దేవప్రకాష్, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, ఇమ్మడి తిరుపతిరావు, మండల సమాఖ్య అధ్యక్షకార్యదర్శులు సుజాత, నాయిని నాగమణి, సీసీలు చైతన్య తుమ్మలపల్లి అనిల్, పగడాల పుష్పకుమారి, గౌసియాబేదం, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నవతెలంగాణ
ఖమ్మం
గురువారం | అక్టోబర్ 31, 2024 | www.navatelangana.com



పర్యావరణానికి హాని కలుగకుండా దీపావళి జరుపుకోవాలి

- ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి
- బాలభారతిలో వేడుకలు



నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ బాల భారతి విద్యాలయంలో పర్యావరణానికి హాని కలగకుండా దీపావళి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి పాల్గొని పర్యావరణానికి హాని కలగకుండా దీపావళి వేడుకలను ఎలా జరుపుకోవాలో తెలియపరిచే పిల్లల ప్రదర్శనలు ప్రారంభించారు. విద్యార్థులచే తయారు చేయబడిన వివిధ క్రాఫ్ట్, వర్క్, తోరణాలు, దీపాలను, చూసి అభినందించి విద్యార్థులకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. జవహర్ బాల్ మంచ్ సంఘం తరపున 10వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం. దామోదర్ ప్రసాద్, కెఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ తాళ్లూరు రామారావు, ఏవో యాచమనేని శశాంక్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



'మిస్ట్'లో ముగిసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెమినార్

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లిలోని మదర్ థెరెసా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న సీఎస్సీ విద్యార్థులకు నైపుణ్యత పెంపుదల కోసం మూడు రోజుల పాటు నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెమినార్ బుధవారంతో ముగిసింది. బ్రైనో విజన్ సొల్యూషన్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాలపై మెంటర్ సాయిపవన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు విద్యార్థులకు నైపుణ్యతను పెంచే ప్రాజెక్టుల రూపకల్పన, పైథాన్ ప్రోగ్రాంపై విశ్లేషణ, కోడింగ్ నేర్చుకోవడంలో మెలకువలు నేర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగిన ఈ సెమినార్‌లో విద్యార్థులు పైన తెలిపిన అంశాలపై అవగాహన పెంచుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు వివిధ రకాల ఆట్యిట్యూడ్స్ నేర్చుకోవడం వల్ల మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను సులభంగా అందిపుచ్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ రామచంద్రరావు, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, సీఎస్సీ హెచ్‌వోడీ పి.మారేశ్వరరావు, వర్క్‌షాప్ కో-ఆర్డినేటర్ సి.హెచ్. రాజా జాకబ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో డివిజన్లో అయ్యప్ప భక్తులకు అన్నదానం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని 10వ డివిజన్లోని చైతన్య నగర్‌లో శ్రీ ధర్మశాస్తా అన్నదాన సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా నగరం మేయర్ పునుకొల్లు నీరజ మాల ధరించిన స్వాములకు అన్న ప్రసాదం వితరణ చేశారు. మేయర్ నీరజ తో శ్రీ హరి ప్రసాద్ నంబూద్రి కేరళ సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మేకల హనుమంతరావు మాట్లాడుతూ త్వరలోనే శ్రీ ధర్మశాస్తా దేవాలయం పనులు పూర్తికానున్నట్లు తెలిపారు. బుధవారం అన్నదాన కార్యక్రమంలో సుమారు 650 మంది స్వాములు అయ్యప్ప స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించినట్లు ట్రస్టు కార్యదర్శి అట్లూరి మధు, కోశాధికారి టి.వి.పుల్లంరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపుడి రమాసతీష్, ట్రస్టు ఉపాధ్యక్షులు పొన్నం వీర వసంత కుమార్, సభ్యులు సరిపుడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిస్ట్రిక్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన ఎంజేపీ కూసుమంచి విద్యార్థులు



నవతెలంగాణ-కూసుమంచి

మధిరలోని బోనకల్ జూనియర్ కళాశాలలో 3రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి బీసీ గురుకుల స్పోర్ట్స్ మీట్-2024 అండర్-14 విభాగంలో ఎంజేపీ కూసుమంచి విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారు. కబడ్డీ గేమ్‌లో ప్రథమ స్థానం సాధించడంతోపాటు, అథ్లెటిక్ విభాగంలో క్లీన్ స్వీప్ చేశారు. 100 మీ. పరుగు పందెంలో మొదటి స్థానం, 200 మీ. పరుగు పందెంలో మొదటి స్థానం, 600 మీ. ప్రథమ, తృతీయ స్థానం, లాంగ్ జంపులో ప్రథమ, ద్వితీయ స్థానాలు, షాట్ పుట్ లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించారు. కూసుమంచి బాయ్స్ పాఠశాల విద్యార్థులను ఆర్.సి.ఓ బ్యూలారాణి, డిసిఓ జ్యోతిర్మయి, ప్రిన్సిపల్ పి.మల్లయ్య, ఏటీపీ డిప్యూటీ వార్డెన్, పిఈటి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.


తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ హబీబ్



నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు పట్టణానికి చెందిన మైనార్టీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు అబ్దుల్ హబీబ్ సత్తుపల్లి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాసరావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హబీబ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తాను అనేక పోరాట కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం, డివిజన్లోని తెలంగాణ ఉద్యమకారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ, సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తాను చేసినటువంటి ఉద్యమ సేవలను గుర్తించి, తనపై నమ్మకంతో నియోజకవర్గ కార్యదర్శిగా ఎంపిక చేసిన చీమ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నియోజకవర్గ ప్రజలకు 'సండ్ర' దీపావళి శుభాకాంక్షలు



నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనలోని మూర?త్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞాన దీపాలను వెలిగించుకోవాలనే తాత్వికతను దీపావళి పండుగ ద్వారా మనకు బోధపడుతుందని ఈ సందర్భంగా సండ్ర అన్నారు. దీపావళి పర్వదినానికి హిందూ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. సమాజంలోని ప్రజలందరి జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలని, ప్రజలంతా సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని సండ్ర ఆకాంక్షించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించండి

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థిన



నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఖమ్మం-నల్లగొండ-వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అలుగుబెల్లి నరసింహారెడ్డిని గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు క్యాంపియన్‌లో భాగంగా మండల కేంద్రంలో గల ఎర్రుపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అప్లికేషన్ ఫారాలను అందించి నమోదు చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మరొకసారి ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటుతో గెలిపించవలసిందిగా అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల మండల ప్రధాన కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు వెంకటకృష్ణ, నంద్రు వెంకటేశ్వరరావు, గురుకుల పాఠశాల, కేజీబీవీ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించాలి

- విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బంది పట్ల కఠినంగా వ్యవహరించాలి
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజలలో విశ్వాసం కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య శాఖ సేవా దృక్పథంతో పని చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖ పని తీరుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సమావేశం నిర్వహించారు. సివిల్ ఇన్ ఫ్రా, వైద్య శాఖ సిబ్బంది హాజరు నమోదు, వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ నియామకాల ప్రక్రియ, డ్రగ్స్ (మందుల) నిల్వల సద్వినియోగం, ఆస్పత్రుల నిధుల వినియోగం మొదలగు వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులతో సిబ్బంది ప్రవర్తన, స్పందించే విధానం చాలా దారుణంగా ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మనం ప్రజలకు సేవ చేయడం కోసం ఉన్నామనే స్పృహ లేకపోతే పని చేయవద్దని అన్నారు. పేషెంట్లతో మర్యాదగా ప్రవర్తించడం, సేవా దృక్పథంతో పని చేయడం వైద్య శాఖలో చాలా అవసరమని, ఇది లేకుండా ఎంత మౌళిక వసతులు కల్పించినా ప్రజలలో విశ్వాసం కల్పించలేమని అన్నారు. జిల్లాలోని పిహెచ్‌సి, సబ్ సెంటర్, జనరల్ ఆస్పత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, ఎం.సి.హెచ్ లలో పని చేసే వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది బయో మెట్రిక్ అటెండెన్స్ విధానం పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి సిబ్బంది అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడానికి వీలు లేదని, ఆసుపత్రి సిబ్బంది సకాలంలో హాజరు కావాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, అనుమతి లేకుండా తీసుకున్న సెలవులకు జీతం కట్ చేయాలని అయినప్పటికీ పద్ధతి మార్చుకోకపోతే మెడికల్ కౌన్సిల్ కు రాయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, ఆప్తామాలజిస్ట్, డెంటిస్ట్, పిడియాట్రీషియన్, ఈ.ఎన్.టి, గైనిక్, డర్మటాలజీ విభాగాలలో వైద్యుల పనితీరు నిరంతరం పర్యవేక్షిస్తూ ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకుని రావాలని అన్నారు. ప్రతిరోజు ఆసుపత్రికి వైద్యులు ఎప్పుడు వస్తున్నారు, డ్యూటీ వదిలి ఎప్పుడు వెళ్తున్నారు, వంటి వివరాలు బయోమెట్రిక్ అటెండెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే వారం రోజులలో ప్రతి ఆసుపత్రిలోని ఫార్మసీ వద్ద అందుబాటులో ఉన్న మందుల వివరాలు ప్రదర్శించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎక్కడా మందుల కొరత ఉండటానికి వీల్లేదని అన్నారు. ఆసుపత్రులలో వైద్యుల రూమ్ వద్ద ఆ డాక్టర్ రౌండ్ లకు ఎప్పుడు వెళ్లారో టైమింగ్ రాసి పెట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఆసుపత్రి దగ్గర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, దీనికి ఆరోగ్య మిత్ర సేవలు వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మంలో నియోజకవర్గాల వారీగా ఆసుపత్రిలో మౌళిక వసతుల కల్పన క్రింద మొత్తం 23 పనులు మంజూరు కాగా 2 పూర్తి చేశామని, 15 పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎస్. రాజేశ్వర్ రావు, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి. సుబ్బారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్. కె. రాజశేఖర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





విధి నిర్వహణలోనే....

గుండె పోటుతో ఆటో డ్రైవర్ మృతి

నవతెలంగాణ-బోనకల్

విధి నిర్వహణలోనే ఓ ఆటో డ్రైవర్ గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. ప్రత్యక్ష సాక్షులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని చిరునోముల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వేమా గురుమూర్తి(35) బుధవారం ఉదయం చిరునోముల నుంచి ఆటో కిరాయి మాట్లాడుకొని ఖమ్మం వెళ్ళాడు. వేమా గురుమూర్తితో పాటు కిరాయిదారుడు పిళ్ళెం గోపయ్య కూడా అతని వెంట వెళ్లాడు. మాట్లాడుకున్న ప్రకారం ఖమ్మంలోనే ఓ ఇంటి వద్దకు వెళ్లారు. ఆ ఇంటి వద్ద గోపయ్య ఆటోలో నుంచి వస్తువులు ఇంట్లోకి తీసుకెళ్లాడు. ఆ సమయంలో వేమా గురుమూర్తి ఇంటి ముందు నిలబడి ఉన్నాడు. ఒక్కసారిగా గురుమూర్తి కుప్పకూలిపోయాడు. వెంటనే ఇంటి యజమాని, గోపయ్య కలిసి సమీపంలో గల ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య కవిత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మొదటి కుమార్తె నాగ పూజిత 9వ తరగతి, రెండవ కుమార్తె వర్ధిని ఆరవ తరగతి టేకులపల్లి గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. కుమారుడు దినేష్ చిరునోముల ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ముగ్గురు పిల్లలు కూడా 13 సంవత్సరాల వయసు లోపు ఉన్నవారే. ఆటో ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్న వేమా గురుమూర్తి మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ప్రతిరోజు లాగే బుధవారం కూడా కిరాయికి వెళ్లిన గురుమూర్తి మృతదేహంతో ఇంటికి రావడంతో భార్యాపిల్లలు రోదిస్తున్న తీరు ప్రతి ఒక్కరిని కన్నీరు పెట్టించింది. సహచర ఆటో డ్రైవర్ల అందరూ నివాళు లర్పించారు.

తల్లాడలో డివైడర్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

- రోడ్డు ప్రమాదాలు నివారించాలి : డీవైఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-తల్లాడ

"మండల కేంద్రంలో డివైడర్లు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల బస్టాండ్ ప్రాంతంలో డివైడర్ ఎత్తు తక్కువగా ఉన్నందువల్ల లారీ- అంబులెన్స్ ఢీకొని ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇదేవిధంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి డివైడర్లు ఎత్తు పెంచి, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలని" డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సత్తెనపల్లి నరేష్ ఆర్ అండ్ బి ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.

మధు కళాశాల విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక





నవతెలంగాణ-వైరాటౌన్

స్థానిక మధు జూనియర్ కళాశాల విద్యార్థిని వాసిరెడ్డి వేదశ్రీ బ్యాడ్మింటన్ అండర్ -19 బాలికల విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అక్టోబర్ 29న సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మధు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వాసిరెడ్డి వేదశ్రీ బ్యాడ్మింటన్ అండర్-19 బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రతిభతో మొదటి స్థానం సాధించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నవంబర్ లో మధ్యప్రదేశ్ లో జరిగే జాతీయస్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరపున ఆడటానికి వేదశ్రీ అర్హత సాధించారు. బ్యాడ్మింటన్ అండర్-19 బాలికల విభాగంలో వేదశ్రీ జాతీయస్థాయిలో 40 ర్యాంకు, అంతర్జాతీయ టోర్నమెంట్లో 465 ర్యాంకును కలిగి ఉన్నారు. బుధవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో మధు విద్యాసంస్థల సెక్రటరీ మల్లెంపాటి వీరభద్రరావు, ఉపాధ్యక్షులు మల్లంపాటి ప్రసాదరావు, కరస్పాండెంట్ మల్లంపాటి రంజిత్, ట్రెజరర్ మల్లంపాటి నర్మదా వేదశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ పోటీలలో కూడా రాణించాలని, మంచి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాంబాబు, డివిఆర్ చారి పిడి సత్యనారాయణచారి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి

- ఐద్వా డిమాండ్



నవతెలంగాణ-ముదిగొండ

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల అధ్యక్షకార్యదర్శి మందరపు పద్మ, కోలేటి అరుణ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐద్వా ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎంపీడీఓ కె.సునీత ఎలిజిబెత్, ఎస్.శ్రీధర్ స్వామిలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న ప్రజలకు ఇచ్చిన హామీలల్లో మహిళలకు రూ 2,500, మహాలక్ష్మి పథకం వితంతు, వృద్ధాప్య, ఒంటరి మహిళల పెన్షన్ లతోపాటు, నూతనంగా రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి ఇంత వరకు పథకాలను అమలు చేయలేదన్నారు. 6 గ్యారంటీలు అమల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని వారు విమర్శించారు. ఇల్లు లేని వారికి ఇల్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం మాటలతో మభ్యపెడుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోతే ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై అత్యాచారాలు, హత్యలు, లైంగిక దాడులు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్ల కందుల సుజాత, రేణుకాదేవి, సైదమ్మ, వసంత, సుహాసిని, నాగమణి, అరుణ, భారతమ్మ, వినుకొండ రాణి, వినుకొండ సులోచన, గంగుల పుల్లమ్మ, సంధ్య, స్రవంతి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



ఐకేపీ ఆధ్వర్యంలో బత్తులపల్లి, లక్ష్మీపురంలో ధాన్యం కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-కల్లూరు

ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బత్తులపల్లి, లక్ష్మీపురంలో ఏఎంసీ చైర్మెన్ భాగం నీరజాదేవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు సన్న రకం ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారి వద్ద అమ్ముకొని మోసపోకుండా ధాన్యాన్ని ఆరబెట్టుకుని నిబంధనల మేరకు కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి దాసరి చంద్రశేఖర్, తహసీల్దార్ సాంబశివుడు, మండల పంచాయతీ అధికారి సురేష్ బాబు, ఏపీఎం వెంకట రామారావు, సీసీ వెంకట రావమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి, ఆలకుంట నరసింహారావు, కొర్ర నరసింహ, ఏసి రెడ్డి, పొదిలి వెంకటేశ్వర్లు, ప్రసాద్, గ్రామ సమాఖ్య కొనుగోలు కమిటీ సభ్యులు స్థానిక రైతులు పాల్గొన్నారు.





విద్యార్థులు సాంకేతిక అభివృద్ధిని మెరుగు పరుచుకోవాలి

- మధు విద్యాలయం కరస్పాండెంట్ మల్లెంపాటి రంజిత్

నవతెలంగాణ-వైరాటౌన్

విద్యార్థిని, విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ స్థాయిలలో సాంకేతిక అభివృద్ధిని మెరుగు పరుచుకోవాలని మధు విద్యాలయం కరస్పాండెంట్ మల్లెంపాటి రంజిత్ అన్నారు. బుధవారం మధు విద్యాలయంలో నిర్వహించిన స్టూడెంట్ లీడ్ ప్రోగ్రామ్‌ను విద్యాసంస్థల చైర్మెన్ మల్లెంపాటి వీరభద్రరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లెంపాటి రంజిత్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు తయారుచేసిన గణిత, సైన్స్ నమూనాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. స్టూడెంట్ లీడ్ ప్రోగ్రామ్ విద్యార్థుల సృజనాత్మక శక్తిని పెంచుతుందని, గణిత, సైన్స్ ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు, నైపుణ్యానికి చక్కని తార్కాణాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఉపాధ్యక్షులు మల్లెంపాటి ప్రసాదరావు, కోశాధికారి మల్లెంపాటి నర్మద, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.రాంబాబు, సీబీఎస్ఈ ప్రిన్సిపల్ డివిఆర్ చారి, రాజేంద్రప్రసాద్, సౌజన్య, అనంతబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి హెచ్చరిక

నవతెలంగాణ ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల అనుసారం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ 38 డివిజన్లో శానిటేషన్ పనులను పరిశీలించారు. రోడ్లు శుభ్రపరచకుండా ఉండటం అస్తవ్యస్తంగా చెత్త పారేయటం గమనించిన అసిస్టెంట్ కమిషనర్ చెత్తను పరిసరాలను శుభ్రపరచకుండా ఇంకోసారి కనిపిస్తే శాఖపరమైన చర్యలు చేపడతామని సిబ్బందిని హెచ్చరించారు.

ఎన్ఎస్పీ కాలువలోకి దూసుకెళ్లిన లారీ



నవతెలంగాణ-పెనుబల్లి

ఐరన్ లోడుతో గుజరాత్ వెళుతున్న లారీ వీఎం బంజర్ సమీపంలోని సాగర్ కాలవలో బుధవారం అదుపుతప్పి పడిపోయింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. ఐరన్ లోడుతో వెళుతున్న ఈ టేలర్ లారీ అదుపుతప్పి సాగర్ కాలవలో పడే సమయంలో వంతెనకు రక్షణగా ఏర్పాటు చేసిన గోడను లారీఢీ కొట్టి కాలవలోకి చొచ్చుకపోయింది.

నవతెలంగాణ

7

భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | అక్టోబర్ 31, 2024 | www.navatelangana.com

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి

- బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు

నవతెలంగాణ-జూలూరుపాడు



దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలకు పండగ శుభాకాంక్షలు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఇంటి లోగిలి కార్తీక దీపకాంతులతో, అన్నదాత కళ్లల్లో ఆనందపు కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అజ్ఞానాంధకారాలు తొలగించి విజ్ఞానపు వెలుగును దీపావళి ప్రసాదించాలి" అని, దైవిక కాంతి మన అందరికీ శాంతి, శ్రేయస్సు, ఆనందాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

బీటీపీఎస్‌కు 'శాంక్షన్ పోస్ట్'లను మంజూరు చేయాలి

- జెన్కో డైరెక్టర్‌కు టీఎస్‌పీఈయూ-1535 నాయకుల వినతి

నవతెలంగాణ-మణుగూరు



బీటీపీఎస్ కర్మాగారంలో శాంక్షన్ పోస్టులను మంజూరు చేసి కార్మికులకు ప్రమోషన్లు కల్పించాలని జెన్కో డైరెక్టర్ అజయ్‌ను టిఎస్‌పి ఈయు-1535 నాయకులు కోరారు. హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధాలో నాయకులు మంగళవారం డైరెక్టర్ అజయ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిటిపిఎస్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. కర్మాగారంలో శాంక్షన్ పోస్టులు లేకపోవడం వల్ల చాలా సంవత్సరాలుగా కార్మికులకు పదోన్నతులు లభించడం లేదని వాపోయారు. ఈ పరిణామం వల్ల ఉద్యోగులపై పనిభారం అధికంగా పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్మాగారంలోని భూనిర్వాసిత ఉద్యోగులు కూడా పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలకు పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి డి.రాధాకృష్ణ, బిటిపిఎస్ రీజినల్ అధ్యక్షులు వి.ప్రసాద్ నాయకులు ఆర్. రవిచంద్ర, ఎస్.సాంబ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీవో వెంకట పుల్లయ్యకు సన్మానం

నవతెలంగాణ-బూర్గంపాడు



భద్రాచలం ఆర్టీవోగా బాధ్యతలు చేపట్టిన సంగం వెంకట పుల్లయ్యను బుధవారం మోరంపల్లి బంజర్ గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో భద్రాచలం ఆర్టీవోగా పని చేసిన కాలంలో మోరంపల్లి బంజర పాఠశాలలో రోడ్డు భద్రతపై 400 మందికి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించి ప్రజల హృదయాలలో చిరస్థాయిలో గుర్తుం డేలా ఉండిపోయారని వారు పేర్కొన్నారు. మరల భద్రాచలం ఆర్టీవో రావడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమా లతో పాటు వాహనాలు ఉండి డ్రై వింగ్ లైసెన్స్ లేని వారికి లైసెన్సులు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బత్తుల రామ కొండారెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కోండ్రు వెంకటేశ్వర్లు, గాదె నర్సిరెడ్డి, పండగ రాములు, బిజ్జం వెంకట్రామిరెడ్డి, మూల లక్ష్మిరెడ్డి, తమ్మినేని శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని పిఎసిఎస్ బేతంపూడి సంఘంలో రుణాలు తీసుకున్న సభ్యులకు ఒకే కుటుంబం నుండి నలుగురికి సంఘంలో రుణమాఫీ అయ్యింది. బుధవారం తిరిగి రుణాలను పిఎసిఎస్ బేతంపూడి సంఘం అధ్యక్షులు లక్కినేని సురేందర్‌రావు, డిసిసిబి డైరెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పి.ప్రేమాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1 నుండి కుటుంబ సర్వే

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ సర్వేలకు సంబంధించి చుంచుపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సూపర్వైజర్, ఎనుమరేటర్స్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మొదటగా ఎనిమరేటర్లు వారికి కేటాయించిన ఎనిమిరేషన్ బ్లాక్ (ఇబి)లో నవంబర్ 1 నుండి 3 తేది వరకు ఇంటింటికి తిరిగి కుటుంబ యజమాని వివరాలను సేకరిస్తూ ప్రతి కుటుంబానికి ఒక స్టిక్కరింగ్ వేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం రెండవ సారి కుటుంబ సభ్యుల వివరాలు వివరాల ఇచ్చిన ఫ్రొఫార్మాలో సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ హెచ్.వెంకటేశ్వరరావు, చుంచుపల్లి తాసిల్దార్ పి.కృష్ణ, ఎంపిడిఓ విడివి.అశోక్ కుమార్, డిటి.వినయ్, శిలా, శ్రీరామ్, ఎంపిఓ కె.సత్యనారాయణ, ట్రైనర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషన్స్ ట్రాన్స్‌ఫర్ ప్రక్రియలో కౌన్సిలింగ్ నిర్వహించాలి : సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం ఏరియాలోని, సత్తుపల్లి జేవిఆర్ ఓసి సర్ఫేస్ డిపార్ట్‌మెంట్‌లో పీవీకే అండర్ గ్రౌండ్ మైన్ నుండి ఎలక్ట్రీషన్స్‌ను భర్తీ చేసే ప్రక్రియలో కౌన్సిలింగ్ నిర్వహించాలని సిఐటియూ నాయకులు కోరారు. బుధవారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజుకి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) బ్రాంచ్ కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు విజయగిరి శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. డిప్యూటేషన్ పేరుతో జూనియర్ ఎలక్ట్రీషన్స్‌కు అవకాశం కల్పించడంతో సీనియర్ ఎలక్ట్రీషన్స్ ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ ప్రక్రియలో పారదర్శకత లోపించిందన్నారు. ఖాళీలను భర్తీ చేసే విధానంలో పర్మినెంట్‌గా కానీ, లేక డిప్యూటేషన్ కానీ ఖాళీలను ప్రకటించి ఆసక్తి గలవారికి నుండి దరఖాస్తులను కోరాలని, సీనియార్టీ లిస్టును వెల్లడించి కౌన్సిలింగ్ నిర్వహిస్తే పారదర్శకంగా ఉంటుందని సూచించారు. ఈ విషయంలో ఏరియా జీఎం సానుకూలంగా స్పందించారని సీఐటియూ నాయకులు తెలిపారు.

దీపావళి శుభాకాంక్షలు : ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం



రాష్ట్ర ప్రజలకు, కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ప్రజలందరూ శుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దీపావళి పండుగను పేద, ధనిక, పేద, వయస్సు తారతమ్యం లేకుండా జరుపుకునే విజయోత్సవ పండుగ దీపావళి అని, పేదలకు సాయం చేసి వారిని పండుగ సంతోషంలో భాగస్వామ్యం చేయాలని కోరారు. ప్రతి కుటుంబంలో నూతన వెలుగులు నిండాలని, ప్రతి ఒక్కరు ఆయురారోగ్యంతో జీవితం గడపాలని కూనంనేని ఆకాంక్షించారు.

పొలాలకు నీళ్లు అందించండి

నవతెలంగాణ-టేకులపల్లి

కోయగూడెం ఓపెన్ కాస్ట్ ద్వారా చెరువులో నీళ్లు నింపి రైతుల పొలాలకు నీళ్లు అందించాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో సింగరేణి అధికారులను డిమాండ్ చేశారు. కోయగూడెం ఓపెన్ కాస్ట్ ద్వారా పరిసర గ్రామాలలో ఉన్న చెరువులోని నీళ్లు త్వరగా అడుగున చేరుతున్నాయని, దానివల్ల రైతులు ఆయా చెరువుల కింద, వేసుకున్న వరి పొలంలోని పంట పండకుండా, చివరి దశకు వచ్చి నీళ్లు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ బాంబు పేలుళ్ల వల్ల వేసిన వరి పొలం ఎండిపోతుండడం వలన, ఆయా గ్రామాలలో ఉన్న గిరిజన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి చెరువులను నింపి రైతుల వరి పంటకు నీళ్లు అందించాలని పేర్కొన్నారు. పరిసర గ్రామాలలోని చెరువుల ద్వారా నీరు అందక ఎండిపోయిన వరి పంటలకు టేకులపల్లి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

నవతెలంగాణ-కొత్తగూడెం



ప్రియదర్శిని కళాశాలలో 'జెన్ ప్యాక్ట్' సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. 2021-22, 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో బీకాం, బీఎస్సీ, బీసీఏతో పాటు బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు సుమారు 448 మంది రిజిస్టర్ అయ్యారు. ఈ మేరకు జెన్పాక్ట్ కంపెనీ అధికారులు మూడు రౌండ్స్‌లలో పరీక్షలు నిర్వహించి ఇంటర్వ్యూలో 32 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారికి అనంతరం నియామక పత్రాలు అందజేసినట్లు ప్రియదర్శిని కళాశాలల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. సంస్థ ప్రతినిధులు, ఎంపికైన వారికి డైరెక్టర్ చలపతిరావు, ప్రిన్సిపల్ నయీంపాషా శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ రాయల వివేక్, ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకట ఫణి, పీడీ కాశిమల్ల రమేష్, ధీకొండ దుష్యంత్ కుమార్ అధ్యాపకులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల అవినీతిపై విచారణ చేపట్టాలి

- ప్రైవేటు ఏజెన్సీలను రద్దు చేయాలి
- కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి పోస్టులు భర్తీ చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మెడికల్ కళాశాలలో నెల కొన్న అవినీతి జలగలపై విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు ఏజెన్సీలను రద్దు చేసి, జిల్లా కలక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి ఔట్ సోర్సింగ్ పోస్టులు భర్తీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఉన్న మెడికల్ కళాశాల అనుభందంగా కేంద్ర జిజిహెచ్ఎస్, ఎంసీహెచ్‌లలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల భర్తీలలో దరఖాస్తు చేసుకున్న ఒక్కొక్కరి వద్ద నుండి రూ.2 లక్షల నుండి, రూ.3 లక్షల వరకు నిరోద్యుగుల నుండి ముక్కు పిండి



వసూలు చేయడం దుర్మార్గమన్నారు. గత సంవత్సరం కూడా మెడికల్ కళాశాలలో జరిగిన అవినీతి ఆరోపణలు ఎదుర్కొనీ సస్పెండ్ చేసిన విషయం మరవక ముందే మళ్ళీ మంగళవారం వైద్య కళాశాల సంబంధిచిన అధికారి, ఉద్యోగి అవినీతి ప్రత్యక్షంగా పట్టుబడటం కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇంత అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్య వ్యవస్థపై ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఔట్ సోర్సింగ్ పోస్టులు భర్తీ చేస్తున్నారని, అటువంటి వ్యక్తులవల్ల అక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఏజెన్సీలను పూర్తిగా రద్దు చేసి, కలక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి ఆ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ అవినీతి కార్యక్రమాలకు కలక్టర్ కూడా బాధ్యత వహించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్కెట్ ధరలకు అనుగుణంగా మెనూ రేట్లు పెంచాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అర్జున్

నవతెలంగాణ-అశ్వారావుపేట

మధ్యాహ్న భోజన కార్మికుల బకాయి వేతనాలు, వంట నిర్వహణ, గుడ్ల వ్యయం వెంటనే విడుదల చేయాలని, పెరుగుతున్న మార్కెట్ ధరలకు తగ్గట్లు పాఠశాల విద్యార్థుల మెనూ చార్జీలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంఈవో కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఇస్తున్న మెనూ మార్కెట్లో ధరలకు ఏమాత్రం పొంతన లేకుండా ఉందని, అరకొర మెనూ చార్జీలతో వంట



నిర్వహించాలంటే మధ్యాహ్న భోజన కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వంట కార్మికులు కిరాణా దుకాణాల వద్ద అప్పులు తెచ్చి వండి పెడుతున్నప్పటికీ బిల్లులు నాలుగు ఐదు నెలలు దాటిన రావడంలేదని అన్నారు. మార్కెట్లో ధరలు రోజురోజుకీ ఆకాశాన్ని తాకుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. మధ్యాహ్నం భోజనం కార్మికులు చేసిన పనికి వేతనాలు సరిగా రాక బిల్లులు రాని పరిస్థితుల్లో పెరిగిన ధరలతో ఏం చేయాలో తోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. వంట కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం మేరకు రూ.10 వెంటనే పెంచాలని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, గుడ్లు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని గుర్తింపు కార్డులు కాటన్ యూనిఫామ్ రెండు చేతులు ఇవ్వాలని పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగ దుర్గ, సీత, పద్మ, రమాదేవి, వెంకమ్మ, మహాలక్ష్మి, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేంత వరకూ పోరాడతాం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అభిమన్యు

నవతెలంగాణ-ఇల్లందు

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న రూ.8 వేల కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేసేంత వరకూ పోరాడతామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అభిమన్యు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఇల్లందు మండలం కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, డిప్యూటీ తహసిల్దార్ నవాబ్‌కు విద్యారంగ సమస్యల మీద వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంటర్మీడియట్, పారామెడికల్ కళాశాల యాజమాన్యాలు స్వయంగా కళాశాల బంద్ పెట్టి ఆందోళన చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోతుందా అని ప్రశ్నించారు. పేద మధ్యతరగత విద్యార్థులకు అందించే స్కాలర్షిప్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల కపట ప్రేమ చూపిస్తుందని అన్నారు. ప్రైవేట్ కళాశాలలో చదువులు పూర్తిచేసుకుని పై చదువులకు పోవాలంటే స్కాలర్షిప్ రాలేదు.. ఫీజ రియంబర్స్‌మెంట్ రాలేదు.. ఫీజు కట్టి సర్టిఫికెట్లు తీసుకోవాలని ప్రయివేటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లు విద్యార్థులను ఇబ్బందులు పెట్టడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో మార్పు రావాలి అంటే కాంగ్రెస్ రావాలి అని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద మధ్యతరగతి కుటుంబాల బతుకులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పక్షాన



ఆలోచించి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు బానోత్ కిషన్, సాగర్, నవీన్, సుధీర్, రఘు, రవి, చరణ్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా నాయకులు సాంబశివరావు

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ఎస్సీ బాలుర హాస్టల్‌లో పని చేస్తున్న హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, వారిపట్ల మొండిగా వ్యవహరిస్తున్న వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన హాస్టల్‌ను పరిశీలించి మాట్లాడారు. నెలలు గడుస్తున్న జీతాలు రాక



పోయిన సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు భోజనాలు వండి హాస్టల్ పరిశుభ్రతను మొత్తాన్ని దగ్గరుండి చూసుకుంటున్న హాస్టల్ వర్కర్‌లపట్ల వార్డెన్ దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. చాలీచాలని సామాలిస్తూ వారిపై కక్ష సాధింపు చర్యలు తీసుకుంటున్నాడని, నాలుగు నెలల నుంచి జీతాలు లేక వాళ్ల నానా అవస్థలు పడుతున్న కూడా పిల్లల విషయంలో కానీ హాస్టల్ పరిసరాల విషయంలో కానీ శక్తివంతంగా పనిచేస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించి హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకొని వారికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సరోజినీ, జ్యోతి, సువర్ణ, రాజు, సమ్మక్క, నరసింహారావు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఎమ్మెల్సీగా నర్సిరెడ్డి గెలుపు ఖాయం

- యూటీఎఫ్ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలలో మరోసారి నర్సిరెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని యుటిఎఫ్ సీనియర్ నాయకులు పి.లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని వెన్నెల హాస్పిటల్లో యుటిఎఫ్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయాన్ని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ఉపాధ్యాయులందరూ ఓటు నమోదు చేసుకోని మొదటి ప్రాధాన్యత ఓటు నర్సిరెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై నర్సిరెడ్డి ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించారని గుర్తు చేశారు. అనుభవం కలిగిన నర్సిరెడ్డి గెలుపుతో ఉపాధ్యాయ సమస్యలు చట్టసభలో చర్చకు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.విజయ్ కుమార్, ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్ టీవీఎస్ ప్రసాద్, సీనియర్ నాయకులు ఏ.వెంకటేశ్వర్లు, రాజ శ్రీనివాస్, దుమ్ముగూడెం ప్రధాన కార్యదర్శి సంగం శ్రీనివాస్,



బూర్గంపాడు ప్రధాన కార్యదర్శి టి.రమేష్, భద్రాచలం అధ్యక్షులు ఎం. రమేష్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ కార్డులు వెంటనే ఇవ్వాలి'

నవతెలంగాణ-కొత్తగూడెం

కాంట్రాక్టు కార్మికులకి ఈఎస్ఐ కార్డులు, ప్రతీ నెలా 7వ తేదీలోపు జీతాలు చెల్లించాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక కాంట్రాక్టు కార్మికుల పని ప్రాంతాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీకెఎస్ సహాయ కార్యదర్శి భూక్యా రమేష్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఇఎస్ఐ కార్డులు ఇస్తామని చెప్పి కాంట్రాక్టు కార్మికులను మోసం చేస్తూ కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఢిల్లీలో



జరిగిన జేబీసీసీఐ సమావేశంలో నిర్ణయం చేసి సింగరేణి యాజమాన్యానికి చెప్పినప్పటికీ నేటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ముందుగా కాంట్రాక్టర్లకు ఇఎస్ఐ కార్డులు ఇవ్వాలంటే 6నెలల కంట్రిబూషన్ ఇవ్వాలని నిర్ణయం చేసినప్పటికీ సింగరేణి యాజమాన్యం ఎందుకు ఇవ్వడం లేదని అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ సమస్యల పరిష్కారం కోసం అధికారులకి వినతి పత్రాన్ని అందజేయాలని, కాంట్రాక్టు కార్మికుల వద్ద నుండి సంతకాల సేకరణ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఎస్సీకెఎస్) నాయకులు భాస్కర్, గుగులోత్ సక్రాం, కిషన్, ప్రభాకర్, లెనిన్, రమేష్, సంజీవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఎక్సలెంట్'లో దీపావళి వేడుకలు

నవతెలంగాణ-మణుగూరు

ఎక్సలెంట్ పైలెట్ కాలనీ బ్రాంచ్ హై స్కూల్లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యాజమాన్యం సౌజన్యంతో ఏర్పాటు చేసిన బాణాసంచాను విద్యార్థులు కాల్చుతూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా ఎక్సలెంట్



విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎమ్‌డీ.ఖాదర్ మాట్లాడుతూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని విద్యార్థులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు బోధన సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పర్ డ్రైవర్ల వేతనాలు పెంపు

నవతెలంగాణ-టేకులపల్లి



కోయగూడెం ఓపెన్ కాస్ట్ నుండి బిపిఎల్, నవభారత్, తడికలపూడి, వివిధ ప్రాంతాలకు టిప్పర్ల ద్వారా బొగ్గు సరఫరా చేస్తున్న డ్రైవర్లకు వేతనాలు పెరిగాయని తెలంగాణ ప్రగతిశీల మోటార్, ఆటో వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోడేటి నాగేశ్వరరావు, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.రామ్మోహన్‌రావు తెలిపారు. బుధవారం కోయగూడెం టిప్పర్ డ్రైవర్లతో టేకులపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు సమిష్టిగా సంఘటితంగా ఉద్యమించడం మూలాన వేతనాలు పెంచుకోగలిగామన్నారు. గత జీతం మాస్టర్‌కు 550 రూపాయలు ఉండగా నేడు 610 రూపాయలకు పెంచుకున్నా మని, బేటా 150 రూపాయలు ఉండగా 180 రూపాయలుగా, ట్రిప్పు మామూలు 130 నుండి 150, 230 నుండి 270 పెంచుకున్నా మన్నారు. షెడ్డు మాములు గతంలో 500 రూపాయలు ఉండగా, దానిని 600 రూపాయలకు పెంచుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, డ్రైవర్లు, నాయకులు భద్రం, సమ్మయ్య, ముతేష్, నాగేందర్, రవి, మధు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లించాలి

- ఎస్‌సీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బీ.మధు

నవతెలంగాణ-టేకులపల్లి

కోయగూడెం ఓసి 2 లో పని చేస్తున్న 42 మంది కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్లో ఉన్న బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, భూ నిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ నబి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన బోనస్ డబ్బులు నేటికీ కార్మికులకు చేరకపోవడం శోచనీయమన్నారు. వెంటనే ఇల్లందు జీఎం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బానోత్ వస్రం, పూనెం రాంబాబు, బానోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ శ్రీదేవికి డాక్టరేట్

నవతెలంగాణ-పాల్వంచ



ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచలో జువాలజీలెక్చరర్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీదేవి జెఎస్ యూనివర్సిటీ ఉత్తరప్రదేశ్ నుండి డాక్టరేట్ పొందారు. తాను రీసెర్చ్ చేసిన అంశం "హ్యూమన్ హెల్త్ అండ్ బయోడైవర్సిటీ ప్రోసెస్ అండ్ ప్రూఫ్ ఆఫ్ ద బెనిఫిట్స్ ఆఫ్ వెరైటీ ఇన్ నేచర్ ఇన్క్యూడింగ్ గ్రీన్ ఏరియాస్ ఫర్ హ్యూమన్ హెల్త్" పైన తన సూపర్వైజర్ డాక్టర్ తరుణ్ యాదవ్ అసోసియేట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో పీహెచ్డీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి. పద్మ శ్రీదేవిని ఘనంగా బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పద్మ మాట్లాడుతూ శ్రీదేవి ఓ పక్క లెక్చరర్ బాధ్యత నిర్వహిస్తూనే గృహిణిగా కుటుంబ బాధ్యతను సైతం నిర్వహిస్తూ డాక్టరేట్ సాధించటం అభినందనీయమని అన్నారు. చదువుపై ఆసక్తి మక్కువ ఉంటే సాధించలేనిది ఏమీ లేదన్న విషయాన్ని శ్రీదేవి మరోసారి నిరూపించారని కొనియాడారు. భవిష్యత్తులో విద్యారంగంలో శ్రీదేవి మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జె మాధవి సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్స్ డాక్టర్ ఏ. వెంకటేశ్వర్లు, డాక్టర్ టి.అరుణకుమారి, డి.రమేష్, డాక్టర్ వేముల కామేశ్వరరావు, డాక్టర్ స్వరూప రాణి, పారెల్లి శ్రీనివాస్, కోటగిరి రాంబాబు, పొట్ల పువ్వు శ్రీనివాస్, విమల దీపిక, బాబ్జి ఖాన్ రమేష్, కరీమ తదితరులు పాల్గొన్నారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించండి

- ఫైర్ ఆఫీసర్ నవీన్

నవతెలంగాణ-ఇల్లందు



టపాసులు కాల్చేటప్పుడు నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు పాటించి దీపావళి సంతోషంగా జరుపుకోవాలని ఫైర్ ఆఫీసర్ నవీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలని కళ్ళజోళ్ళు పెట్టుకుంటే కళ్ళు దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. కొన్ని సందర్భాల్లో టపాసులు వేలకుండా ఉంటాయని, అటువంటి అప్పుడు వాటి దగ్గరికి వెళ్తే అకస్మాత్తుగా పేలే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గుడిసెలు, పాకలు లేనిచోట ఆరు బయట బాణాసంచా కాల్చాలని తెలిపారు. అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు టోల్ ఫ్రీ 101 కి సమాచారం ఇవ్వాలన్నారు.

జీఎన్.సాయిబాబాకు నివాళి

నవతెలంగాణ-కొత్తగూడెం



ఇటీవల మృత్యువాతకు గురైన హక్కుల నేత ప్రపంచ మేధావి జిఎన్.సాయిబాబాకు బుధవారం కొత్తగూడెంలో బస్టాండ్ సెంటర్ తెలంగాణ అమరవీరుల స్థూపం దగ్గర జిఎన్. సాయిబాబా చిత్రపటానికి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కల్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఉమర్, పిడిఎస్‌యు మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ జిఎన్. సాయిబాబాను పాలకులే హత్య గావించారని అయినా ఆయన అనునిత్యం ప్రజల గుండెల్లో చిరకాలం జీవించే ఉంటాడని అన్నారు. పూర్తి అంగ వైకల్యంతో కూడా జిఎన్. సాయిబాబా ఆదివాసి, దళిత, మైనారిటి, పేద ప్రజల తరపున రాజీ లేని పోరాటం చేశారని ఆయన్ను కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు ముసలి సతీష్, వెంకటమ్మ జక్కుల రాంబాబు, గూగులోత్ రామచంద్రు, కొండపనేని సత్యనారాయణ, వైయస్.రెడ్డి, వెంకట్రావు, ఆదినారాయణ, నాగరాజు, కారం వెంకటేశ్వర్లు, మల్లయ్య, కమల, సమ్మక్క, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
8
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | అక్టోబర్31. 2024 | www.navatelangana.com

ఆనందోత్సవాలతో దీపావళి జరుపుకోవాలి

ఐటీడీఏ పీవో బీ.రాహుల్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సంస్కృతికి ప్రతిబింభంగా జరుపుకునేది పండుగలని, వాటిలో ఆనందోత్సాహాలతో జాతి, కుల, మత వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగ దివ్య దీపాల దీపావళి అని, ఈ పండుగను ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని వారికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిలుగు వెలుగుల దీపావళి రంగుల దీపావళి చిన్న పెద్ద తేడా లేకుండా ఆనందంగా జరుపుకోవాలని ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలోని ఆదివాసి గిరిజన కుటుంబాలు దీపావళి పండుగను చాలా ఘనంగా జరుపుకుంటారని ఈ పండుగకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉందని, నరకాసురుడు అనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతని పీడ వదిలిన ఆనందంతో ప్రజలు దీపావళి పండుగ చేసుకుంటారని తెలిపారు. ప్రజలకు, వివిధ శాఖల అధికారులకు తదితరులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెఇపారు.

కాంగ్రెస్‌లో ఇందిరమ్మ కమిటీల లొల్లి

- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వెలసిన ఫ్లెక్సీలు
- భద్రాచలంలో పేలుతున్న అసంతృప్తి బాంబులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి బాంబులు పేలుతున్నాయి. తాజా మాజీ కార్యకర్తల మధ్య ఇందిరమ్మ కమిటీల రగడ అంతకంతకు పెరుగుతోంది. గత పది రోజుల నుండి సోషల్ మీడియా వేదికగా నడుస్తున్న ఇందిరమ్మ కమిటీల పంచాయితీ కాస్త స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు కట్టే వరకు దారి తీయడంతో భద్రాచలం కాంగ్రెస్‌లో ఏం జరుగుతుందో అన్న ఆందోళన ఆ పార్టీ వర్గాలలో నెలకొంది.

వివరాల్లోకెళ్తే అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లతోపాటు సంక్షేమ పథకాలు అందించేందుకు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. పంచాయతీ కార్యదర్శి నేతృత్వంలో ఎస్టీ, ఎస్సీ, బీసీ, సామాజిక వర్గాల నుండి ఒక్కొక్కరు చొప్పున ఎంపిక చేయటంతో పాటు అవకాశం ఉన్నచోట మైనార్టీలకు కూడా చోటు కల్పించాలి. పంచాయతీ పరిధిలోని ఇద్దరు డ్వాక్రా సభ్యులను కలుపుకొని ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి ఇండ్ల మంజూరుతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించేందుకు ఈ కమిటీలు పనిచేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మొదటి నుండి కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని జెండాలు మోస్తున్న కార్యకర్తలకే ఇందిరమ్మ కమిటీలో ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర పార్టీల నుండి వలస వచ్చిన నాయకులకు చోటు ఇవ్వద్దని

భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా ఆయా మండల కమిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గత పది రోజుల నుండి సోషల్ మీడియా వేదిక డిమాండ్ చేస్తూ వస్తున్నారు. బారాస పార్టీ నుండి గెలుపొందిన శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో ఆయన ప్రధాన అనుచరులతో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసినదే. తెల్లం చేరికను

పొదెం వర్గం మొదటి నుండి వ్యతిరేకిస్తున్న విషయం కూడా తెలియంది కాదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పెద్దలు తాజా మాజీ నేతల మధ్య సయోధ్య కుదుర్చాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి సత్ఫలితాన్ని ఇవ్వకపోగా వారి మధ్య విభేదాలు అంతకంతకు పెరుగుతూ వస్తున్నాయి అన్నది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ కమిటీలలో స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ఇతర పార్టీల నుండి వలస వచ్చిన వారికే కమిటీలలో చోటును కల్పిస్తున్నారని పొదెం వీరయ్య వర్గం ఆందోళనకు గురవుతూ సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదనను వెళ్లగకుతున్నారు.

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో ఆదిపత్యాన్ని చూపించని పక్షంలో రానున్న రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా ప్రభావాన్ని కోల్పోతామన్న భావనలో ఇరు వర్గాల్లో ఉంది. ఎలాగైనా ఇందిరమ్మ కమిటీలలో తమ మార్క్ చూపించాలని ప్రయత్నాలను చేస్తున్నారు.

పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం ఉంటుంది

పరిమి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు



ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య, స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకటరావు సంయుక్తంగా కమిటీల ప్రతిపాదనలు చేస్తారు. కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుంది. పార్టీ కార్యకర్తలు ఎవరూ ఆందోళనకు గురికావద్దు. సంక్షేమ పథకాలు నిజమైన లబ్దిదారులకు చేరేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలి. దీపావళి నుండి అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది.

రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలి

గడ్డం స్వామి సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి



లబ్దిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు రాజకీయాలకు అతీతంగా జరగాలి. అప్పుడే నిజమైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందుతాయి. ఇందిరమ్మ కమిటీలకు ప్రభుత్వ అధికారులు జవాబుతారీతనంగా ఉండాలి. అధికారులపై రాజకీయ ఒత్తిడిలు చేయడం వల్ల నిజమైన లబ్దిదారులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఇండ్ల ప్రక్రియ ఆలస్యమైన నేపథ్యంలో కమిటీలతో కాలయాపన చేయకుండా అర్హులైన పేదలందరికీ ఇండ్లు వెంటనే మంజూరు చేయాలి. రాజకీయ కమిటీలుగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటాలు ప్రారంభిస్తాం.



నిబద్ధత గల నేత కొడెం అనంత రాములు

- ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు

నవతెలంగాణ-ఇల్లందు

ఇల్లందు, భద్రాచలం, ఖమ్మం పార్టీ కమిటీలలో అకౌంటెంట్‌గా కామేపల్లి మండల ఆర్గనైజర్‌గా మూడు దశాబ్దాల కాలం సీపీఐ(ఎం)లో పేద, బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కొరకు ఎనలేని కృషి చేసిన మహనీయుడు కొడెం అనంత రాములని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అబ్దుల్ నబి అన్నారు. స్థానిక సుందరయ్య నగర్‌లో అనంత రాములు 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం విజయ్ మోహన్ సింగ్ అధ్యక్షతన జరిగిన సభలో వారు పాల్గొని ప్రసంగించారు. అనంత రాములు ఉక్కుక్రమశిక్షణతో కూడిన నిబద్ధత గల కార్యకర్తగా పనిచేశారన్నారు. ఆలేటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ పని పట్ల అంకిత భావంతో పనిచేశారని ఆ విధంగా కృషి చేయాలని అలా పని చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, జైబున్నిసా, అబ్బాస్, కోడెం బోస్, బోయిన రాజ శేఖర్, సోమ కృష్ణ, సోమ సుజాత, వజ్జ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుట్ట ఖ్యాతిని తెలియజేసేలా విగ్రహాల ప్రతిష్ట

- స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

నవతెలంగాణ-ఇల్లందు



సింగరేణి కాలరీస్ ఇల్లందు(బొగ్గుట్ట)ఖ్యాతిని అందరికీ తెలియజేసేలా విగ్రహాల ప్రతిష్ట చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జియం జాన్ ఆనంద్ తెలిపారు. సింగరేణి కార్మికుల ప్రతిమలు, ఆనాటి బొగ్గు గనుల చిత్రాల ఏర్పాటుకు కరెంట్ ఆఫీస్, కారేపల్లి ఎక్స్ రోడ్‌లోని స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థలోని కార్మిక పని విధివిధానాలను కనభరిచేలా విగ్రహాలను రూపొందించి ఇల్లందు పట్టణంలోని అనువైన ప్రదేశం పరిశీలించడం జరిగిందని, ఆయా విగ్రహాలని ఏర్పాటు చేసి తద్వారా సింగరేణి సంస్థ సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించేలా చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన అనుమతులు త్వరితగతిన ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిజియం పర్సనల్ జివి.మోహన్‌రావు, ప్రాతినిధ్య సంఘం తరపున జె.వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలో విజిలెన్స్ వారోత్సవాలు

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం సింగరేణి ఉన్నత పాఠశాలలో బుధవారం విజిలెన్స్ వీక్ అవినీతి నిర్మూలన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్ధన సమయంలో ప్రధానోపాధ్యాయురాలు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అందరూ కలిసి పౌరుల నిజాయితీ ప్రతిజ్ఞను చేశారు. అవినీతి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర లంచం తీసుకోవడం, ఇవ్వడం చట్టరీత్యా నేరమని విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏ.సాయి సుజాత, తెలుగు భాష ఉపాధ్యాయురాలు సీరా ప్రసన్న, ఆంగ్ల భాష ఉపాధ్యాయులు కె.మురళీధర్ విద్యార్థులకు వివరించారు.

దీపావళి సంబురాలు...

పాఠశాలలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగతమయ్యేలా దీపావళి వేడుకలను దీపావళి ఆవశ్యకత దీపావళి పండుగ వెనక ఉండేటటువంటి సాంస్కృతి సాంప్రదాయాలు విద్యార్థులకు వివరించారు. కాలుష్యరహిత, సురక్షితమైన, దీపావళిని ఏ విధంగా జరుపుకోలో సూచనలిచ్చారు. విద్యార్థులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు ఈ వేడుకలో సైన్స్ ఉపాధ్యాయ బృందం నీటితో దీపాలను వెలిగించి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. ఈ వేడుకలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ.సాయి సుజాత, ఉపాధ్యాయులు ఫుల్ సింగ్, సీర ప్రసన్న, జయమ్మ, ధనలక్ష్మి, డి.వెంకటేశ్వర్లు, వనిత, శివరంజని, దేవ ప్రియ, కళ్యాణి, నాగ ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తుల వద్ద వస్తువులు కొంటే సమాచారం ఇవ్వండి

నవతెలంగాణ-చంద్రుగొండ



కొత్త వ్యక్తుల దగ్గర నుండి వాహనాలు వస్తువులు కొంటే సమాచార ఇవ్వాలని పాత ఇనుపసామాన్ వ్యాపారస్తులకు ఎస్ఐజి స్వప్న సూచించారు. బుధవారం మండలంలో ఉన్న పాత ఇనుప వస్తువులను కొనే వ్యాపారస్తులకు ఎస్సై జి .స్వప్న వారితో మాట్లాడుతూ కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చి వాహనములు గాని, వస్తువులు గాని అమ్మినా సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాసిబ్బంది ,వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా సీసీ రోడ్డు సైడ్ బర్మ్ నిర్మాణ పనులు

నవతెలంగాణ-అశ్వాపురం



మండల పరిధిలోని చింతిర్యాల గ్రామ పంచాయతీలో గల కట్టంవారిగూడెంలో నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్డు సైడ్ బర్మ్ నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ఆ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వాహనదారులకు, గ్రామస్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మేలు రకమైన గ్రావెల్‌ను సీసీ రోడ్డు కిరువైపులా పోయాల్సి ఉన్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్షణ ధోరణితో లక్షలాది రూపాయలతో చేపట్టిన పనులు నాసిరకం మట్టిని వాడుతూ నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఈ పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలతో పనులు జరిగేలా చూడాలని ఈ గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం

నవతెలంగాణ-చంద్రుగొండ

చంద్రుగొండలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద స్వామివారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాల మేళతాళాల నడుమ పురోహితులు తాళిబొట్టు చూపిస్తూ స్వామివారి కల్యాణాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణాన్ని తిలకించుటకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు దేవస్థానానికి వచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'మహిళా కార్మిక, ఉద్యోగులకు రక్షణ కల్పించాలి '

నవతెలంగాణ-కొత్తగూడెం

పని ప్రదేశంలో మహిళా కార్మికులకు ఉద్యోగాలకు రక్షణ కల్పించాలని కలకత్తా ట్రైనీ డాక్టర్ అభయ కేసు సిబిఐ విచారణ చేసి సుప్రీంకోర్టుకు అప్పజెప్పి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా కొత్తగూడెంలో షాపింగ్ కాంప్లెక్స్ వర్కర్స్, హాస్టల్ వర్కర్స్‌తో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కోశాధికారి మోత్కూరు మల్లికార్జున రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎఫ్‌టియూ జిల్లా ఉపాధ్యక్షులు గౌని నాగేశ్వరావు మాట్లాడుతూ పని ప్రాంతాలలో పనిచేస్తున్న మహిళలకు రక్షణ లేదని ఎన్ని చట్టాలు ఉన్నా ఉపయోగం లేకుండా పోతుందని అన్నారు. ఐఎఫ్‌టీయు నాయకులు వెంకటమ్మ వినోద్, కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద నాగకృష్ణ

నవతెలంగాణ-కొత్తగూడెం



పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద నాగకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కొత్తగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని బుధవారం కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మంద నాగకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి సుమారు సంవత్సరం కావస్తున్న పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు విడుదల చేయడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు రూ.8వేల కోట్ల స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని,వాటిని విడుదల చేయాల్సిన నాథుడే లేడని వాపోయారు. అబ్కారీ శాఖకి ఉన్న మంత్రి, ఈ రాష్ట్ర భవిష్యత్తు పునాదులను తీర్చిదిద్దే విద్యాశాఖకి మంత్రి లేకపోవడం ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సిగ్గుమాలిన చర్య అని వాపోయారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించమని ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్న తెలంగాణ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈవిధంగా స్కాలర్షిప్‌లను ఫీజు రీయంబర్స్‌మెంట్‌లను విడుదల చేయని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ దశలవారీ పోరాటాలను నిర్వహిస్తుందని హెచ్చరించారు. స్కాలర్షిప్లు విడుదల చేయని కారణంగా విద్యార్థులు ఉత్తీర్ణులైన కూడా ప్రైవేటు యాజమాన్యం వారి దగ్గర నుంచి ఫీజులను వసూలు చేస్తుందని, డబ్బులు కట్టనిచో వారి సర్టిఫికెట్లను ఇవ్వకుండా విద్యార్థులను అనేక సమస్యలకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కొత్తగూడెం మండల నాయకత్వం తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కొత్తగూడెం డిప్యూటీ తాసిల్దార్ అంజద్ పాషాకి అందజేశారు. ఈ ముట్టడి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్, టౌన్ నాయకులు నహీద్ పాషా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తాజా ఆహారాన్ని అందించాలి

- అడిషనల్ డీఎంహెచ్ఓ చైతన్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం

వసతి గృహాలలో విద్యను అందిస్తున్న విద్యార్థులకు హాస్టల్ యజమాన్యం శుద్ధి చేసిన జలంతో పాటు తాజా ఆహారాన్ని అందించాలని అడిషనల్ డిఎంహెచ్‌ఓ చైతన్య సూచించారు. బుధవారం ఆయన లక్ష్మీనగరం గ్రామంలోని ఏకలవ్య రెసిడెన్షియల్ మోడల్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు వసతి గృహాన్ని సందర్శించారు. ఏకలవ్య హాస్టల్‌లో ప్రతిరోజు హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా బుధవారం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పుల్లారెడ్డి, నాగరాజుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రస్తుతం హాస్టల్లో ఉన్న పిల్లలందరి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. అవసరం ఉన్న విద్యార్థుల నుండి రక్త నమూనాలు సేకరించి టీ హబ్‌కు నమూనాలు పంపించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్లోని వంటగది, పిల్లల డార్మెటరీస్, సిక్ రూమ్, టాయిలెట్స్‌ను మరియు హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్కూల్ స్టాఫ్ తోటి మరియు పిల్లల తోటి మాట్లాడారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అలాగే పరిశుభ్రమైన, తాజా ఆహారం, నీరు మాత్రమే తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యపరమైన ఏ సమస్య వచ్చినా వెంటనే హాస్టల్లోని ఏఎన్ఎంకి తెలియచేసి దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హాస్టల్



సిబ్బందికి హాస్టల్ పరిసరాల్లో నీరు ఎక్కడా నిలువ లేకుండా చూడాలని, శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎం దుర్గా దేవి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి నాబార్డ్ సహకారం

- ఉమ్మడి ఖమ్మం జిల్లా నాబార్డ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ యల్.సుజిత్

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండలంలోని పలు ఏజెన్సీ గ్రామాల్లో గిరిజన రైతులకు ట్రైబల్ డెవలప్ మెంట్ ఫండ్ ప్రాజెక్ట్ కింద పండ్లతోటల పెంపకానికి జాతీయ వ్యవసాయ గ్రామీణ బ్యాంక్ (నాబార్డ్) కొంత రాయితీలతో సహకరిస్తుందని ఉమ్మడి ఖమ్మం జిల్లా నాబార్డ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ఎల్.సుజిత్ అన్నారు. బుధవారం ఆయన అనంతోగు గ్రామంలో పలు గ్రామాల గిరిజన రైతులకు ట్రైబల్ డెవలప్ మెంట్ ఫండ్ ప్రాజెక్ట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాబార్డ్ బ్యాంక్ జీడి మామిడి తోటలు, మామిడి తోటలు, దేశీయ కోళ్ళు, చేపలు, మేకలు, గొర్రెల పెంపకం, కిరాణా షాపు, దేశీయ డైరీ ఫాం, పర్యాటక ప్రదేశాల అభివృద్ధి, కంగణ్ హాల్, తదితర చిన్న పాటి పరిశ్రమలు పెట్టడానికి గిరిజనులకు కొంత రాయితీలతో నాబార్డ్ బ్యాంక్ నిధులు మంజూరు చేస్తుందన్నారు. దానికి గాను మండలంలోని అనంతోగు, ముత్తాపురం, రాయిపాడు, మైలారం, రామాంజిగూడెం, పాతూరు, రాఘవాపురం, తదితర గ్రామాల్లో రైతులను వ్యవసాయ పట్టా భూముల వివరాలు అడిగి తెలుసుకుని, పలు గ్రామాల్లో జీడి మామిడి, మామిడి తోటల పెంపకాన్ని పరిశీలించామని చెప్పారు. మండలంలో 10 నుంచి 20 గ్రామాలను ఎంపిక చేసి, నేలను బట్టి పండ్ల తోటల పెంపకం పై రైతులకు అవగాహన ముందుగా కల్పిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు కు ఎన్జీవోగా సాయి స్వచ్ఛంద సంస్థ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాజా మాజీ ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి, పీఏసీఎస్ డైరెక్టర్ ఈసం సాంబశివరావు, సాయి స్వచ్ఛంద సంస్థ సిఈఓ ఈ.వెంకన్న, ప్రోగ్రాం మేనేజర్ ఏ.శిరీష, కో-ఆర్డినేటర్ ఎన్.శ్రీకాంత్, రైతులు వూకె భద్రం, ప్రసాద్, నాగేశ్వరరావు, నాగరాజు, జానీ తదితరులు పాల్గొన్నారు.

118 కేజీల గంజాయి పట్టివేత

- రెండు ఆటోలు స్వాధీనం
- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్.. ఒకరు పరార్

నవతెలంగాణ-భద్రాచలంరూరల్

ఒరిస్సా కలిమెల నుంచి హైదరాబాద్‌కు ఆటోలో అక్రమంగా తరలి వెళ్తున్న గంజాయిని బుధవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..ఒరిస్సా కలిమెళ్ళ నుంచి హైదరాబాద్‌కు రెండు ఆటోలో గంజాయి వెళుతుందని సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అండ్ ఎక్సైజ్ పోలీసులు కలిసి ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. అనుమానంగా వచ్చిన రెండు ఆటల్లో తనిఖీలు నిర్వహించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని కాటా వేయగా 118 కేజీలుగా ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు నిర్ధారించారు. గంజాయితో పాటు రెండు ఆటోలను ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పరారయ్యాడని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పట్టుకున్న గంజాయి వాహనాలతో కలిపి విలువ రూ. 31.50 లక్షలుగా ఉంటుందని ఎక్సైజ్ సూపర్ డెంట్ కరమ్ చందు తెలిపారు. అరెస్టు కాబడిన వ్యక్తుల్లో హైదరాబాద్‌కు చెందిన కనిగల స్వాతిక్, మణుగూరుకు చెందిన గుంజు ఆమోస్‌ను అరెస్టు చేయగా సపావత్ వెంకన్న పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్



పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ గౌతమ్ సిబ్బంది రామకృష్ణగౌడ్, హబీబ్ పాషా, వెంకట నారాయణ, గురవయ్య సుమంత్, శ్రావణి, రమేష్ పాల్గొన్నారు. గంజాయిని పట్టుకున్న టీమును ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వివి. కమలాసన్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఎక్సైజ్ సూపర్డెంట్ జానయ్య అభినందించారు.



వైభవంగా రామాలయ ధ్వజ స్తంభానికి పూజలు

నవతెలంగాణ-అశ్వాపురం

మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి ఇతర ప్రాంతాల నుండి తీసుకువచ్చిన ధ్వజస్తంభానికి బుధవారం ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నూతన రామాలయం నిర్మాణ సన్నిధి నుండి గ్రామస్తులు మేళ తాళాలతో ఎదురెల్లి గ్రామ పొలిమేరలో వాహనంలో వున్నటువంటి ధ్వజ స్తంభానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి భారీ వూరేగింపుగా ఆలయ నిర్మాణ సన్నిధికి చేర్చారు. భక్తులు, గ్రామస్తులు ప్రధాన రహదారి పై ధ్వజ స్తంభం ఆలయ సన్నిధికి తీసుకుని వస్తున్న సమయంలో శ్రీ రామనామ స్మరణతో హెూరెత్తించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ చైర్మెన్ మర్రి మల్లారెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు ఆలయ నిర్మాణమునకు ఆర్థికంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇంకా కొన్ని పనులు పూర్తి చేయాల్సి ఉందని, ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువతఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దీపావళి శుభాకాంక్షలు : ఎస్పీ రోహిత్‌రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని మనస్పూర్తిగా ఆకాంక్షించారు. టపాసులు పేల్చే సమయంలో తల్లి, దండ్రులు తమ పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



ఆర్థిక అవగాహన సదస్సు

నవతెలంగాణ-కరకగూడెం

మండల ఆంధ్రప్రదేశ్ వికాస్ బ్యాంక్ మేనేజర్ ఎస్.గిరిబాబు ఆధ్వర్యంలో బుధవారం గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం, ఆర్థిక అవగాహన సదస్సును మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కేవలం రూ.20/-లతో చెల్లింపుతో రూ .2,00,000లు ప్రమాద బీమా, ప్రమాదవశాత్తు సంభవించిన అంగవైకల్యమునకు కూడా బీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకం కింద వయస్సు 18-70 సం.ల వరకు బ్యాంక్ ఖాతా కలిగిన అందరూ అర్హులు అని తెలిపారు. అదే విధంగా ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కేవలం రూ.436/- ల ప్రీమియం తో రూ.2,00,000/- జీవిత బీమా సౌకర్యం, వయస్సు 18-50 సం.ల వరకు బ్యాంకు ఖాతా కలిగిన అందరూ అర్హులు ప్రతీ సం.ము ఆటో డెబిట్ ద్వారా ప్రీమియం మొత్తం బ్యాంక్ ఖాతా నుండి చెల్లించబడును అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐకేపీ వివోలు పాయం లక్ష్మి నారాయణ,రమాదేవి,వెంకన్న,ఎఫ్.ఎల్.సీ కోఆర్డినేటర్ ప్రసాద్, బ్యాంక్ ఖాతా దారులు, రైతులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి వైద్యశాలలో పిజియోథెరపీ వైద్యుడిని నియమించాలి

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి వైద్యశాలలో ఫిజియోథెరపీ సేవలు అందించేందుకు వైద్యుడిని నియమించాలని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు నాగెల్లి వెంకటేశ్వర్లు కోరారు. జియం నేటి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి మణుగూరు వైద్యశాలలో పిజియో థెరపీ సేవలు ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మికులతో పాటు జీవనశైలిలో మహిళలకు వచ్చే అనేక రుగ్మతల నివారణకు పిజియోథెరపీ సేవలు ఎంతగానో దోహద పడ్డాయి. కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేసే యాజమాన్యం పి జి యో థెరపీ సేవల అందించడానికి డాక్టర్ నియామక ప్రకటన చేయాలని కోరారు.



రెజొనెన్స్‌లో దీపావళి వేడుకలు

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం శ్రీనివాసనగర్, శ్రీనగర్ కాలనీలలోని గల రెజొనెన్స్ పాఠశాలలలో దీపావళి వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి బాణాసంచా చప్పుళ్ళ..దీపావళి సోయగాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వి.నాగేంద్రకుమార్, నీలిమ, కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణిలు మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలిగిందేది భారతీయ పండుగలు, వాటిలో ఆనందంగా జరుపుకుంటూ జాతి, కుల, మత వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగ ఈ దివాలి, చీకటిని పారద్రోలుతు వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా ఈ దీపావళి పండుగను జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యతభావంకు ఉద్యోగుల వనమహోత్సవం

నవతెలంగాణ-కారేపల్లి

ప్రభుత్వం అన్ని శాఖల ఉద్యోగుల మధ్య ఐక్యత భావం నెలకొల్పటానికి ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నవంబర్ 3న ఖమ్మం చెరుకూరి వారి తోటలో వనమహోత్సవం నిర్వహించటం జరుగుతుందని పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ అన్నారు. బుధవారం కారేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్‌తో కలిసి వనమహోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మల్లెల రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ జేఏసీ ఆధ్వర్యంల జరిగే వనమహోత్సవానికి ఉద్యోగుల కుటుంబాలతో పాటు జర్నలిస్టు కుటుంబాలు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజకీయాలకుతీతంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

నవతెలంగాణ-కొణిజర్ల

రాజకీయాలకుతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన మండల పరిధిలోని చిన్నమునగాల గ్రామంలో ఏర్పాటు చేసిన సీపీఎం 9వ మండల మహాసభ విజయవంతమైందన్నారు. అన్ని గ్రామాల నుంచి శాఖా కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో మహాసభకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు డాక్టర్ బోయినపల్లి శ్రీనివాస్‌రావు, చింతపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ -కూసుమంచి



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు మండలంలో జీళ్ళచెరువు గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండలం కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొక్క ఉపేందర్, సీనియర్ నాయకులు ఎడవెల్లి రాంరెడ్డి, పెండ్ర అంజయ్య, కేశవరెడ్డి, కంచర్ల జీవన్‌రెడ్డి, కొరివి వెంకటరత్నం, కొండ శ్రీనివాస్‌రావు, మునుగంటి రాములు, శేఖర్‌రెడ్డి, పల్లెబోయిన శ్రీను హాజరయ్యారు.

విలేకర్ల దీక్షకు సంఘీభావం

నవతెలంగాణ-వేంసూరు

తహశీల్దార్ రాజును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట విలేకరులు నిర్వహిస్తున్న దీక్షకు బుధవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్, బిఆర్ఎస్ మండల నాయకులు శంకర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి పిల్లి భాస్కర్ సంఘీభావం తెలిపారు. సమాచారం కోసం కార్యాలయానికి వెళ్లిన విలేకరులపై దాడికి దిగి విచక్షణారహితంగా ప్రవర్తించిన తాసిల్దార్‌పై చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు టాలెంట్ స్కూలు విద్యార్థి

నవతెలంగాణ-సత్తుపల్లి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు సత్తుపల్లిలోని టాలెంట్ స్కూలు 9వ తరగతి కంచల జాన్‌వెస్లీ పునకోసి షాటోఖల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా తరపున ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్‌ఐ పోటీలకు ఎంపికయ్యాడు. ఉమ్మడి జిల్లాస్థాయిలో ఇటీవల కొత్తగూడెంలో జరిగిన కరాటే పోటీల్లో జాన్‌వెస్లీ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం జరిగిందని టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జాన్‌వెస్లీని స్కూల్ ఇన్‌ఛార్జి శంకర్, కరాటే మాస్టర్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఐక్యతను చాటే ఉద్యోగుల సమ్మేళనం



వనసమారాధనను విజయవంతం చేయాలి

- విలేకరుల సమావేశంలో జేఏసీ మహిళా విభాగం నేతలు జి.ఉష శ్రీ, పి.సుధారాణి, ఎస్.లలిత కుమారి

నవతెలంగాణ- ఖమ్మం

ఐక్యతను చాటే ఉద్యోగుల సమ్మేళనమని జేఏసీ మహిళా విభాగం నేతలు జి.ఉష శ్రీ, పి.సుధారాణి, ఎస్.లలిత కుమారి అన్నారు. బుధవారం ఖమ్మంలోని టిఎన్జీవోస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కుల వన భోజనాలకు విరుద్ధంగా జరుగుతున్న సకల ఉద్యోగుల సమ్మేళనం, వన సమారాధన కార్యక్రమం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. నిరంతరం ఒత్తిడికి లోనయ్యే మహిళలకు వనసమారాధన వంటి కార్యక్రమాలు ఆటవిడుపుగా ఉంటాయని అన్నారు. ముఖ్యంగా ఇప్పటి వరకు ఎన్నడూ జరగని రీతిగా ఖమ్మంలో జరుగుతున్న వనసమారాధన కార్యక్రమం పట్ల మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. మహిళల కోసం రూపొందించిన క్రీడా పోటీల్లో మహిళలు అన్ని విభాగాల్లో పోటీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జేఏసీ నేతలు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు ఆయా కార్యవర్గాలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ మహిళా ఉద్యోగి విధిగా పాల్గొని ప్రతిష్టాత్మకంగా జరిగే కార్యక్రమం విధిగా పాల్గొనాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జి.లలితమ్మ కె.పద్మజ, సిహెచ్ రోజా, స్వరూప, నాగమణి, షమ్మీ, శ్వేత, జి.రమ, కె.సుధా, ఎస్ విజయ, ఎస్ భవాని, పద్మ, పి.చంద్రకళ, జి.లావణ్య, టి.భవాని, కేశవ లక్ష్మి, శ్రావణి పాల్గొన్నారు.

సయ్యద్ జుబేన్‌కు నివాళి

నవతెలంగాణ- కల్లూరు

కల్లూరు పట్టణం సోమ లింగారెడ్డి వీధికి చెందిన లారీ డ్రైవర్ అక్బర్ సతీమణి సయ్యద్ జుబేన్ బుధవారం ఉదయం అనారోగ్య కారణంగా మృతిచెందింది. విషయం తెలుసుకుని ఆ కుటుంబాన్ని ఓదార్చి.. మృతురాలి పార్థివదేహానికి ఏఎంసి చైర్మన్ భాగం నీరజచౌదరి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి, ఆలకుంట నరసింహారావు, ఎస్కే ఉస్మాన్, తురాబ్ అలీ, షేక్ బాజీ, మాజీ ఎంపీటీసీ దామాల రాజు, ముస్లిం పెద్దలు స్థానికులు పాల్గొన్నారు.

సర్వజ్ఞలో అంబరాన్నంటిన దీపావళి వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని విడిఓస్ కాలనీలో సర్వజ్ఞ పాఠశాలలోని విద్యార్థులు దీపావళి పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. పిల్లలు రంగు, రంగుల దుస్తులతో వివిధ రకాల దీపాలను వెలిగించి, ఎకో ఫ్రెండ్లీ టపాసులను వాడి దీపావళిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ నీలిమ మాట్లాడుతూ చిన్నారులకు దీపావళి ప్రాముఖ్యతను, మన ఆచార వ్యవహారాల పట్ల, భారతీయ సంస్కృతీ, సంప్రదాయాల పట్ల, మన పండుగల గొప్పతనాన్ని చిన్నారులకు ఆమె వివరించారు. డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ దీపావళి పండుగలో బాణాసంచా కాల్చేటప్పుడు పిల్లలు కాటన్ దుస్తులను మాత్రమే ధరించి టపాసులను జాగ్రత్తగా కాల్చాలని, ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పిల్లలకు తెలియజేశారు. ఎకో ఫ్రెండ్లీ టపాసులను వాడాలని ప్రకతికి ఎలాంటి హాని కలగకుండా దీపావళి వేడుకలను జరుపుకోవాలని, ఈ దీపావళి పండుగలాగా ప్రతి ఒక్కరి జీవితం నూతన కాంతులతో వెలుగొందాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టిజన్స్ వ్యవస్థను రద్దు చేయాల్సిందే..

టీఎస్‌యుఈఈయు సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకిరెడ్డి నరసింహారావు



- శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు
- ఒకే సంస్థలో రెండు రకాల సర్వీస్ రూల్స్
- తీవ్రంగా నష్టపోతున్న కార్మికులు
- ఏడేళ్లు సర్వీస్ దాటిన ప్రమోషన్లు కరువు
- ఏపీఎస్‌ఈబీ రూల్స్‌ను వర్తింపజేయాల్సిందే

కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టిజన్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

నవతెలంగాణ-పాల్వంచ

విద్యుత్ సంస్థల్లో శ్రమదోపిడీకి గురవుతున్న ఆర్టిజన్స్ వ్యవస్థను రద్దు చేయాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకిరెడ్డి నరసింహారావు కోరారు. బుధవారం ఆయన నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని చాలీచాలని వేతనాలతో పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తూ అనేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని చెప్పారు. కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని 2016లో సీఐటీయూ ఆధ్వర్యంలో అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేసి పోరాటం చేసి ఆనాటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీర్తిశేషులు ఎస్.కిరణ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ స్టేషన్లు జెన్కో ట్రాన్స్కో తిరిగి అందర్నీ చైతన్యపరిచి పోరాటాన్ని ఉధృతం చేశారని చెప్పారు. ఆనాడు ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం దిగివచ్చి కాంట్రాక్ట్ కార్మికులందరినీ ఆర్టిజన్స్‌గా ఇస్తాను అంటే సీఐటీయూ పర్మినెంట్ చేయాలని, సమావేశం నుంచి బైకాట్ చేసిందని చెప్పారు.

కొంత మంది యూనియన్ నాయకులు ఆర్టిజన్లగా అంగీకరిస్తూ సంతకాలు పెట్టారని తెలిపారు. దీంతో కేసీఆర్ ప్రభుత్వం 23వేల మంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసినట్లు ప్రకటించి గొప్పగా చెప్పారన్నారు. అయితే వారికి పర్మనెంట్ పొలాలు మాత్రం ఈరోజు వరకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్సోర్సింగ్ కార్మికులకు ఆర్టిజన్‌గా నామకరణ చేసి వారికి స్టాండింగ్ ఆర్డర్స్ పేరుతో సపరేట్ రూల్స్ వర్తింపజేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దీంతో వారికి వేతనాలతో పాటు ఇతర అంశాలు నష్టం జరిగిందన్నారు. కార్మికులకు ఏపీ రూల్స్ ప్రకారం వేతనాలు రావడం లేదని ఒకే సంస్థలో ఒకే రకమైన విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి రెండు రకాల సర్వీసులు రూపొందించి ఆర్టిజన్ కార్మికులను అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం నిలువుగా ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను నమ్మించి మోసం చేశారని అన్నారు. ఇప్పటికీ ఆర్టిజన్ కార్మిక సర్వీస్ ఏడేళ్ల దాటినప్పటికీ ప్రమోషన్లు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. స్టాండింగ్ రూల్స్ ప్రకారం ఏడు సంవత్సరాలకు ప్రమోషన్ రావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. అయినా విద్యుత్ సంస్థల్లో ఒకే రకమైన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కార్మికులకు రెండు రకాల సర్వీసెస్ ఉండడంవల్ల విద్యుత్ శాఖలో కీలకంగా పనిచేస్తున్న కార్మికులు తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. జేఎల్ఎం లైన్మెన్ లైన్ ఇన్స్పెక్టర్లతోపాటు వివిధ క్యాటగిరీలో పనిచేసిన ఉద్యోగులకు ఏపీఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింపజేసి విద్యుత్ సబ్స్టేషన్ కీలక శాఖలో పనిచేస్తున్న కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్స్ పేరుతో సపరేట్ రూల్స్ ఏర్పాటు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.

ఒకే రకమైన పనులు చేసే కార్మికులకు రెండు రకాల సర్వీస్ రూల్స్ అవసరమా అని ప్రశ్నించారు. ఇప్పటికే ఆర్టిజన్ కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నలుగురు ఆర్టిజన్ ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కేవలం ముగ్గురు ఇద్దరితో పని చేపిస్తూ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాలో పలు సబ్‌స్టేషన్లో ముగ్గురు ఆర్టిజన్స్ ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, షాద్‌నగర్ నియోజకవర్గంలో ప్రతి సబ్ స్టేషన్‌లో ఇద్దరు ఆర్టీసీ ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహించిన వాళ్ళ పనిభారం అధికమై కార్మికుల అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇవన్నీటికీ కారణం 2015లో కొన్ని యూనియన్ చేసిన తొందరపాటు నిర్ణయాల వల్ల ఇంత ఘోష పడాల్సి వస్తుందన్నారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టిజన్స్ వ్యవస్థను రద్దుచేసి ఓఎండిగా కన్వెన్షన్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంవత్సరంలో ఇంతవరకు ఆర్టిజన్ పదం వాడలేదని, ఆర్టిజన్స్ కన్వెన్షన్ చేస్తే ప్రభుత్వం, బోర్డు మీద ఆర్థిక భారం పడదని చెప్పారు. ఆర్టిజన్స్‌కు గ్రేడ్ వన్ జీతం 50వేలు వస్తుందని, బీటెక్ డిప్లమా ఉన్న ఆర్టిజన్స్‌కు కన్వర్షన్ ద్వారా సబ్ ఇంజనీర్గా చేయవచ్చని డిగ్రీ ఉన్నవారికి జూనియర్ అసిస్టెంట్ వస్తుందన్నారు ఆర్టిజన్స్ సెకండ్ ఫీల్డ్ వారికి జేఎల్ఎం జేపిఎల్ గా ఇవ్వచున్నారు వాళ్ళ జీతం 40,000 వరకు వస్తుంది అన్నారు ఆర్టిజన్ గ్రేడ్ 3లో పదో తరగతి చదివిన వారికి హెల్పర్ గా ఆర్టిజన్ ఫోర్త్ గ్రేడ్ల వారికి మసీదుగా చదువురాని మహిళ ఆర్టిజన్స్ కు స్వీపర్గా కన్వెన్షన్ చేయవచ్చని వారి జీవితం కూడా 30000 చేయొచ్చు అన్నారు. వాళ్లను కన్వెన్షన్ చేసే అవకాశం ఉన్న పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 1998లో ప్రత్యేక జీవో నంబర్ 41 ద్వారా కాంట్రాక్ట్ లేబర్స్ పద్ధతిని రద్దు చేస్తూ వాళ్లను కన్వెన్షన్ చేశారని గుర్తు చేశారు.

కొన్ని యూనియన్స్ మైండ్ గేమ్స్ ఆడుతున్నారని గ్రేడ్స్ చేంజ్ చేయాలని నాటకాలు ఆడ మానుకోవాలని చెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. లేనిపక్షంలో సమరశీల చేయాల్సి వస్తుందన్నారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలహరిస్

విజయాన్ని కాంక్షిస్తూ మహాయాగం

- 50 మంది వేద పండితులు పది రోజులపాటు నిర్వహణ
- అగ్ని ప్రతిష్టతో మొదలై "పూర్ణాహూతి"తో పరిసమాప్తం







నవతెలంగాణ-పాల్వంచ

భారతీయ మూలాలు కలిగిన మహిళగా మొక్కవోని ధైర్యంతో ఎన్నికల బరిలో నిలిచిన ప్రస్తుత అమెరికా వైస్ ప్రెసిడెంట్ యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికా దేశ అధ్యక్ష ఎన్నికలలో డెమోక్రాటిక్ పార్టీ తరుపున కమలహరిస్ బరిలోనిలిచారు. ఆమె అత్యధిక మెజారిటీతో గెలవాలని పాల్వంచలోని హెచ్ కన్వెన్షన్ హాల్లో శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మెన్ నల్లా సురేష్ రెడ్డి కమల హరిస్‌పై అభిమానంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ రాజ శ్యామలాంబ దేవి వారి మాలా మంత్ర జపయజ్ఞ పూర్వక శత చండీ సహిత మహాయాగం వేద పండితులచే అక్టోబర్ 20వ తారీకు నుండి "అగ్నిప్రతిష్టతో ప్రారంభించి 30న బుధవారం "పూర్ణాహూతి"తో పరిసమాప్తం చేశారు. ఈ పూజా కార్యక్రమంలో 50 మంది వేదపండితులతో ప్రతి రోజు దేవివారి జపమాలలు పటిస్తూ, అత్యంత వైభవంగా యాగం నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో భాగంగా నల్లా సురేష్ రెడ్డి భారతదేశం కోసం, దేశ ప్రజలను, రైతులను, దేశాన్ని సుభిక్షంగా ఉంచే విధంగా ప్రతిరోజూ యాగంలో దేవి మంత్రాలను పఠిస్తూ నిత్యం పూజలు నిర్వహించారు. బుధవారం "పూర్ణాహూతి"లో వేలాది మంది ప్రజలు మహిళలు, భక్తులు, అయ్యప్ప మాలాధారులు, అధికారులు, ప్రముఖులు నాయకులు అందరూ భక్తి శ్రద్దలతో పాల్గొని, అమ్మ వారి తీర్థ ప్రసాదంతో పాటు అన్నదానం కార్యక్రమం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో పలు వీధుల్లో కమల హరీస్ గెలుపును కాంక్షిస్తూ భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ యాగం నిర్వాహకులు నల్లా సురేష్ రెడ్డి ఫౌండర్ చైర్మెన్ మాట్లాడుతూ ఈ పూజలకు భక్తి శ్రద్ధలతో విచ్చేసిన బంధు మిత్రులకు, సన్నిహితులకు, భక్తులకు ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలియచేశారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేసేంత వరకూ పోరాడతాం

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాంచరణ్

నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేసేంతవరకూ పోరాటం చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్ అన్నారు. బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శనగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని గిర్దావర్ రవికుమార్‌కు విద్యారంగ సమస్యలపై బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 8 వేల కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంటర్మీడియట్, పారామెడికల్ కళాశాల యాజమాన్యాలు స్వయంగా కళాశాల బంద్ పెట్టి ఆందోళన చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోతుందా అని ప్రశ్నించారు. పేద మధ్యతరగత విద్యార్థులకు అందించే స్కాలర్షిప్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పక్షాన ఆలోచించి పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోలన చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మందా నాగకృష్ణ, పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల నాయకులు నాగబాబు, అఖిల్, సమీర, సుభద్ర, లక్ష్మి ప్రసన్న, సుమంత్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



మోరంపల్లి బంజర్‌లో ఘనంగా అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ -బూర్గంపాడు

మోరంపల్లి బంజరు గ్రామంలో అయ్యప్ప స్వామి దీక్ష స్వాములకు ప్రముఖ పాత్రికేయులు జక్కిరెడ్డి మల్లా రెడ్డి ఇంటి వద్ద ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అయ్యప్ప స్వామి పటానికి దండ వేసి పూజలు నిర్వహించి భజనలు చేశారు. అనంతరం దీక్ష స్వాములకు అన్నదానం చేశారు.. ఈ సందర్భంగా గురు స్వామి కందుకూరి నాగేంద్రం మాట్లాడుతూ మండల కాలంలో అయ్యప్ప మాల ధరించి 41 రోజులు దీక్షలు నిర్వహించి అనంతరం ఇరుము డి కట్టుకొని శబరిమల అయ్యప్ప స్వామి సన్ని ధానానికి దీక్ష స్వాములు చేరు కొని ఇరుముడి అప్పజెప్పి దర్శించుకుంటారని ఆయన అన్నారు.



జగన్ పాడే మోసిన మంత్రి తుమ్మల

అశ్రు నయనాలతో కార్పొరేటర్ అంత్యక్రియలు

నవతెలంగాణ -ఖమ్మం

ఖమ్మం నగరం 3వ డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్మోహన్ అంత్యక్రియలు బుధవారం కాంగ్రెస్ నాయకులు, బంధువులు, స్నేహితుల నడుమ అశ్రు నయనాలతో పూర్తి చేశారు. జగన్ నివాసం నుంచి జగన్ మామిడి తోట వరకు బౌతికకాయంతో అంతిమయాత్ర చేపట్టారు. బంధువులతో పాటుగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగేందర్, సాధు రమేశ్ రెడ్డి పాడే మోశారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, కొప్పెర సరితా ఉపేందర్, మిక్కిలినేని మంజులనరేందర్, పల్లెబోయిన చంద్రంభారతి, దోడ్డా నగేశ్, వీవీపాలేం సొసైటీ అధ్యక్షులు రావూరి సైదబాబు, ఖమ్మం ఏఎంసీ మార్కెట్ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ అంతిమ యాత్రలు పాల్గొన్నారు. ఎంపీ రఘురాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి, తుంబూరి దయాకర్రెడ్డి జగన్ కుటుంబ సభ్యుల్ని పరామర్శించి ఓదార్చారు.

ద్రోణాదుల నాగేశ్వరరావుకు సతీవియోగం

నవతెలంగాణ-వైరా



వైరా మండలం పూసలపాడు గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు ద్రోణాదుల నాగేశ్వరరావు సతీమణి నాగమణి (55) అనారోగ్యంతో మంగళవారం రాత్రి హైద్రాబాద్‌లో గల ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. బుధవారం మధ్యాహ్నం నాగమణి భౌతిక కాయాన్ని పూసలపాడు తీసుకురాగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యావీరభద్రం, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, వైరా పట్టణ కమిటి కార్యదర్శి సుంకర సుధాకర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, బాజోజు రమణ, మండల కమిటీ సభ్యురాలు గాలి అరుణ కుమారి, మాజీ ఎంపీపీ బొంతు సమత, విప్పలమడక మాజీ సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, రైతుసంఘం మండల అధ్యక్షులు మేడా శరాబంది, బాణాల కృష్ణమాచారి, సిరిపురం గ్రామ శాఖ కార్యదర్శి నల్లమల కోటేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ, మహిళా సంఘం వైరా పట్టణ అధ్యక్షురాలు తోట కృష్ణవేణిలు నాగమణి భౌతికకాయంపై అరుణ పతాకాన్ని కప్పి జోహార్ లు అర్పించారు. పూసలపాడు సొసైటీ చైర్మన్ గాలి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ చైర్మన్ మొక్కా గోపాలకృష్ణ తదితరులు నాగమణికి నివాళులర్పించారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటనపై ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తగూడెం గ్రామానికి చెందిన గాంధారి బాలకృష్ణ(43) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్య పరిస్థితులు తట్టుకోలేక ఈనెల 28వ తేదీన గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 29వ తేదీన మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.

గిరిజన విద్యార్థికి మంత్రి చేయూత

- ఎంబీబీఎస్ చదివిస్తానని భరోసా
- రూ.2 లక్షల తక్షణ సాయం
- ప్రయివేటు కళాశాలలో సీటు.. ఆర్థిక భారం దృష్ట్యా వ్యవసాయ పనులకెళ్తున్న యువతి
- సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని.. అండగా నిలిచిన మంత్రి కోమటిరెడ్డి



నవతెలంగాణ-కౌడిపల్లి

ఓ ప్రయివేటు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించి.. ఆర్థిక భారంతో వ్యవసాయ పనులకెళ్తున్న యువతికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అండగా నిలిచారు. ఐదేండ్ల ఎంబీబీఎస్ కోర్సు తానే చదివిస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా రూ.2లక్షలు అందజేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని సలాబత్పూర్ భద్ర తాండాకు చెందిన కాట్రోత్ దంసి, శివరాం దంపతుల రెండో కూతురు సుమలత సిద్దిపేటలోని సురభి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. అది ప్రయివేటు వైద్య కశాశాల కావడంతో ప్రతిఏడు రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఆర్థికంగా అంత స్థోమత లేకపోవడంతో సుమలత ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ పనులకు వెళు తున్నది. అయితే ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి వెళ్లింది. ఆయన వెంటనే స్పందించి బుధవారం ఆ యువతిని తన కార్యాలయానికి పిలిపించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎంబీబీఎస్ కోర్సు ఐదేండ్లు తానే చదివిస్తానని భరోసానిచ్చారు. అంతేకాకుండా తక్షణ సాయంగా రూ.2లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని తండ్రి శివరాం.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ- తొర్రూర్‌రూరల్


(ఫైల్)

అప్పులబాధకు తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని పోలేపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలేపల్లి గ్రామానికి చెందిన రైతు పందుల వెంకటేశ్వర్లు(50) తనకున్న పంట పొలంలో నాలుగు బోర్లు వేయగా పడలేదు. దాంతో కొంత అప్పులపాలై, తనకున్న గొర్రెలు మేపుకొని జీవిస్తున్నాడు. కాగా, గొర్రెలు అనారోగ్యానికి గురై చనిపోయాయి. మొత్తంగా రూ.9,60,000 అప్పు అవ్వడంతో దాన్ని ఎలా తీర్చాలని మనోవేదనకు గురయ్యాడు. మంగళవారం ఉదయం 10గంటల సమయంలో తనకున్న పొలం వద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో హుటాహుటిన హన్మకొండలోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుని కుమారుడు వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పింఛను కోసం వృద్ధుల బారులు

- తాగునీళ్లు లేక ఇబ్బందులు



నవతెలంగాణ-పెద్దవూర

ప్రభుత్వం ఇచ్చే సామాజిక పింఛన్ల సొమ్ము అందుకోవడానికి వృద్ధులు నానా తిప్పలు పడుతున్నారు. నల్లగొండ జిల్లా పెద్దవూర పోస్ట్ ఆఫీసు ముందు బుధవారం బారులు తీరారు. శుక్రవారం దీపావళి పండుగ కావడంతో దాదాపు 100 మంది సుమారు 10-15 కిలోమీటర్ల దూరం నుంచి పింఛన్ కోసం వచ్చారు. వారిలో వృద్ధులు, వికలాంగులు ఉన్నారు. మారుమూల గిరిజన గ్రామాల నుంచి ఆటోలు, ఇతర రవాణా సౌకర్యాల ద్వారా పింఛనుదారులు మండల కేంద్రానికి వచ్చి ఉదయం నుంచి పోస్ట్ ఆఫీసు ముందు బారులు తీరారు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో చెల్లింపుల్లో జాప్యం జరిగింది. దీంతో సాయంత్రం వరకు నిరీక్షించాల్సి రావడంతో ఆకలి, దప్పికతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొంతమంది సమీపంలోని చెట్టు నీడన కూర్చున్నారు. అక్కడ కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయలేదు.

4న సర్పంచుల నిరసనకు అనుమతివ్వండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పెద్దమ్మగుడి వద్ద తాము తలపెట్టిన నిరసన కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని రాష్ట్ర డీజీపీని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ కోరింది. బుధవారం హైదరాబాద్‌లో ఈ మేరకు డీజీపీ జితేందర్‌కు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వియాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి రాపాక నాగయ్య వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో 163 బీఎన్ఎస్ఎస్(144 సెక్షన్)ను వెంటనే తొలగించాలని విన్నవించారు. సర్పంచులకు ప్రభుత్వం ద్వారా పెండింగ్ నిధులు రావాల్సి ఉందనీ, అనేక సార్లు విన్నవించినా రాష్ట్ర సర్కారు నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదని తెలిపారు. ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తనీయకుండా శాంతియుత మార్గంలో నిరసన తెలుపుతామని తెలిపారు. మానవ హక్కులను భంగం కలిగించేలా ఉన్న సెక్షన్ 114 ఎత్తేయాలని కోరారు. తమ నిరసనకు అనుమతివ్వాలని విన్నవించారు.

బీసీల సంఖ్య తేలుస్తాం

- న్యాయస్థానాల తీర్పులకనుగుణంగానే కులగణన నివేదిక
- మెదక్, సిద్దిపేట కలెక్టర్ల తీరు ఆక్షేపణీయం
- సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ : చైర్మెన్ నిరంజన్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సమాజంలో సామాజిక పరిస్థితుల్ని తెలుసుకోవడానికి, బీసీల సంఖ్యను తేల్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఓ యజ్ఞంలా భావించి తీసుకున్న నిర్ణయమే 'బీసీ కుల గణన' అని బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లను ఖరారు చేసే అంశంపై 'బహిరంగ విచారణ' నిర్వహించారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని వివిధ బీసీ కులాలకు చెందిన ప్రతినిధులు, సంఘాల నాయకులు తమ కుల సమస్యలు, రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులు, వివక్ష వంటి అంశాలపై అఫిడవిట్స్ సమర్పిస్తూ కమిషన్‌కు పలు సూచనలు, ప్రతిపాదనలు చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం అనే డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బీసీ కుల గణన చేయాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇప్పటికే బీసీల్లో ఏ,బీ,సీ,డీలున్నాయని, అయితే కులాల వారీగా రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ ప్రధానంగా ముందుకొస్తుందన్నారు. పిచ్చకుంట్ల, దొమ్మర వంటి కులాలు వంశరాజులుగా, గడవంశీయులుగా పేర్లు మార్చుకున్న విషయాల్ని గుర్తు చేశారు. తమ్మరి కులంలో శూద్ర అనే పదం ఉన్నందున సామాజికంగా వివక్షకు గురవుతున్నట్టు ఆ కుల ప్రతినిధులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. బీసీలు, ఉప కులాలు సైతం వివక్షకు గురవుతున్నందున బీసీ అట్రాసిటీ చట్టాన్ని తేవాలని కూడా ఆ సామాజిక తరగతిల్లో బలమైన డిమాండ్‌గా వినిపిస్తోందన్నారు. లోధి కులానికి బీసీ సర్టిఫికెట్స్ జారీ చేయట్లేదన్నారు. ఆరె కటికలు తమను బీసీ-బీ నుంచి ఎస్సీల్లో కలపాలని ఎప్పటి నుంచో కోరుతున్నారని తెలిపారు.

బహిరంగ విచారణతో పాటు నవంబర్ 6 నుంచి నిర్వహించనున్న ఇంటింటి సమగ్ర సర్వేలో వచ్చిన సమాచారాన్ని బట్టి రాష్ట్రంలో బీసీల్లోని ఏ ఏ కులంలో ఎంత జనాభా ఉన్నది, వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ, ఉద్యోగ, ఉపాధి ఇతర అన్ని అంశాలకు సంబంధించిన సమగ్ర వివరాలు తేలుతాయన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు అనుగుణంగా సమగ్రమైన నివేదికను సమర్పిస్తామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించే రిజర్వేషన్ల విషయంలో దామాషా పద్ధతిన ఏ కులానికి ఎంత ప్రాతినిధ్యం ఉండాలనే విషయాల్ని సూచించడంలో బీసీ కమిషన్ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని తేల్చిచెప్పారు.

మెదక్, సిద్దిపేట కలెక్టర్ల తీరు ఆక్షేపణీయం

బీసీ కమిషన్ నిర్వహిస్తున్న బహిరంగ విచారణకు హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిద్దిపేట, మెదక్ జిల్లా కలెక్టర్ల తీరు ఆక్షేపనీయమని చైర్మెన్ నిరంజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ విచారణ కార్యక్రమాన్ని సంగారెడ్డిలో నిర్వహిస్తున్నందున మూడు జిల్లాలకు చెందిన కలెక్టర్లు హాజరుకావాలని కమిషన్ నుంచి ముందే సూచించిందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కమిషన్ వచ్చిన సందర్భంగా స్వాగతం పలికే విషయంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు కూడా హాజరు కాకపోవడాన్ని చైర్మెన్ తీవ్రంగా పరిగణించారు. ఈ విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి కూడా కమిషన్ తరపున లేఖ రాయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు, బీసీ కమిషన్ స్పెషలాఫీసర్ సతీష్, మూడు జిల్లాల అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, నగేష్, అబ్దుల్ అమీద్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు జగదీశ్, నాగరాజు, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

2013 భూ సేకరణ చట్ట ప్రకారం కూలీలకూ పరిహారమివ్వాలి

నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం) ధర్నా



నవతెలంగాణ-జహీరాబాద్

నిమ్జ్ భూ బాధితులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని, దీన్ని కూలీలకు వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని ఆర్డీవో, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో, పరిపాలనా అధికారి వంశీకృష్ణ, నిమ్జ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.రాంచందర్ మాట్లాడుతూ.. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కూలీలందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిమ్జ్ పరిధిలో పునరావాసం కల్పించాలన్నారు. కూలీలకు న్యాయం చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పలు దఫాలుగా విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టులో కేసులు వేయగా.. కూలీలకు పునరావాసం కల్పించాలని కోర్టు ఆదేశాలివ్వగా, దాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అంగీకరించిందన్నారు. కాగా ప్రస్తుతం పరిశ్రమలు పెట్టడానికి చురుకుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని.. కోర్టు ఆదేశాల ప్రకారం ముందు కూలీలకు పునరావాసం కల్పించిన తర్వాతనే పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కూలీలకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దన్నారు. వెంటనే దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేయాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. శంకర్, మనోహర్, జయమ్మ, బలప్ప, నర్సమ్మ, బర్దిపుర్, ఎల్గొయి గ్రామాలకు చెందిన కూలీలు పాల్గొన్నారు.

మూసీని అమ్మేసే యత్నంలో రేవంత్‌రెడ్డి

- పేదలుంటున్న 15 కిలోమీటర్లను వదిలి మిగతా అభివృద్ధి చేయండి
- ఇందిరమ్మ కమిటీలు చెల్లవు : ఎంపీ రఘునందన్‌రావు



నవతెంగాణ బ్యూరో-హైదరాబాద్

కేసీఆర్ మాదిరిగానే రేవంత్‌రెడ్డి కూడా మూసీని అమ్మేసే ప్రయత్నంలో ఉన్నారని బీజేపీ ఎంపీ ఎం.రఘునందన్‌రావు ఆరోపించారు. మూసీ సుందరీకరణ పేరుతో డబ్బులు దండుకోవాలని చూడటం సరిగాదన్నారు. పేదలుంటున్న 15 కిలోమీటర్ల పరిధిలో వదిలిపెట్టి మిగతా మూసీ పరీవాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారనీ, కేటీఆర్ రేవ్ పార్టీలని తిరుగుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ప్రజలు సీ స్థానం ఇచ్చారనీ, ఆ పార్టీ స్థానంలోకి బీజేపీ వెళ్లదని చెప్పారు. తెలంగాణలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కుక్కతోక పటాకులు పేలుతాయా? సుతిల్ బాంబులు పేలుతాయా? అనేది చూడాలన్నారు. అవినీతి పరులను అరెస్టు చేస్తే స్వాగతిస్తామని చెప్పారు. మీడియాలో స్పేస్‌కోసం మాటలు మాట్లాడటం కాదు అమలు చేసి చూపాలని సూచించారు. ఆరు నెలల కింద మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద కేంద్రం రూ.12 వందల కోట్లను విడుదల చేసిందని తెలిపారు. గ్రామపంచాయతీలు కరెంటు బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్నాయనీ, పంచాయతీ వ్యవస్థను రేవంత్‌రెడ్డి సర్కారు నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా జేబుల్లోంచి ఖర్చుపెట్టుకుని పనిచేస్తున్నారని తెలిపారు. సొమ్ము కేంద్రానిది అయితే ఇందిరమ్మ ఇండ్లు అని పేరు పెట్టారనీ, గ్రామసభలు పెట్టకుండా కాంగ్రెస్ నాయకులు చెప్పిన వాళ్లకే ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా ఇండ్లను పంపిణీ చేయడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోందనీ, ఆ కమిటీలు చెల్లుబాటు కావని చెప్పారు. వాటిపై త్వరలో సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్తామన్నారు. కేసీఆర్ మాదిరిగానే రేవంత్‌రెడ్డి కూడా ఆంధ్రా కంపెనీలకే కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని ఆరోపించారు.

చీకట్లు పోయి ప్రజాపాలనలో వెలుగులు

- రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు : సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో పదేండ్ల విధ్వంసపు పాలనలోని చీకట్లు తొలగిపోయాయనీ, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజాపాలనలో వెలుగులు విరజిమ్ముతున్నాయని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగను రాష్ట్ర ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలనీ, వారి జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పర్యావరణానికి హాని కలిగించకుండా చిన్నా పెద్దలందరూ పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి దీపావళి పండుగ ప్రతీక అని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అమావాస్య చీకటిలో దీపాల వెలుగులు విరజిమ్ముతున్నట్టే ఈ దీపావళి పండుగ అందరి జీవితాల్లోనూ నవ్య కాంతులు వెలుగొందాలని ఆకాంక్షించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కూడా రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

మనిషి తనలోని మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞాన దీపాలను వెలిగించుకోవాలనే తాత్వికతను దీపావళి పండుగ అందిస్తుందని మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు(కేసీఆర్) పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పదేండ్లుగా అలుముకున్న చీకట్లను ఆరు గ్యారెంటీలనే దీపాలను వెలిగించి ప్రతి ఇంటిలోనూ, ప్రతి కుటుంబంలోనూ సంక్షేమ వెలుగులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో అందిస్తున్నదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి కానుకగా గూడులేని ప్రతి పేదవానికీ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షలను అందించబోతున్నదని తెలిపారు. సామాజిక న్యాయం సాధించేందుకు కులగణనను చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ మహిళా డెయిరీతో మహిళలకు ఆర్థిక స్వావలంబన సాధించేలా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఒక దీపం మరో దీపాన్ని వెలిగించినట్టుగానే ఒకరికొకరు చేయూతగా నిలిచి ప్రజాప్రభుత్వ లక్ష్యమైన సకల జనుల సంక్షేమానికి, తెలంగాణ ప్రగతికి పాటుపడాలని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) పిలుపునిచ్చారు. దీపావళి పండుగ భారతీయ సంస్కృతికి ప్రతిబింబమనీ, హిందూవులకు అతి పవిత్రమైన పండుగ అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పర్యావరణ హితంగా పండుగ జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరామ్ పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సంతోషకరమైన దీపావళి సందర్భంగా తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రకటించారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. 'ఈ దీపాల పండుగ చెడుపై ధర్మం సాధించిన విజయాన్ని సూచిస్తుంది. దీపావళి దురాచారాలను జయించి, శాంతి, సామరస్యం, మత సామరస్యంతో కూడిన సమాజాన్ని నిర్మించడానికి స్ఫూర్తినిస్తుందని ఆకాంక్షిస్తున్నాను. నిర్భర్ భారత్ స్ఫూర్తితో స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేయాలి. స్వదేశీ తయారీదారుల జీవితాల్లో వెలుగులు నింపాలి' అని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-గణపురం/భూపాలపల్లి టౌన్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడమే తన ధ్యేయమని వరంగల్-నల్లగొండ-ఖమ్మం ఉపాధ్యాయ టీఎస్ యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని మోడల్ స్కూల్, కేజీబీవీ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి తనకు ఓటు వేసి ఆదరించాలని అభ్యర్థించారు. అలాగే భూపాలపల్లి మండలంలోని ఎస్ఎం కొత్తపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యావ్యవస్థ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆరేండ్లుగా నిరంతరం ప్రభుత్వంతో పోరాడి సాధించానని అన్నారు. మరోసారి అవకాశం ఇచ్చి గెలిపిస్తే మరింత శ్రమించి ఉపాధ్యాయుల పక్షాన పోరాడుతానని హామీ ఇచ్చారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే ఒక్క డీఏ ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశకు గురిచేసిందని అన్నారు. మిగతా డీఏలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీఓ 317తో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను తిరిగి స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతనం అమలు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నక్క తిరుపతి, శనిగరపు రమేష్, రాష్ట్ర కార్యదర్శి రంజిత్, మండల అధ్యక్ష కార్యదర్శులు గోసుకుల వీరన్న, పరికి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు తోట రమ, జిల్లా నాయకులు రాజేందర్, రామయ్య, కన్నయ్య, కుమారస్వామి, రఫీ పాషా, రఘుపతిరెడ్డి, గొప్ప సమ్మారావు ఉన్నారు.

నవజీవన్ ఢీకొని తండ్రి, కూతురు మృతి

నవతెలంగాణ- మధిర

రైలు దిగి పట్టాలు దాటుతున్న క్రమంలో వేగంగా వచ్చిన నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో తండ్రి కూతురు అక్కడికక్కడే మృతి చెందిన ప్రమాద సంఘటన మధిరలో బుధవారం చోటుచేసుకుంది. రైల్వే జి ఆర్ పి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధిర మండలం మల్లారం గ్రామానికి చెందిన కొంగర కేశవరావు (52) తన కూతురు ఇదే మండలం, ఖమ్మంపాడు గ్రామానికి చెందిన నూకారపు సరిత (28) తో కలిసి విజయవాడలో ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకొని తిరిగి మధిరకు చేరుకున్నారు. విజయవాడ నుండి ఇంటర్సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ లో మధిరకు వచ్చినట్లు తెలిసింది. వీరు ట్రైన్ దిగి మల్లారం వెళ్లేందుకుగాను రైల్వే ట్రాక్ ను దాటి వెళుతున్న క్రమంలో విజయవాడ నుండి అహ్మదాబాద్ వెళ్తున్న నవజీవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రీ కూతురు ఇరువురు అక్కడికక్కడే మృత్యువాత పడగా, మృతురాలు సరిత కుమారుడిగా ఉన్న పదేళ్ల బాబు పట్టాలు దాటి ప్రాణాలు దక్కించుకున్నట్లు ప్రమాద సంఘటనను చూసిన ప్రయాణికులు చెప్పినట్లు జి ఆర్ పి పోలీసులు తెలిపారు. విషయాన్ని గుర్తించి తక్షణమే ప్రమాద సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలకు పంచనామ నిర్వహించి మధిర ప్రభుత్వ ఆసుపత్రికి శవ పంచనామ నిమిత్తం తరలించినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి భాస్కరరావు తెలిపారు. మృతులు స్థానికులుగా గుర్తించడంతో వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడం జరిగిందని జి ఆర్ పి ఎస్సై తెలిపారు. అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకొని వస్తూ ప్రమాదంలో తండ్రి కూతురు మృతి చెందడం తో అటు మల్లారం ఇటు ఖమ్మంపాడు గ్రామాల్లో నీ వారి కుటుంబాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి.

దిగిరానంటున్న ధరలు (మొదటిపేజీ తరువాయి)

ధరలు కూడా దిగేదేలే అంటూ మొండికేస్తున్నాయి. వీటిలో వంట నూనె ఒకటి. గత మూడు నెలల కాలంలో ముడి పామాయిల్ ధరలు 45 శాతానికి పైగా పెరిగాయి. వంట నూనెల ధరల పెరుగుదలకు ఇది కూడా పాక్షికంగా దోహదపడుతోంది. ముడి పామాయిల్‌ను ప్రాసెస్ చేసిన ఆహార వస్తువులకే కాకుండా సబ్బులు, సౌందర్య సాధనాల తయారీలోనూ వినియోగిస్తారు. ధరల పెంపు భారాన్ని కంపెనీలు నిస్సహాయులైన వినియోగదారుల పైనే మోపుతున్నాయి. వారికి ఊరట కలిగించాల్సిన ప్రభుత్వం బడా కంపెనీల లాభార్జనకు నిస్సిగ్గుగా సాయపడుతోంది.

ఔషధ ధరలూ పైపైకి...

ఇదిలావుంటే కేంద్ర ప్రభుత్వం కొన్ని అత్యవసర ఔషధాల ధరలపై పరిమితిని యాభై శాతం పెంచేసింది. దీంతో ఆస్థమా, టీబీ, తలసేమియా, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్లకు ఉపయోగించే మందుల ధరలపై ప్రభావం పడింది. ధరలు పెంచకపోతే ఔషధ తయారీ కంపెనీలు ఈ మందులను ఉత్పత్తి చేయలేవంటూ ప్రభుత్వమే వాదించడం శోచనీయం.

'పెట్రోలియం' వడ్డనలు

మరోవైపు పెట్రోలియం ఉత్పత్తులపై ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా సుంకాలు విధించడంతో ప్రజలపై పరోక్ష పన్నుల భారం పడుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుండి అంతర్జాతీయ ముడి చమురు ధరలు 18 శాతం తగ్గినప్పటికీ మోడీ ప్రభుత్వం మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను అలాగే కొనసాగిస్తోంది. 2022-23లో పెట్రోలియం ఉత్పత్తులపై వివిధ పన్నులు, సెస్సులు, రాయల్టీలు, సుంకాల రూపంలో కేంద్రం రూ.3.5 లక్షల కోట్లు దండుకుంది. నరేంద్ర మోడీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి కేవలం పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల రూపంలోనే రూ.26.74 లక్షల కోట్లు ఖజానాలో వేసుకుంది. ఈ భారం ధరలపై పలు విధాలుగా ప్రభావం చూపుతోంది. ఎందుకంటే రవాణా ఖర్చులు పెరిగిపోయాయి. ఫలితంగా ఆహారధాన్యాలు, కూరగాయల ధరలు కూడా పెరిగాయి.

ప్రభుత్వం ఏం చేయాలంటే...

ధరల నియంత్రణకు ప్రభుత్వం చేయాల్సింది ఎంతో ఉంది. వనరులను పెంచుకోవడానికి పెట్రోలియం ఉత్పత్తులపై పన్ను విధించడం వంటి దారుణమైన చర్యలకు స్వస్తి చెప్పి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరచాలి. దీనివల్ల బహిరంగ మార్కెట్‌లో ధరలు అదుపులో ఉంటాయి. ముఖ్యంగా కూరగాయలు, ఆహారధాన్యాల అక్రమ నిల్వదారులు, చీకటి వ్యాపారులను అడ్డుకోవడానికి చట్టాలను కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ రంగంలో అత్యవసర ఔషధాల ఉత్పత్తిని ప్రోత్సహించాలి. విద్య, ఆరోగ్యం వంటి సేవలు ప్రజలకు భారంగా మారుతున్న నేపథ్యంలో వాటి ప్రైవేటీకరణను నిలువరించాలి. వంటనూనెలు, పప్పులు సహా ప్రజలకు అవసరమైన ఆహార పదార్థాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. కేవలం జుమ్లాలు, ఎన్నికల ప్రచార ఆర్భాటాలు ధరలను నియంత్రించలేవన్న వాస్తవాన్ని గ్రహించి మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మీడియా అకాడమీ చైర్మెన్‌ను కలిసిన సమాచార శాఖ కమిషనర్ హరీశ్

నవతెలంగాణ-హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎస్.హరీష్ మీడియా అకాడమీ ఛైర్మెన్ కె. శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకం గా కలిశారు. బుధవారం బీఆర్‌కే భవన్‌లోని ఆయన కార్యాలయానికి జర్నలిస్టుల సంక్షేమం, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కమిషనర్‌కు చైర్మెన్ శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణహితంగా దీపావళి...

పల్లె నుంచి పట్టణం వరకు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ దీపావళికి టపాసుల మోతమోగిస్తారు. ఈ సందర్భంగా వాయు కాలుష్య స్థాయి కూడా ఏడాదికేడాదీ పెరిగిపోతున్నది. వాయు కాలుష్యం ఎంత ప్రమాదమో మన దేశ రాజధాని ఢిల్లీలో ప్రత్యక్షంగా చూశాం. టపాసుల్లో వాడే విషపూరిత రసాయనాలతో వచ్చే కాలుష్యం అనేక మందిని రోగాలబారిన పడేస్తున్నది. ఆస్తమా, ఎలర్జీ తదితర వ్యాధులున్న వారు పరిస్థితి చెప్పనే అక్కరలేదు. అందుకే దీపావళిని పర్యావరణహితంగా జరుపుకుందాం. మనల్ని, మూగజీవాలను, పర్యావరణాన్ని కాపాడుకుందాం. ఇక వాయు కాలుష్యం నుంచి మనం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఒకసారి పరిశీలిద్దాం.

దీపావళి రోజు వచ్చే వాయు కాలుష్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పటాకులు కాల్చడం వల్ల వచ్చే విపరీత వాయువు



నుంచి మనల్ని మనం కాపాడుకోవటానికి మాస్క్ ఉపయోగించాలి. ముఖ్యమైన పని అయితేనే ఇంటి నుండి బయటకు వెళ్లాలి.

ఇంట్లో ఎయిర్ ప్యూరిఫైయర్...

వాయు కాలుష్యం ఇంట్లోని గాలిపై కూడా ప్రభావం చూపుతుంది. ఇంటి లోపల మంచి నాణ్యమైన గాలి కోసం ఎయిర్ ప్యూరిఫైయర్‌ను ఉపయోగించండి.

మిమ్మల్ని మీరు హైడ్రేటెడ్‌గా ఉంచుకోండి

దీపావళి సందర్భంగా అధిక కాలుష్యం కారణంగా శ్వాస తీసుకోవడంలో సమస్యలు తలెత్తుతాయి. అటువంటి పరిస్థితి లో.. నీరు అధికంగా తాగాలి. దీంతో మన శరీరంలోని వ్యర్థాలు బయటకుపోతాయి. తద్వారా శ్వాస వ్యవస్థ సరిగ్గా పనిచేస్తుంది. నీరు తాగటంవల్ల మీ శరీరం హైడ్రేట్‌గానూ ఉంటుంది.

రోగనిరోధక శక్తిని జాగ్రత్తగా చూసుకోండి:

కాలుష్యం ప్రభావాలను నివారించడానికి.. మీ రోగనిరోధక శక్తిపై ప్రత్యేక శ్రద్ధ వహించండి. అల్లం, పసుపు, తేనె, సిట్రస్ పండ్లను తీసుకోవాలి. వాటిలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి.. ఇవి మన శరీరంలో రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి.

తీయని వేడుక

అందరూ ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండుగ దీపావళి. ఈ పండుగంటే ముందుగా గుర్తుకొచ్చేది టపాసుల మోత, తీపి వంటకాల ఘుమఘుమలు. ఈ పండుగకు స్వీట్స్‌ను ఎక్కువగా చేసుకుంటారు. ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు. ఇంట్లో వారి కోసం ప్రత్యేకంగా ట్రెడీషనల్ స్వీట్స్ చేస్తారు. అయితే కొన్ని ఫేమస్ స్వీట్స్‌ను ఇంట్లో చాలా ఈజీగా చేసుకోవచ్చు. ఈ దీపావళికి తక్కువ సమయంలో చేసుకునే కొన్ని తీపి వంటకాల గురించి నేటి మానవిలో...



ఖర్జూర పాయసం

కావలసిన పదార్థాలు :
ఖర్జూరాలు - పదిహేను, బాదం పప్పులు - గుప్పెడు, పాలు - మూడు కప్పులు, చక్కెర - రెండు స్పూన్లు, యాలకుల పొడి - అర స్పూను, పిస్తాలు - గుప్పెడు,

తయారీ విధానం :
ఖర్జూరాల్లోంచి విత్తనాలు తీసి సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. అలాగే పిస్తాలు, బాదం పప్పులు కూడా వేసి సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో పాలు వేసి వేడి చేయాలి. ఆ వేడి పాలలోనే సన్నగా తరిగిన ఖర్జూరాలు, పిస్తా, బాదం పప్పులను వేసి కాసేపు మరగనివ్వాలి. ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి వీటిని బాగా నాననివ్వాలి. ఈ లోపు స్టవ్ మీద



చిన్న కళాయి పెట్టి నెయ్యి వేయాలి. ఆ నెయ్యిలో బాదం, కొన్ని పిస్తాలను రంగు మారేవరకు వేయించి తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు అదే గిన్నెలో మూడు కప్పుల పాలను వేసి మరిగించాలి. పాలు మరిగి కాస్త చిక్కబడే వరకు అలా ఉంచాలి. తర్వాత నానబెట్టిన డ్రై ఫ్రూట్స్ తో పాటు పాలను కూడా అందులో వేసి కలుపుకోవాలి. దీన్ని మెత్తగా ఉడికించుకోవాలి. చక్కెరను కూడా వేసి బాగా కలుపుకోవాలి. యాలకుల పొడిని కూడా జోడించాలి. ఇప్పుడు ముందుగా వేయించుకున్న బాదం తరుగు, పిస్తా తరుగును పైన చల్లుకొని స్టవ్ ఆఫ్ చేయాలి. అంతే టేస్టీ ఖర్జూర పాయసం రెడీ అయినట్టే. ఇది ఆరోగ్యం కూడా.

జీడిపప్పు హల్వా

కావలసిన పదార్థాలు:
జీడిపప్పు - ఒక కప్పు, పాలు - రెండు కప్పులు, పంచదార - ఒక కప్పు, యాలుకలు - 2-3, నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం: ముందుగా జీడిపప్పును ఒక నాన్-స్టిక్ పాన్‌లో వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చే వరకు వేయించుకోవాలి. వేయించిన జీడిపప్పును మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఒక పాత్రలో పాలు పోసి బాగా మరిగించాలి. పాలు మరిగించిన తర్వాత పంచదార వేసి బాగా కలపాలి. పంచదార కరిగిన తర్వాత జీడిపప్పు పొడిని వేసి కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమాన్ని



అడుగంటకుండా బాగా కలుపుతూ గట్టిపడే వరకు ఉడికించాలి. చివరగా ఏలకుల పొడి, బాగా కలుపుకోవాలి. హల్వా గట్టిపడిన తర్వాత గిన్నెలోకి తీసి వడ్డించాలి.

మైసూర్ పాక్

మైసూర్ పాక్‌ను ఒక్కొక్కరు ఒక్కోలా చేస్తారు. ఇది ఒక వెరైటీ మైసూర్ పాక్. అదేంటంటే ముందుగా స్టౌవ్ వెలిగించి దానిలో నెయ్యి వేయాలి. అది వేడి అయిన తర్వాత శనగపిండి వేసి.. మంచి వాసన వచ్చే వరకు వేయించుకోవాలి. ఇలా చేయడం వల్ల పిండిలోని పచ్చి వాసన



పోతుంది. ఇప్పుడు దానిలో పంచదార, యాలకుల పొడి వేసుకుని కలుపుకోవాలి. ఇప్పుడు కొద్ది కొద్దిగా నీరు వేసుకుంటూ.. పిండి ముద్దలు లేకుండా కలుపుకోవాలి. తర్వాత పిండి స్మూత్‌గా, క్రీమీగా మారుతుంది. అప్పుడు స్టౌవ్ ఆపేసి.. నెయ్యిని రాసిన ప్లేట్‌లో ఈ పిండిని వేసి.. పరచుకోవాలి. నచ్చిన షేప్‌లలో కట్ చేసుకోవాలి. అంతే టేస్టీ మైసూర్ పాక్ రెడీ.

టపాసులతో జర జాగ్రత్త.....

బాణసంచా కాల్చడం వల్ల కాలుష్యం చాలా ఎక్కువగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని పరిమిత సంఖ్యలో టపాసులు కాల్చాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు తప్పనిసరిగా వారి పక్కనే ఉండాలి. అంతేకాదు, వారికి రక్షణ కవచాలు ధరింపజేయాలి. లేకుంటే టపాసులు కాల్చే సమయంలో నిప్పురవ్వలు మీదపడి పలు ప్రమాదాలు జరగొచ్చు. ఈ జాగ్రత్తలు పాటిద్దాం...



- ఎట్టిపరిస్థితుల్లో చేతిలో పట్టుకొని టపాకాయలను వెలిగించొద్దు.
- వాటిపై వంగి టపాకాయలను వెలిగించొద్దు.. వెలగని టపాకాయల దగ్గరకు వెంటనే వెళ్లకుండా కొంతసేపు ఆగి వెళ్లాలి.
- సీసా, రేకు డబ్బా, బోర్లించిన కుండవంటి పాత్రల్లో పెట్టి టపాకాయలను వెలిగించవద్దు. అలా చేస్తే ప్రమాదం భారినపడే అవకాశం ఎక్కువ.
- క్రాకర్స్ కాల్చే సమయంలో సింథటిక్, వదులుగా ఉన్న దుస్తులు కాకుండా మందంగా ఉన్న నూలు దుస్తులను మాత్రమే ధరించండి.
- గాలులు ఎక్కువగా ఉంటే బాణసంచా కాల్చవద్దు. అలాచేయడం వల్ల గాలికి నిప్పురవ్వలు మీ మీదపడటం లేదా పక్కవారిమీద పడటం జరిగి గాయాలయ్యే అవకాశాలు ఎక్కువ.
- బాణసంచా కాల్చే సమయంలో కంటికి రక్షణగా కళ్లద్దాలను ధరించాలి.
- అనుకోని పరిస్థితుల్లో బాణసంచా పేల్చే సమయంలో గాయపడితే కాలినచోట క్రీమ్, ఆయింట్ మెంట్ , నూనె పూయకండి.. వెంటనే వైద్య సహాయం తీసుకొనేలా చర్యలు తీసుకోండి.
- దగ్గరలో నీటిని అందుబాటులో ఉంచుకొని టపాసులు పేల్చాలి. ఒకవేళ చర్మంపై నిప్పురవ్వలు పడి కాలినట్లయితే, కాలినచోట ఎక్కువ నీరు పోయాలి. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. సొంత వైద్యం వద్దు.
- ఒకవేళ తీవ్రమైన కాలిన గాయాలైతే.. ఆ వ్యక్తిని ఒక శుభ్రమైన దుప్పటిలో చుట్టి వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

మోకిల పీఎస్‌లో కేటీఆర్ బావమరిది

- విచారణకు రాజ్ పాకాల హాజరు

నవతెలంగాణ-శంకర్‌పల్లి

జన్వాడ ఫామ్‌హౌస్ కేసుకు సంబంధించిన కేసులో మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల మోకిల పోలీసుల ఎదుట బుధవారం హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల పాటు పోలీస్ స్టేషన్‌లో ఆయన్ను విచారించారు. అనంతరం అక్కడి నుంచి రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి అక్కడ గంటన్నర పాటు సోదాలు నిర్వహించారు. అక్కడ ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో తిరిగి మోకిలా పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. అంతకుముందు రాజ్ పాకాల మోకిలా పోలీస్ స్టేషన్‌కు వస్తున్నారని తెలియడంతో శంకర్‌పల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున స్టేషన్‌కు తరలివచ్చారు.

నామినేషన్లు ముగిసినా

మహా ఎన్నికల్లో స్పష్టత లేదు

ముంబయి : మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో బీజేపీ 148 స్థానాలకు పోటీ చేస్తోంది. అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో ఉన్న అర డజను ప్రధాన రాజకీయ పార్టీల్లో ఎక్కువ స్థానాలకు పోటీ చేస్తోంది ఆ పార్టీయే. రెండో స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 103 మంది అభ్యర్థులను బరిలో నిలిపింది. నామినేషన్ల దాఖలుకు మంగళవారమే గడువు ముగిసినప్పటికీ ప్రత్యర్థి శిబిరాల్లో కొన్ని స్థానాలపై ఇప్పటికీ స్పష్టత రావడం లేదు. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో కాంగ్రెస్ 103, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన 89, శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ 87 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇక పాలక పక్షంలో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 80 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీ 53 స్థానాలలో పోటీ చేస్తోంది.

ప్రతిపక్ష ఎంవీఏ కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాలకు ఆరు స్థానాలు కేటాయించారు. మూడు శాసనసభ స్థానాలపై అవగాహన కుదరలేదు. నవంబర్ 20న జరిగే ఎన్నికల కోసం 7,995 మంది అభ్యర్థులు 10,905 నామినేషన్లు దాఖలు చేశారు.

టీటీడీ ఛైర్మెన్‌గా బీఆర్ నాయుడు

తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు

అమరావతి : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి నూతన ఛైర్మెన్‌గా బీఆర్ నాయుడు నియమితులయ్యారు. 24 మంది సభ్యులతో టీటీడీ పాలకమండలి ఏర్పాటు కానుంది. వీరిలో తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు లభించింది. ఈ మేరకు టీటీడీ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

టీటీడీ బోర్డు సభ్యులు వీరే..

- జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట ఎమ్మెల్యే)
- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి (కోవూరు ఎమ్మెల్యే)
- ఎం.ఎస్.రాజు (మడకశిర ఎమ్మెల్యే)
- పనబాక లక్ష్మి (కేంద్ర మాజీమంత్రి)
- జాస్తి పూర్ణ సాంబశివరావు
- నన్నూరి నర్సిరెడ్డి (తెలంగాణ)
- శ్రీ సదాశివరావు నన్నపనేని
- కృష్ణమూర్తి (తమిళనాడు) కోటేశ్వరరావు
- మల్లెల రాజశేఖర్ గౌడ్
- జంగా కృష్ణమూర్తి
- దర్శన్. ఆర్.ఎన్ (కర్నాటక)
- జస్టిస్ హెచ్ఎల్ దత్ (కర్నాటక) శాంతారామ్
- పి.రామ్మూర్తి (తమిళనాడు)
- జానకీ దేవి తమ్మిశెట్టి
- బూంగునూరు మహేందర్ రెడ్డి (తెలంగాణ)
- అనుగోలు రంగశ్రీ (తెలంగాణ)
- బూరగాపు ఆనందసాయి (తెలంగాణ)
- సుచిత్ర ఎల్ల (తెలంగాణ) నరేశ్‌కుమార్ (కర్నాటక)
- డా.అదిత్ దేశాయ్ (గుజరాత్)
- సౌరభ్ హెచ్ బోరా(మహారాష్ట్ర)

పట్టణీకరణ పేరుతో పల్లెలు మాయం!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి నిధులు అధికంగా రావడంతో పాటు అమృత్ పథకం, నాబార్డు నుంచి అధిక నిధులు వస్తాయని అధికారుల అంచనా. పట్టణాలతో పాటు సమానంగా ఆ గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వ చెబుతోంది. గృహనిర్మాణాల కోసం కేంద్రం ఇచ్చే నిధులు అధికమొత్తంలో అందుతాయని చెబుతున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు రహదారుల లింకులు కలుస్తాయి. గ్రామాల్లో చేపట్టబోయే కొత్త నిర్మాణాల వల్ల ఆదాయం, వివిధ రకాల పన్నుల ఆదాయం పంచాయతీలకు లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. 540 వరకు ఇప్పుడున్న మండల కేంద్రాలను ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి చేసుకునేందుకు యూడీఏలు దోహదపడతాయనేది వారి వాదన. పన్నులు పెరుగుతాయనేది అపోహ మాత్రమేనని అంటున్నారు.

గ్రామాల అస్తిత్వం పోతుంది: కృష్ణ, కులబేగూరు, మాజీ వార్డుమెంబర్

గ్రామీణ ప్రాంతాల అస్తిత్వాన్ని దెబ్బతీయడం సరికాదు. కార్పొరేషన్ హోదా వస్తే పట్టణ కేంద్రం తప్ప విలీన గ్రామాల అభివృద్ధి పట్టదు. ఇప్పటికే విలీనమైన గ్రామాల్లో పాత సిబ్బందితోనే పారిశుద్ధ్యం, ఇతర పనులు చేయిస్తున్నారు. పన్నుల్ని మాత్రం పెంచి వసూలు చేస్తున్నా జాతీయ ఉపాధి హామీ పనులు పోతే పేదలకు ఉపాధి ఉండదు. ప్రజాభిప్రాయానికి భిన్నంగా నిర్ణయం తీసుకోవద్దు.

భయాందోళనలు..

(మొదటిపేజీ తరువాయి)

అయిన తర్వాత నిధులు వచ్చినా అవి పంచాయతీల ఖాతాల్లోనే ఉండిపోయాయి. భవిష్యత్తులో అథారిటీలో కలిసే గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం పనులు కొనసాగుతాయా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ గ్రామాలనే అభివృద్ధి చేస్తే.. జిల్లాలోని మిగతా గ్రామాల అభివృద్ధి మాటేంటి అన్న ప్రశ్న ఉదయిస్తోంది. పన్నులు కూడా భారీగా పెరిగితే తాము ఎక్కడనుంచి చెల్లించాలని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. పన్నులు పెరగవని చెబుతున్నా.. అమీన్‌పూర్ వంటి మున్సిపాలిటీల్లో కలిపిన గ్రామాల్లో పెంచిన పన్నులను చూపెడుతున్నారు. స్థానిక సంస్థలు నిర్వీర్యం అయ్యే ప్రమాదమూ లేకపోలేదనే భయాందోళనలు ఉన్నాయి. ప్రజాభిప్రాయాలకు భిన్నంగా రాజకీయ ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్ ఇమేజీ కోసమే ఇదంతా జరుగుతున్నదన్న చర్చ నడుస్తోంది.

ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ఐదు డీఏలు బకాయిలున్న విషయం తెలిసిందే. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ఒక డీఏను ఇవ్వాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉద్యోగుల బేసిక్ పే 22.75 శాతం నుంచి 26.39 శాతానికి పెరిగిందని వివరించారు. ప్రకటించిన డీఏ 2022, జులై ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని ప్రకటించారు. నవంబరు జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపులు చేయనున్నట్టు తెలిపారు. 2022, జులై ఒకటి నుంచి ఈ ఏడాది అక్టోబర్ 31 వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నట్టు స్పష్టం చేశారు. వచ్చేనెల నుంచి పెరిగిన డీఏను జీతంతోపాటు చెల్లిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోపు ఉద్యోగ విరమణ పొందే ఉద్యోగుల డీఏ బకాయిలు 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ఉత్తర్వుల్లో తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10 శాతం ప్రాన్ ఖాతాకు జమ చేస్తామని పేర్కొన్నారు. 90 శాతం వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు వివరించారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైం కంటింజెంట్ ఉద్యోగులకు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేపడతామని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు డేర్‌నెస్ రిలీఫ్ (డీఆర్)ను ప్రకటిస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. వారికీ 2022, జులై ఒకటి నుంచి వర్తిస్తుందని స్పష్టం చేశారు. డీఆర్ బకాయిలు వచ్చే ఏడాది జనవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రకటించారు.

సీఎంకు ధన్యవాదాలు : టీఎన్జీవో

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ డీఏ విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ ధన్యవాదాలు తెలిపారు.

17 వాయిదాల్లో చెల్లించడం సరికాదు : సీపీఎస్‌టీఈఏ

ఉద్యోగులకు డీఏ ప్రకటించడం పట్ల సీపీఎస్‌టీఈఏ రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్ ధన్యవాదాలు తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 17 వాయిదాల్లో చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సరైంది కాదని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఒకేసారి చెల్లించాలని కోరారు.

మయోనైజ్‌పై నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

గురయిన ఘటనపై మంత్రి ఆరా తీశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే విధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ రకాల ఆహార పదార్థాలతో కలిపి తినే మయోనైజ్‌ను కల్తీ ఎగ్స్‌తో, ఉడకబెట్టని ఎగ్స్‌తో తయారు చేస్తున్నారనీ, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని మంత్రికి అధికారులు వివరించారు. మయోనైజ్ క్వాలిటీ, అది తిన్న తర్వాత కలిగిన దుష్పరిణామాలపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కేరళలో ఈ తరహా మయోనైజ్ తయారీని అక్కడి ప్రభుత్వం నిషేధించిందనీ, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మన రాష్ట్రంలోనూ నిషేధం విధించాలని అధికారులు మంత్రిని కోరారు. ఈ అంశంపై పలువురు డాక్టర్లు, ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులతో చర్చించిన మంత్రి, మయోనైజ్‌పై నిషేధం విధించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కర్ణన్‌కు సూచించారు.

రాష్ట్రంలో గత పదేండ్లలో హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్, హాస్టళ్ల సంఖ్య భారీగా పెరిగిందనీ, ఇందుకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ బలోపేతం కాలేదనీ, కొత్త పోస్టులు మంజూరు కాలేదని అధికారులు మంత్రికి వివరించారు. ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో ముడిపడి ఉన్న డ్రగ్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ విషయంలో రాజీ పడేది లేదని ఈ సందర్భంగా మంత్రి వ్యాఖ్యానించారు. ఫుడ్ సేఫ్టీలో ముందున్న రాష్ట్రాలు, దేశాల్లో అవలంభిస్తున్న పద్ధతులపై అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. అవసరమైన కొత్త పోస్టులను మంజూరు చేసి, భర్తీ చేస్తామని తెలిపారు. కొత్తగా మూడు ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి తెలిపారు. 5 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. సంవత్సరానికి సుమారు 24 వేల నమూనాలు పరీక్షించేలా ల్యాబులను బలోపేతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ మొత్తాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్లలో డ్రగ్ అథారిటీ, ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆఫీసులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ఫుడ్, డ్రగ్స్‌కు సంబంధించిన ఫిర్యాదులు ఎవరికి, ఎక్కడ చేయాలో ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. ఆహారం కల్తీ చేయాలంటే భయపడేలా కల్తీగాళ్లపై చర్యలు ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు

దీపావళి కానుక

- డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన ప్రభుత్వం
- దస్త్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకం
- 7.65 లక్షల మందికి ప్రయోజనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ సంక్షేమ హాస్టళ్లతోపాటు తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఆర్ఈఐఎస్)లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలంటూ అధికారుల కమిటీ చేసిన సిఫారసులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదించారు. చార్జీలను పెంచుతూ తయారు చేసిన దస్త్రంపై బుధవారం ఆయన సంతకం చేశారు. ఈ నిర్ణయం వల్ల సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

డైట్ చార్జీల పెంపు

- మూడు నుంచి ఏడో తరగతి వరకు ఇప్పటి వరకు రూ.950గా ఉన్న డైట్‌చార్జీని రూ.1,330కి పెంచిన ప్రభుత్వం.
- మూడు నుంచి ఏడో తరగతి వరకు రాష్ట్రంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 2,77,877 మంది.
- ఎనిమిది నుంచి పదో తరగతి వరకు ఇప్పటి వరకు రూ.1,100గా ఉన్న డైట్‌చార్జీని రూ.1,540కి పెంచిన ప్రభుత్వం.
- ఎనిమిది నుంచి పదో తరగతి వరకు రాష్ట్రంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 2,59,328 మంది
- ఇంటర్ నుంచి పీజీ వరకు ఇప్పటి వరకు రూ.1,500గా ఉన్న డైట్‌చార్జీని రూ.2,100కి పెంచిన ప్రభుత్వం.
- ఇంటర్ నుంచి పీజీ వరకు రాష్ట్రంలోని వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 2,28,500 మంది
- రాష్ట్రంలోని మొత్తం వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 7,65,705 మంది

కాస్మోటిక్ చార్జీల పెంపు

- మూడు నుంచి ఏడో తరగతి వరకు విద్యార్థినులకు ఇప్పటి వరకు రూ.55గా ఉన్న కాస్మోటిక్ చార్జీలను రూ.175కు పెంచింది.
- ఎనిమిది నుంచి పదో తరగతి 11 ఏండ్లపైన ఉన్న విద్యార్థినులకు ఇప్పటి వరకు రూ.75గా ఉన్న కాస్మోటిక్ చార్జీలను రూ.275కు పెంచిన ప్రభుత్వం.
- మూడు నుంచి ఏడో తరగతి వరకు ఉన్న విద్యార్థులకు ఇప్పటి వరకు ఉన్న రూ.62 నుంచి రూ.150కు పెంపు.
- ఎనిమిది నుంచి పదో తరగతి వరకు 11 ఏండ్లపైబడిన విద్యార్థులకు ఇప్పటి వరకు రూ.62గా ఉన్న కాస్మోటిక్ చార్జీలను రూ.200కు పెంచిన ప్రభుత్వం

వనపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ సస్పెండ్

కమిషనర్ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వనపర్తి జిల్లా జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభు వినయ్‌ను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నాలుగు నెలలుగా విధులకు హాజరు కాకుండా, ఫైళ్లను ఇంటి వద్దకే తెప్పించుకుని సంతకాలు చేస్తున్నాడనీ, సర్వీస్ రిజిస్టర్లో పుట్టినతేదీ మార్చుకుని, చట్టవిరుద్ధంగా సర్వీస్ పొడిగించుకున్నారంటూ రాచర్ల గంగాధర్ అనే వ్యక్తి ఇటీవల ప్రభువినయ్‌పై ఫిర్యాదు చేశారు. ఆయనపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిన అధికారులు బుధవారం సస్పెండ్ చేశారు. జిల్లా అదనపు సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

నందమూరి వంశంలో కొత్త శకం ప్రారంభం


అశ్వినిదత్, వైవిఎస్ చౌదరి, కె.రాఘవేంద్రరావు

తెలుగు చిత్రసీమలో విశిష్టమైన నందమూరి వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, దివంగత జానకీ రామ్ తనయుడు నందమూరి తారక రామారావు హీరోగా వెండితెరకు పరిచయం అవుతున్నారు. వైవిఎస్ చౌదరి రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని న్యూ టాలెంట్ రోర్స్ ఏ బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మించనున్నారు. బుధవారం నందమూరి తారక రామారావు గ్రేస్‌ఫుల్ ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ని లాంచ్ చేశారు. ఈ వీడియో వైవిఎస్ చౌదరి క్రియేటివ్ విజన్, యంగ్ హీరోకి తనపై ఉన్న కాన్ఫిడెన్స్‌ని ప్రజెంట్ చేస్తోంది.

ఈ చిత్రంలో కూచిపూడి నృత్యకారిణి, తెలుగు నటి వీణా రావు కథానాయికగా నటిస్తున్నారు. ఫస్ట్ దర్శన్ ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్ వైవిఎస్ చౌదరి మాట్లాడుతూ, 'నేను రాసుకున్న కథని మోయగలిగి, ప్రజల్లోకి తీసుకెళ్లగలిగే దమ్మున్న క్యారెక్టర్‌ని పోషించగల సత్తా ఉన్న ప్రధాన సూత్రధారి అయిన హీరోని ఈ వేడుక ద్వారా మీ అందరికీ పరిచయం చేయడం చాలా ఆనందంగా ఉంది' అని తెలిపారు. 'నందమూరి వంశంలో కొత్త శకం ప్రారంభమైంది. ఈ పిక్చర్‌తో నిర్మాత, దర్శకుడు, కొత్తగా పరిచయం అవుతున్న హీరో అఖండ విజయం సాధించాలని ఆశిస్తున్నాను' అని దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు చెప్పారు. నిర్మాత అశ్విని దత్ మాట్లాడుతూ, 'మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు' అని అన్నారు.

నవచిత్రం

సరికొత్త అనుభూతినిచ్చే కమర్షియల్ సినిమా


నాగవంశీ

వైవిధ్యభరిత చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచిన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ 'లక్కీ భాస్కర్' అనే మరో డిఫరెంట్ చిత్రంతో అలరించడానికి సిద్ధమైంది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన ఈ చిత్రానికి వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై తెరకెక్కిన ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. దీపావళి కానుకగా నేడు (గురువారం) ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత సూర్యదేవర నాగవంశీ మీడియాతో మాట్లాడుతూ, 'మంచి సినిమా చేశామనే సంతృప్తిని కలిగించిన చిత్రమిది. ఈ సినిమాపై ఎంతో నమ్మకంగా ఉన్నాం. అందుకే ప్రీమియర్ షోలు వేశాం. ప్రీమియర్లకు మంచి స్పందన వస్తుండటంతో షోల సంఖ్య కూడా పెంచాం. మనిషి డబ్బు సంపాదించాలనుకున్నప్పుడు ఎంత దూరమైనా వెళ్తాడు అనే కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. బ్యాంకింగ్ నేపథ్యంలో థ్రిల్లర్ జోనర్‌లో ఉండే ఫ్యామిలీ సినిమా ఇది. తర్వాత ఏం జరుగుతుందోననే ఆసక్తిని రేకెత్తిస్తూ నడుస్తుంది. ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్టు ఉంటుంది' అని చెప్పారు.

'క' బ్లాక్‌బస్టర్ ఖాయం : హీరో నాగచైతన్య


నాగ చైతన్య, కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా 'క'. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మించారు.

దర్శక ద్వయం సుజీత్, సందీప్ రూపొందించిన ఈ సినిమా నేడు (గురువారం) రిలీజ్ కానుంది.

ఈ సినిమాను తెలుగులో నిర్మాత వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫర్ ఫిలింస్ పై రిలీజ్ చేస్తున్నారు.

హీరో నాగ చైతన్య ముఖ్య అతిథిగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ప్రొడ్యూసర్ చింతా గోపాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, 'మా సినిమా ప్రేక్షకుల్ని థ్రిల్ చేస్తుంది. ఓ మంచి సినిమా చేశామని సంతోషంగా ఉంది. దీపావళికి సకుటుంబంగా మా సినిమాని చూసి ఆనందించండి' అని తెలిపారు. 'ఈ సినిమా బ్యాడ్ మూవీ అని మీలో ఎవరైనా అంటే నేను సినిమాలు చేయడం మానేస్తా. ఎవరెవరికి ఎంత నచ్చుతుందో తెలియదు గానీ మంచి ప్రయత్నం అని మాత్రం అంటారు. నేను ప్రామీస్ చేస్తున్నా. థియేటర్స్‌కు వెళ్లండి. ఈ సినిమా మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేస్తుంది' అని హీరో కిరణ్ అబ్బవరం చెప్పారు.

హీరో నాగ చైతన్య మాట్లాడుతూ,'కిరణ్ అబ్బవరం జర్నీకి నేను నెంబర్ వన్ ఫ్యాన్‌ని. కిరణ్ సక్సెస్ స్టోరీ నాకే కాదు ఇండస్ట్రీకి వచ్చే ఎంతో మందికి స్ఫూర్తినిస్తుంది. ఇలాంటి హీరోలు సక్సెస్ కావాలి. జయాపజయాలు ఎవరికైనా సహజమే. కిరణ్ ధైర్యంగా ముందుకి వెళ్ళు. ట్రైలర్ చూశాను. బాగా నచ్చింది. ఈ సినిమా తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

ఆటలు

ముంబయిలో మెప్పిస్తారా?



స్వదేశంలో 12 ఏండ్లుగా, 18 టెస్టు సిరీస్‌ల్లో టీమ్ ఇండియా అజేయ ప్రస్థానానికి న్యూజిలాండ్ బ్రేక్ వేసింది. బెంగళూర్, పుణె టెస్టుల్లో అసమాన రీతిలో భారత్‌పై పైచేయి సాధించింది. భారత గడ్డపై చారిత్రక తొలి టెస్టు సిరీస్ సాధించిన న్యూజిలాండ్ ఇప్పుడు ఏకంగా క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. సొంతగడ్డపై మూడు టెస్టుల సిరీస్‌లో వైట్‌వాష్ ఎరుగని భారత్ ఇప్పుడు 0-3 ఓటమి ప్రమాదంలో పడింది!.

ఆఖరు టెస్టులో విజయంతో ఊరటతో పాటు విలువైన ఐసీసీ డబ్ల్యూటీసీ పాయింట్ల కోసం టీమ్ ఇండియా ముంబయిలో అన్ని అస్త్రాలు ప్రయోగించేందుకు సిద్ధమవుతోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి మంచి స్కోర్లతో ఫామ్‌తో, జట్టును గెలుపు బాట పట్టిస్తారనే అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. భారత్, న్యూజిలాండ్ మూడో టెస్టు మ్యాచ్ శుక్రవారం నుంచి ఆరంభం.

- వైట్‌వాష్ ప్రమాదంలో టీమ్ ఇండియా
- క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన న్యూజిలాండ్
- రేపటి నుంచి భారత్, కివీస్ మూడో టెస్టు

ఉదయం 9.30 నుంచి జియో సినిమాలో..



నవతెలంగాణ-ముంబయి

భారత్, న్యూజిలాండ్ టెస్టు సిరీస్ ఆరంభానికి ముందు ఎవరూ ఊహించని పరిస్థితులు చివరి టెస్టు ముంగిట నెలకొన్నాయి. శ్రీలంక చేతిలో దారుణ పరాజయం చవిచూసి భారత్‌లో అడుగుపెట్టిన న్యూజిలాండ్ అచ్చొచ్చిన పరిస్థితుల్లో బెంగళూర్‌లో, ఆత్మవిశ్వాసంతో పుణెలో అద్భుత విజయాలు నమోదు చేసింది. 2-0తో టెస్టు సిరీస్‌ను ఇప్పటికే కైవసం చేసుకుంది. మూడో టెస్టులో క్లీన్‌స్వీప్ లక్ష్యంగా ఆడుతుందని భావించిన టీమ్ ఇండియా.. అందుకు భిన్నంగా వైట్‌వాష్ ప్రమాదం నుంచి తప్పించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. చిన్నస్వామిలో పేస్, పుణెలో స్పిన్ మ్యాజిక్ నడువగా.. ముంబయిలో బ్యాటర్ల మెరుపులు లాంఛనమేనని తెలుస్తోంది. నవంబర్ 1 నుంచి భారత్, న్యూజిలాండ్ మూడో టెస్టు షురూ కానుంది.

బ్యాటింగ్ మెరుగయ్యేనా?

స్పిన్‌పై టీమ్ ఇండియా బ్యాటర్ల ప్రదర్శన ఆందోళనకరంగా మారింది. టాప్-7 బ్యాటర్లలో యువ క్రికెటర్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్ మినహా సీనియర్ బ్యాటర్లు అందరూ తేలిపోతున్నారు. టర్న్ పిచ్‌పై స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు ఆపసోపాలు పడుతున్నారు. లోయర్ ఆర్డర్‌లో జడేజా, అశ్విన్, అక్షర్ పటేల్‌లు స్పెషలిస్ట్ బ్యాటర్ల కంటే మెరుగ్గా స్పిన్‌పై పరుగులు రాబడుతున్నారు. కీలక ఆస్ట్రేలియా పర్యటన ముంగిట విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు స్పిన్ ఫోబియా నుంచి బయటపడాల్సి ఉంది. ముంబయిలో అంచనాలను తగినట్టు రాణిస్తేనే.. భారత్ వైట్‌వాష్ గండం నుంచి గట్టెక్కగలదు. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్ గొప్ప ఫామ్‌లో ఉన్నారు. స్పిన్, పేస్ తేడా లేకుండా పరుగుల వేటలో ఆకట్టుకుంటున్నారు. చివరి టెస్టులోనూ భారత్‌కు ఈ ముగ్గురి ప్రదర్శన కీలకం. యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ తొలిసారి సొంతగడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. వాంఖడెలో ఎన్నో సెంచరీలు బాదిన సర్ఫరాజ్.. న్యూజిలాండ్‌పై మరో మూడెంకల స్కోరు అందుకుంటాడనే అంచనాలు ఉన్నాయి. స్పిన్ విభాగంలో అశ్విన్, జడేజాలకు తోడుగా అక్షర్ పటేల్ తుది జట్టులోకి వచ్చే వీలుంది. పేస్ విభాగంలో జశ్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి లభిస్తే హర్షిత్ రానా అరంగేట్రం చేయటం లాంఛనమే. లేదంటే, మహ్మద్ సిరాజ్ స్థానంలో యువ పేసర్‌ను తుది జట్టులోకి ఎంపిక చేసే అవకాశం ఉంది.

జోరుమీదున్న న్యూజిలాండ్

శ్రీలంక చేతిలో 0-2తో సిరీస్ ఓటమి. కెప్టెన్ రాజీనామాతో కొత్త నాయకత్వం. స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ గాయంతో దూరం. ఈ పరిస్థితుల్లో భారత్‌లో అడుగుపెట్టిన న్యూజిలాండ్.. ఎవరూ ఊహించలేని చరిత్ర సృష్టించింది. బెంగళూర్ టెస్టులో గెలుపుతో 36 ఏండ్ల తర్వాత తొలిసారి భారత్‌లో టెస్టు విజయం రుచి చూసిన కివీస్.. పుణె టెస్టులో విజయంతో చారిత్రక తొలి టెస్టు సిరీస్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు వాంఖడెలో గెలుపుపై కన్నేసిన న్యూజిలాండ్ ఏకంగా క్లీన్‌స్వీప్ విజయం కోసం ఎదురుచూస్తుంది. ఇక్కడి పిచ్‌లపై కివీస్ బ్యాటర్లు మెరుగ్గా ఆడుతున్నారు. టామ్ లేథమ్, డెవాన్ కాన్వే, విల్ యంగ్ సహా రచిన్ రవీంద్ర, డార్లీ మిచెల్ నిలకడగా రాణిస్తున్నారు. పేసర్లు మాట్ హెన్రీ, టిమ్ సౌథీలకు తోడు స్పిన్నర్లు శాంట్నర్, అజాజ్ పటేల్, గ్లెన్ ఫిలిప్స్‌లు మాయ చేస్తున్నారు. బ్యాటర్లు, పేసర్లు, స్పిన్నర్లు సమిష్టిగా రాణించటం న్యూజిలాండ్ విజయాన్ని సాధ్యం చేసింది. అదే ఫార్ములాతో వాంఖడె టెస్టులోనూ న్యూజిలాండ్ బరిలోకి దిగుతోంది.

స్పిన్ సవాల్

వాంఖడె ఎర్రమట్టి పిచ్‌పై స్పిన్ సవాల్‌కు రంగం సిద్ధమైంది. భారత స్పిన్నర్ల కంటే న్యూజిలాండ్ స్పిన్నర్లు పుణెలో మెరుగైన ప్రదర్శన చేశారు. మన బ్యాటర్లు స్పిన్ పిచ్‌పై పూర్తిగా తేలిపోయారు. వాంఖడెలో భారత బ్యాటర్లతో పాటు స్పిన్నర్లు సైతం కఠిన పరీక్ష ఎదుర్కొవాల్సి ఉంది. శాంట్నర్, అజాజ్, ఫిలిప్స్‌లను భారత బ్యాటర్లు ఏ మేరకు ఎదుర్కొంటారో చూడాలి. న్యూజిలాండ్ బ్యాటింగ్ లైనప్‌ను అశ్విన్, జడేజా, అక్షర్ త్రయం తక్కువ స్కోరుకు మాయ చేయగలదా? ఆసక్తికరం. చివరగా 2021 డిసెంబర్‌లో వాంఖడెలో భారత్, న్యూజిలాండ్ ఓ టెస్టు మ్యాచ్‌లో తలపడ్డాయి. అశ్విన్ మ్యాజిక్‌తో భారత్ తిరుగులేని విజయం సాధించింది. కానీ కివీస్ స్పిన్నర్ అజాజ్ పటేల్ తొలి ఇన్నింగ్స్‌లో పది వికెట్లు సహా ఓవరాల్‌గా 14 వికెట్లతో మెరిశాడు. దీంతో ఈ ఇద్దరు స్పిన్నర్లపై నేటి మ్యాచ్‌లో ఫోకస్ నెలకొంది.

పిచ్, వాతావరణం

వాంఖడెలో ఎర్రమట్టి పిచ్ సిద్ధం చేశారు. ఎర్రమట్టి సహజంగా పేస్‌ను అనుకూలం. పిచ్ తొలి రోజు బ్యాటర్లకు.. రెండో రోజు నుంచి స్పిన్‌ను సహకరించేలా రూపకల్పన చేసినట్టు తెలుస్తోంది. మూడో రోజు నుంచి ఈ పిచ్‌పై టర్న్‌ను ఎదుర్కొవటం బ్యాటర్లకు సవాల్ కానుంది. టాస్ కీలక పాత్ర పోషించనుంది. తొలుత బ్యాటింగ్ చేసేందుకు ఇరు జట్లు మొగ్గుచూపుతున్నాయి. ముంబయి వాతావరణం ఆహ్లాదకరంగా ఉండనుంది. ఐదు రోజుల పాటు టెస్టు మ్యాచ్‌కు ఎటువంటి వర్షం సూచనలు లేవు.

తుది జట్లు (అంచనా) :

భారత్ : యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, అక్షర్ పటేల్, జశ్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రానా.

న్యూజిలాండ్ : టామ్ లేథమ్ (కెప్టెన్), డెవాన్ కాన్వే, విల్ యంగ్, రచిన్ రవీంద్ర, డార్లీ మిచెల్, టామ్ బ్లండెల్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ శాంట్నర్, టిమ్ సౌథీ, అజాజ్ పటేల్, విలియం ఓరౌర్క్.

వేలంలోకి అయ్యర్,రాహుల్

- సూపర్‌కింగ్స్‌తోనే ఎం.ఎస్ ధోని
- ఐపీఎల్ 2025 రిటెన్షన్ జాబితా



ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్ ముంగిట ఆటగాళ్ల అట్టిపెట్టుకునే జాబితాకు తుది రూపు ఇచ్చేందుకు ఫ్రాంచైజీ యాజమాన్యాలు సిద్ధమయ్యాయి. నవంబర్ లేదా డిసెంబర్‌లో జరుగనున్న ఐపీఎల్ ఆటగాళ్ల మెగా వేలానికి ముంగిట అన్ని రిటెన్షన్ జాబితాను సమర్పించాల్సి ఉంది. అక్టోబర్ 31న అట్టిపెట్టుకునే జాబితా సమర్పించేందుకు తుది గడువు. అయితే, ఇప్పటికే దాదాపుగా అన్ని జట్లు జాబితాను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. చెన్నై సూపర్‌కింగ్స్ మరోసారి ఎం.ఎస్ ధోనీని నిలుపుకోనుండగా.. కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్‌లు ఈ ఏడాది వేలంలోకి రానున్నారని సమాచారం.

కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ఐపీఎల్ టైటిల్ అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సహా ఆ జట్టు ఆల్‌రౌండర్ ఆండ్రీ రసెల్‌ను ఆ జట్టు వేలంలోకి వదిలేయనుంది. సునీల్ నరైన్, రింకూ సింగ్, హర్షిత్ రానా సహా వరుణ్ చక్రవర్తిలను అట్టిపెట్టుకోనుంది. యువ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్‌ను సైతం నైట్‌రైడర్స్ అట్టిపెట్టుకోవటం లేదు. చెన్నై సూపర్‌కింగ్స్ ఊహించినట్టుగానే ఎం.ఎస్ ధోని పేరును రిటెన్షన్ జాబితాలో చేర్చింది. రుతురాజ్ గైక్వాడ్, రవీంద్ర జడేజా, శివం దూబె, మతీశ పతిరణ, ఎం.ఎస్ ధోనిలను ఆ జట్టు అట్టిపెట్టుకోనుంది. ఎవరిని ఎంత మొత్తానికి నిలుపుకుందనే విషయం తెలియాల్సి ఉంది. లక్నో సూపర్‌జెయింట్స్‌కు మూడు సీజన్లలో సారథ్యం వహించిన కెఎల్ రాహుల్ వేలంలోకి రానున్నాడు. నికోలస్ పూరన్, మయాంక్ యాదవ్, రవి బిష్ణోయ్, మోషిన్ ఖాన్, అయుశ్ బదానిలను ఆ జట్టు అట్టిపెట్టుకోనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐదుగురు కీలక ఆటగాళ్లను అట్టిపెట్టుకోనుంది. హెన్రిచ్ క్లాసెన్ (రూ.23 కోట్లు), పాట్ కమిన్స్ (రూ. 18 కోట్లు), ట్రావిశ్ హెడ్ (రూ.14 కోట్లు), అభిషేక్ శర్మ (రూ. 14 కోట్లు), నితీశ్ కుమార్ రెడ్డి (రూ. 8 కోట్లు) సన్‌రైజర్స్ రిటెన్షన్ జాబితాలో ఉన్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ సైతం రిషబ్ పంత్‌ను వేలంలోకి వదిలే అవకాశం కనిపిస్తుంది. ముంబయి ఇండియన్స్ రోహిత్ శర్మను నిలుపుకుంటుందా? వేలంలోకి వదిలేస్తుందా? ఆసక్తికరంగా మారింది.

తమిళ్ తలైవాస్ భారీ విజయం

44-25తో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపు
ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11



నవతెలంగాణ-హైదరాబాద్: తమిళ్ తలైవాస్ సూపర్ విక్టరీ సాధించింది. గుజరాత్ జెయింట్స్‌ను 44-25తో చిత్తు చేసి ఏకంగా 19 పాయింట్ల భారీ తేడాతో తమిళ్ తలైవాస్ ఘన విజయం నమోదు చేసింది. బుధవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్ లీగ్ దశ మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ అదరగొట్టింది. సీజన్‌లో మూడో విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్ర స్థానానికి ఎగబాకింది. తలైవాస్ స్టార్ రెయిడర్ నరేందర్ 20 సార్లు కూతకెళ్లి 15 పాయింట్లు సాధించగా.. సచిన్ (5 పాయింట్లు), డిఫెండర్ నితేశ్ కుమార్ (4 పాయింట్లు), ఆమీర్ (4 పాయింట్లు) రాణించారు. గుజరాత్ జెయింట్స్ ఆటగాళ్లలో గుమన్ సింగ్ ఏడు పాయింట్లు సాధించగా, రాకేశ్ మూడు పాయింట్లతో మెరిశాడు. పీకెఎల్ 11లో నాలుగు మ్యాచుల్లో గుజరాత్ జెయింట్స్‌కు ఇది మూడో పరాజయం.

రూల్స్ ఉల్లంఘించాడు!

కిర్‌స్టన్‌పై పీసీబీ చీఫ్ నక్వీ వ్యాఖ్య



కరాచీ : దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజం గ్యారీ కిర్‌స్టన్ కాంట్రాక్టు ఒప్పందంలోని నిబంధనలను ఉల్లంఘించాడని, అగ్రిమెంట్‌ను అతడే రద్దు చేసుకున్నాడని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మోషిన్ నక్వీ అన్నారు. పాకిస్థాన్ జాతీయ జట్టు వైట్‌బాల్ ఫార్మాట్ కోచ్‌గా ఈ ఏడాది మేలో నియమితులైన గ్యారీ కిర్‌స్టన్.. సోమవారం తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. జట్టు ఎంపికలో కోచ్ అధికారాలను పీసీబీ తొలగించటం విభేధాలకు దారితీసిందని సమాచారం. గ్యారీ కిర్‌స్టన్ శిక్షణ సారథ్యంలో భారత్ 2011 ప్రపంచకప్ సాధించిన సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు సైతం కిర్‌స్టన్ చీఫ్ కోచ్‌గా వ్యవహరించారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886